
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు

16


గురువారం 4 జనవరి 2018



దండాలు.. దండాలు.. అమ్మోరు తల్లీ



అల్లూరు తిరునాళ్ల బుధవారం వైభవంగా జరిగింది. అక్కాచెల్లెళ్లయిన గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ ఒకేసారి దర్శనం ఇవ్వడంతో భక్తులు పులకించిపోయారు. అశేష భక్తజనం నడుమ అమ్మవార్ల గ్రామోత్సవం వేడుకగా సాగింది.



6న కోడూరుపాడుకు
సీఎం రాక

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ నెల 6వ తేదీన జిల్లాకు రానున్నారు. ఉదయం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ భవనాలు, ముత్తుకూరు రహదారి విస్తరణ, గొలగమూడిలో రెండు భవనాలను ఆయన ప్రారంభించనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2 నుంచి నాలుగు గంటల వరకు నెల్లూరు మండలం కోడూరుపాడులో జరిగే జన్మభూమి-మాఊరు గ్రామసభలో సీఎం పాల్గొననున్నారు. కలెక్టర్ ముత్యాలరాజు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, టీడీపీ నాయకులు కోడూరుపాడులో సీఎం సభ జరిగే ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు.

- 'జన్మభూమి' సభలో పాల్గొననున్న చంద్రబాబు
- ఉదయం పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- మధ్యాహ్నం నుంచి 'జన్మభూమి' కార్యక్రమానికి..
- సభాస్థలి పరిశీలన

7



కోడూరుపాడులో సీఎం సభాస్థలిని పరిశీలిస్తున్న కలెక్టర్, టీడీపీ నేతలు



భళా.. బాల

నమూనాలను ఆసక్తిగా చూస్తున్న కలెక్టర్ తదితరులు

స్వయం శుభ్రత మూత్రశాలను ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుంది.. మనం రోజూ ఉపయోగించే వస్తువుల్లో కల్తీలను ఏ విధంగా తెలుసుకోవచ్చు.. ఇలా ఒక్కటేమిటి ఎన్నో.. ఎన్నెన్నో ప్రయోగాలతో బాల శాస్త్రవేత్తలు అబ్బురపరిచారు. నెల్లూరులోని సెయింట్ జాన్స్ పాఠశాలలో బుధవారం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ రాష్ట్ర స్థాయి బాలల వైజ్ఞానిక, గణిత, పర్యావరణ ప్రదర్శన ప్రారంభమైంది. ముందుగా కలెక్టర్ ముత్యాలరాజు, జడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, విఠపు బాలసుబ్రహ్మణ్యం తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసిన ఈ ప్రదర్శనను ప్రారంభించారు.

9 లో..

కృష్ణపట్నం లెదర్ కాంప్లెక్స్ సదస్సు రసాభాస

- వివరాలు 6లో..



15 కోట్లు తాగేశారు!

- ఇదంతా రెండు రోజుల్లోనే!
- కొత్త ఏడాదిన ఏరులైన మద్యం

6

అవధూత భగవాన్ శ్రీశ్రీ వెంకయ్య స్వామి చారిటబుల్ ట్రస్టు పేరుతో ఓ తహసీల్దారు సాగిస్తున్న అక్రమ వసూళ్ల దందా జిల్లా రెవెన్యూ శాఖలో పెద్ద చర్చనీయాంశమై కూర్చుంది. నెల్లూరు తహసీల్దారు ముత్యం నరసింహులు చైర్మన్‌గా ఉన్న ఆ ట్రస్టు పేరిట జరుగుతున్న వసూళ్లపై ఉన్నతాధికారులకు ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ శాఖకు సంబంధించిన పనులపై తన వద్దకు వచ్చే వారినుంచి గుడి కోసం విరాళాలు సేకరిస్తున్నారని, వాటికి లెక్కాపక్కా ఉండదం లేదని ఆరోపణలు వస్తున్నాయి. మండలస్థాయి రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న వ్యక్తి ఇలా ట్రస్టు చైర్మన్‌గా వ్యవహరించకూడదని, సీసీఎల్ఏ నిబంధనలకు ఇది పూర్తి విరుద్ధమని తెలిసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. అంతేకాదు, నెల్లూరులో ఉన్న ఆలయం ట్రస్టును కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయడం ఏమిటన్న విమర్శలూ ఉన్నాయి. దైవకార్యం పేరిట సాగుతున్న ఈ దందాపై పాఠకులు వివరాలను 'ఆంధ్రజ్యోతి'కి అందించారు.



నెల్లూరు : నిర్మాణంలో ఉన్న వెంకయ్యస్వామి మందిరం

ఆంధ్రజ్యోతి పాఠకుల కూపీ

ట్రస్టు పేరుతో
వసూళ్లు!

- రెవెన్యూ అధికారి పబ్లిక్ దందా
- ట్రస్టు చైర్మన్‌గా తహసీల్దారు నరసింహులు
- ఏ పని కావాలన్నా గుడికోసం విరాళాలు
- కోవూరు సబ్ రిజిస్ట్రార్ వద్ద ట్రస్టు రిజిస్ట్రేషన్
- లక్షల వసూళ్లకు లెక్కాపక్కా లేదు
- సర్వీసు నిబంధనలకూ పూర్తి విరుద్ధం

8

'ఆధార్'ను ఎక్కడ వాడారో
తెలుసుకోండిలా..

- ఆరు నెలల చరిత్రను చూసుకోవచ్చు!
- అనుమానం ఉంటే లాక్ చేసుకోవచ్చు!

వరికుంటపాడు, జనవరి 3 : ప్రస్తుతం దేశంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు సంబంధించి ఏ సర్వీసు పొందాలన్నా ఆధార్‌కార్డు తప్పనిసరి. మొబైల్ సిమ్ కార్డు నుంచి పాన్ కార్డుల వరకు ఈ ఆధారే ఆధారమైంది. ఈ కార్డులో పౌరుడి వ్యక్తిగత సమాచారం మొత్తం నిక్షిప్తమై ఉంటుంది. మన వ్యక్తిగత రుజువుకు ఆధార్‌కు మించిందిలేదు. ఇందులో మన కంటి పాపలు, వేలిముద్రలు, చిరునామా వంటి వివరాలన్ని నిక్షిప్తమై ఉంటాయి. మీ ఆధార్ దుర్వినియోగమవుతున్నట్లు అనుమానం ఉందా..? అయితే మీ ఆధార్ ఎప్పుడు, ఎక్కడ ఎలా వాడారో తెలుసుకొనే అవకాశం ఆధార్‌కార్డు జారీ చేసే సంస్థ కల్పించింది. ఆ సమాచారం తెలుసుకొందాం..



ఆధార్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా

● మీ ఆధార్ ఎలా ఎక్కడ వినియోగించారో తెలుసుకొనేందుకు ఆధార్ అధికారిక వెబ్‌సైట్ **hpp//resedent. uiduia. gov.in** లాగిన్ అవ్వాలి. కనిపించే ముఖచిత్రంలో ఆధార్ సర్వీసెస్ అని కుడి వైపు ఓ కాలం కనిపిస్తుంది.

● ఆ కాలం కిందిభాగంలో ఆధార్ అథెంటిఫికేషన్ హిస్టరీ అని ఓ ట్యాగ్ కనిపిస్తుంది. అక్కడ క్లిక్ చేస్తే మరో విండో ఓపెన్ అవుతుంది.

● అక్కడ కనిపించే తేదీలో మీ యూఐడీ నెంబర్, క్యాప్చర్ కోడ్ నమోదు చేయాలి. జనరేట్ ఓపీటీ క్లిక్ చేస్తే మీ రిజిస్టర్ మొబైల్‌కు ఓపీటీ వస్తుంది.

● ఆ తరువాత తేదీలో మీకు ఎలాంటి సమాచారం కావాలో కొన్ని అప్షన్స్ ఇస్తే అవుతాయి. బయోమెట్రిక్, డెమోగ్రాఫిక్‌లాంటివి ప్రస్తుత తేదీ నుంచి గరిష్ఠంగా ఆరు నెలల కిందిటి వరకు మీరు ఆధార్‌ను ఎలా ఎక్కడ వాడారో తెలుసుకోవచ్చు. అయితే ఇక్కడ కొంచెం జాగ్రత్తగా ఆప్షన్ ఎంటర్ చేయాలి. లేకుంటే మీకు ఎర్రర్ చూపించే అవకాశముంది.

● అన్ని వివరాలు నమోదు చేశాక చివరి కాలంలో ఓపీటీ ఎంటర్ చేసి సబ్‌మెంట్ చేస్తే మొత్తం వివరాలు వస్తాయి. మీరు ఏ రోజు, ఏ సమయానికి, ఎలాంటి పని కోసం మీ ఆధార్‌ను ఇచ్చారన్న వివరాలు కనిపిస్తాయి.

● ఆధార్ వాడిన కంపెనీ లేదా ఏజెన్సీ పేర్లు మాత్రం చూపించదు. దానికి సంబంధించిన వివరాలను మాత్రమే అది చూపుతుంది.

● అనుమానం వస్తే లాక్ చేయవచ్చు. మీకు ఏదైనా అనుమానం వస్తే మీ ఆధార్ వివరాలు మీరు అనుమతిస్తే అవతలివారు వాడుకొనేలా చేయవచ్చు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో ఆధార్ అధికారిక వెబ్‌సైట్‌లో ఆధార్ వివరాలు లాక్ చేయవచ్చు. ఏదైనా ఏజెన్సీ లేదా సంస్థ ఆ వివరాలు తెలుసుకోవాల్సి వచ్చినప్పుడు మీరు అన్‌లాక్ చేసుకొనే సౌకర్యం ఉంది.

మీ కోసం MEE KOSAM



కచేరిలో తబలా వాయిస్తూ..

తభళా!

- సైకిల్ మెకానిక్ నుంచి ఆర్టిస్టుగా ఎదిగిన బాషా

కావలిరూరల్, జనవరి 3 : కావలి పట్టణ వైకుంఠపురానికి చెందిన సైకిల్ మెకానిక్ షేక్ మీరాసాహెబ్ (బాషా) కళామ్మతల్లి ముద్దుబిడ్డగా తబలా వాయిద్యంలో భేష్ అనిపించుకుంటూ ప్రత్యేక గుర్తింపు పొందాడు. ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం తెట్టు గ్రామానికి చెందిన బాషా తండ్రి రంతుల్లా కావలి పట్టణానికి వలస వచ్చారు. ఇక్కడ వృత్తిరీత్యా సైకిల్ మెకానిక్ అయినప్పటికీ ప్రవృత్తిగా పాటలు పాడేవారు. ఆయన తనయుడు బాషా ఆర్థిక వెసులుబాటు లేక 6వ తరగతి వరకు చదివి చదువుకు స్వస్తి చెప్పాడు. తండ్రికి చేదోడు, వాడోడుగా ఉంటూ సైకిల్ మెకానిక్‌గా కొనసాగుతున్నాడు. తన తండ్రి కళలను అందిపుచ్చుకున్న బాషా తబలా వాయిద్యంపై మక్కువ పెంచుకున్నాడు. 18వ ఏటా తబలా వాయిద్యంపై ఆకర్షితుడైన బాషా ఏకలవ్య సాధన చేశాడు. అనంతరం చెన్నైలోని శ్రీనివాస్, తిరుపతిలో లోకాభిరామన్ వద్ద తబలా వాయిద్యంలో మెళుకువలు నేర్చుకున్న బాషా అనేక ప్రదర్శనలో సంగీత ప్రియులను మెప్పించి తబలా బాషాగా పేరొందాడు.

● 5 వేలకు పైగా ప్రదర్శనలు

బాషా 40 ఏళ్లుగా తబలా వాయిస్తు రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాల్లో 5 వేలకు పైగా ప్రదర్శనలో పాల్గొని తన తబలా వాయిద్యంతో సంగీత ప్రియులను అలరించారు. ప్రముఖ సినీగాయకులు బాలు, జానకి, జిక్కీ, రామకృష్ణ కచేరిలకు వాయిద్య సహకారం అందించి వారి చేత శభాష్ అనిపించుకున్నారు. అలా తబలానే ఇంటిపేరుగా గుర్తింపు పొందుతూ యువ కళాకారులను ప్రోత్సహిస్తు వాయిద్య కళనే వృత్తి ప్రవృత్తిగా కొనసాగిస్తు ఆదర్శంగా నిలిచారు.



ఎస్పీ బాలుతో బాషా



● ప్రతిభకు గుర్తింపు

కావలి, ఒంగోలు, నెల్లూరు, అనంతపురం ఇలా ఎక్కడ ఘంటసాల, మహ్మద్ రఫీ పాటకచేరి జరిగిన బాషా అక్కడ ఉండాల్సిందే. ఒంగోలు పీఎం మెమోరియల్, నెల్లూరు సింహపురి సంగీత సభ, అనపర్తి ఘంటసాల ఆధారన కమిటీ, శ్రీ సాయి వెన్నెల ఆర్కెస్ట్రాలో బాషా ప్రతిభను గుర్తించి సత్కరించారు. తిరుపతి తిరుమల దేవస్థానం, ధర్మవరం కళాజ్యోతి, కాకినాడ ఘంటసాల గానామృతం, సంస్థలు బాషాకు ఆత్మీయ పురస్కారాలు అందజేశాయి. రాష్ట్ర స్థాయి ఉత్తమ తబలిస్టుగా రవీంద్రభారతీలో ప్రత్యేక సన్మానం అందుకున్నారు.

● కళాకారుడుకు గుర్తింపు కరువు

మన రాష్ట్రంతోపాటు వివిధరాష్ట్రాల్లో తబలిస్టుగా పని చేసి పలువురి ప్రశంసలు అందుకున్న బాషాకు ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. అనారోగ్య కారణంగా తబలా ప్రదర్శనలకు పెద్దగా వెళ్లకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం కళాకారులను ఆదుకుంటున్నామని చెబుతున్నా ఆచరణలో అమలు కావడం లేదు. ప్రభుత్వం గుర్తించి ఈ కళాకారుడికి ఆర్థిక ప్రోత్సాహం అందజేయాల్సి ఉంది. ప్రభుత్వం సహకరిస్తే యువ కళాకారులకు శిక్షణ ఇచ్చి వారిని ప్రోత్సహిస్తానని ఈ సందర్భంగా బాషా తెలిపారు

నెల్లూరులో పక్షుల పండుగ ర్యాలీ

నెల్లూరు(కలెక్టరేట్), జనవరి 3 : ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 7, 8, 9 తేదీలలో నిర్వహించనున్న పక్షుల పండుగకు సంబంధించి నగరంలోని వీఆర్సీ మైదానం నుంచి నర్తకీ సెంటర్ వరకు అధికారులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ బుధవారం నిర్వహించారు. ర్యాలీని జాయింట్ కలెక్టర్ మహ్మద్ ఇంతియాజ్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేలాది కిలోమీటర్ల దూరం నుంచి ఫ్లెమింగో, పెలికాన్ పక్షులు, గూడ కొంగలు తదితరాలు పులికాట్ తీరంలో విడిది చేస్తాయన్నారు. నేలపట్టు, బీవీ పాళెం, అటకాని తిప్ప, సూళ్లూరుపేట ప్రాంతాలలో వీటిని వీక్షించేందుకు వచ్చే వారికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు ఉన్నాయన్నారు. బీవీ పాళెంలో బోటు షికారు ప్రత్యేక ఆకర్షణ అన్నారు. మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ప్రకృతి ప్రేమికులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జేసి-2 వెంకటసుబ్బారెడ్డి, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో పక్షుల పండుగ ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ ఇంతియాజ్

జంగము దేవరలు
చాన్నాళ్లకు ప్రత్యక్షం



బుచ్చిరెడ్డిపాళెంలో ఇల్లిల్లూ తిరుగుతున్న జంగమ దేవరలు

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 3: పండుగ నెల ప్రారంభం అయిందంటే ప్రతి రోజూ వేకువ జామున హరిదాసులు, జంగమ దేవరలు గ్రామాల్లో ఇంటింటికీ వస్తుంటారు. జంగమ దేవరలు ప్రతి ఇంటివద్ద శంఖం ఊది, గంట వాయిస్తూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అందరికీ శుభాలు జరగాలని దీవెన వాక్యాలు పలుకుతూ గృహస్థులు ఇచ్చే కానుకలు స్వీకరించడం అనాదిగా వస్తున్న ఆచారం. గతంలో జంగమ దేవరలకు కొదవ ఉండేది కాదు. వారి సంఖ్య ఎక్కువై పట్టణ ప్రాంతాల్లో కూడా వీధులను విభజించుకొని ఇంటింటికీ తిరిగేవారు. అయితే, రోజులు మారాయి. పండుగ నెలలో వీరు కనిపించకుండా పోయారు. ప్రస్తుత తరం చిన్నపిల్లలకు జంగమ దేవర అంటే ఎవరో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో ఆదివారం నుంచి ఇద్దరు జంగమ దేవరలు బుచ్చిరెడ్డిపాళెంలో కనిపిస్తున్నారు. శంఖం ఊదుతూ ఇల్లిల్లూ తిరిగి ప్రజలకు దీవెనలిస్తూ కానుకలు స్వీకరిస్తున్నారు.



స్వచ్ఛభారత్- శాంతి భోగి ర్యాలీ

టైర్లు, ప్లాస్టిక్ వస్తువులతో
భోగి మంటలు వద్దు

- పండుగలో పర్యావరణాన్ని కాపాడాలి
- స్వచ్ఛభారత్- శాంతి భోగి ర్యాలీ

నెల్లూరు (వైద్యం), జనవరి 3 : భోగి మంటల్లో పర్యావరణానికి హాని కలిగించే ఎలాంటి వస్తువులు వేయవద్దంటూ ది ప్రైవేట్ మెడికల్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, బ్లాక్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరు చిల్డ్రన్స్ పార్కు వద్ద 'స్వచ్ఛభారత్- శాంతి భోగి' పేరిట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ సూపర్‌స్పెషాలిటీకి చెందిన పల్మనాలజిస్ట్ డాక్టర్ రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ భోగి మంటలో టైర్లు, ట్యూబ్‌లు, ప్లాస్టిక్ వస్తువులు వేయడం వల్ల కాలుష్యం వ్యాపించి టీబీ, క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. అందువల్ల అందరూ సంప్రదాయక రీతిలోనే భోగిమంట వేయాలని కోరారు. డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కాల్చడం వల్ల వెలువడే విష వాయువుల కారణంగా చిన్నపిల్లలు, వృద్ధులు, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఆచార్య ఆదిత్య మాట్లాడుతూ మన ఆచారం ప్రకారం భోగిలో తాటాకులు, చీపుర్లు, పాత కుర్చీలు, గంపలు వంటివి మాత్రమే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, బ్లాక్ పోర్టు మిత్రమండలి అధ్యక్షుడు నరసాపురం ప్రసాద్, జ్ఞానేంద్ర సరస్వతి అంధుల పాఠశాల అధ్యక్షుడు రవికుమార్, వికలాంగుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, లోక్‌సత్తా ఉపాధ్యక్షుడు రసూల్, దశధర రామిరెడ్డి, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ టెన్నిస్‌లో

తెలంగాణ, తమిళనాడు హవా

» నేటి నుంచి క్వార్టర్ ఫైనల్స్



డబుల్స్ పోటీలో తలపడుతున్న బాలికలు

కావలిటౌన్, జనవరి 3: స్థానిక విశ్వోదయ టెక్నికల్ అకాడమి ఆధ్వర్యంలో విట్స్ ఇంజనీరింగ్ కళాశాల టెన్నిస్ క్రీడా ప్రాంగణంలో బుధవారం జరిగిన డీఆర్ మెమోరియల్ అండర్-16 జాతీయ సిరీస్ టెన్నిస్ ప్రీ క్వార్టర్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. విశ్వదయ టెక్నికల్ అకాడమీ ఛైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్న పోటీల్లో బుధవారం తెలంగాణా, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఎక్కువ మంది సత్తా చాటి క్వార్టర్ ఫైనల్స్‌కు ప్రవేశించారు. టోర్నమెంట్ కమిటీ డైరెక్టర్ దొడ్ల లిఖిత్‌రెడ్డి, ఆర్గనైజర్ అనుమలశెట్టి రామకృష్ణలు మాట్లాడుతూ గురువారం క్వార్టర్ ఫైనల్స్, శుక్రవారం సెమీఫైనల్స్, శనివారం ఫైనల్స్‌తో పోటీలు ముగుస్తాయన్నారు.

ప్రీ క్వార్టర్స్ విజేతలు వీరే : బాలికల సింగిల్స్ విభాగంలో తెలంగాణాకు చెందిన సంజన, తమిళనాడుకు చెందిన సాయి దివ్యపై 6-0, 6-0 స్కోరుతో, తమిళనాడుకు చెందిన కిరణ్‌రాణి తెలంగాణాకు చెందిన అగయ్య బిందిపై 6-1, 6-1 స్కోరుతో విజయం సాధించారు. తమిళనాడుకు చెందిన సృజనరాయల్, తమిళనాడుకే చెందిన విధికాకర్లపై 6-2, 6-0 స్కోరు తేడాతో, ఏపీకి చెందిన లక్ష్మీరెడ్డి, తెలంగాణాకు చెందిన అదితిపై 6-2, 6-4 స్కోరు తేడాతో, ఏపీకి చెందిన జైతా అసుపు, తమిళనాడుకు చెందిన వెంకటకృష్ణన్ 7-5, 6-4 స్కోరుతో, తెలంగాణాకు చెందిన పావణీ పాటక్ కునుందాపై 6-4, 7-5, 6-2 స్కోర్లతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు ప్రవేశించారు.

బాలుర సింగిల్స్ పోటీల్లో తెలంగాణాకు చెందిన వశీం మహారాష్ట్రకు చెందిన 6-3, 6-1 స్కోరు తేడాతో, తమిళనాడుకు చెందిన భూపతి, తమిళనాడుకే చెందిన 6-3, 6-1 స్కోరుతో విజయం సాధించారు. తమిళనాడుకు చెందిన ఆదిత్య కుమరన్, కర్ణాటకకు చెందిన అర్జున్‌పై 6-0, 6-2 స్కోరుతో తమిళనాడుకు చెందిన కుమార్, మహారాష్ట్రకు చెందిన ఫయాజ్‌పై 6-1, 6-4 స్కోరుతో కర్నాటకు చెందిన అర్నవ్ పతంగి ఏపీకి చెందిన దీపక్‌పై 6-1, 6-0 స్కోరుతో ఏపీకి చెందిన రాహుల్‌గాంధి, గుజరాత్‌కు చెందిన కిరణ్‌పై 6-2, 7-6 స్కోరుతో గుజరాత్‌కు చెందిన మోహిత్, తమిళనాడుకు చెందిన రాజ్‌పై 6-0, 6-2 స్కోరుతో హర్యానాకు చెందిన దహియా, కర్నాటకకు చెందిన రూపేష్‌పై 6-3, 6-2 స్కోరుతో తెలంగాణాకు చెందిన శిశిధర్ , తమిళనాడుకు చెందిన హితే ష్‌పై6-3, 6-1 స్కోరుతో విజయం సాధించి క్వార్టర్‌ఫైనల్స్‌కు ప్రవేశించారు.

లక్ష్యం దిశగా మైనింగ్ శాఖ!

» ఇప్పటికే 52 కోట్లు రాయల్టీ వసూలు » ప్రభుత్వ లక్ష్య నిర్దేశం 88 కోట్లు » గతేడాది రికార్డు స్థాయిలో..

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 3 : జిల్లా మైనింగ్ శాఖ రాయల్టీ వసూళ్లలో నిర్దేశించిన లక్ష్యం దిశగా పయనిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ. 88 కోట్లు రాయల్టీని వసూలు చేయాలని జిల్లా మైనింగ్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. గడిచిన మూడు నెలలో దాదాపు రూ. 52.80 కోట్లు వసూలు చేశారు. మార్చి చివరిలోగా లక్ష్యం పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా మైనింగ్ శాఖకు ప్రధానంగా క్వారీలు, సిలికా, క్వాడ్జ్, అభ్రకం, తెల్లరాయి, ఎర్రమట్టి క్వారీలు లీజులు ఎక్కువగా ఉన్నాయి. వీటికి సంబంధించిన రవాణా చేయాలంటే టన్నుకు మైనింగ్ శాఖ ధర నిర్ణయించిన ప్రకారం ఆ శాఖకు చెల్లించాలి. అక్రమ రవాణా, అధిక లోడు వాహనదారులు, లీజుదారుల నుంచి అపరాధం వసూలు చేస్తారు. ఇలా మైనింగ్ శాఖ ద్వారా ఏటా రాష్ట్ర ప్రభుత్వానికి రూ. కోట్లలో రాయల్టీ లభిస్తోంది.

రాష్ట్ర మైనింగ్ శాఖ గత ఏడాది నెల్లూరు జిల్లాకు రూ. 52 కోట్లు రాయల్టీ వసూలు లక్ష్యాన్ని నిర్దేశించింది. జిల్లాలో అనూహస్యంగా జాతీయ రహదారులు నిర్మాణం చేపట్టడంతో వారికి గ్రావెల్, మట్టి సరఫరా చేసినందుకు ఆ శాఖ ఆదాయం పెరిగింది. దాదాపు రూ. 72 కోట్లు రాయల్టీని వసూలు చేశారు. జిల్లా మైనింగ్ శాఖ రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరులో 5వ స్థానంలో ఉంది..

సులువుగా లక్ష్యాన్ని చేరుతాం

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని ఈ ఏడాది సులువుగా చేరుకుంటాం. దామవరంలో వస్తోన్న ఎయిర్‌పోర్టు వారు గ్రావెల్ కోసం నగదును మైనింగ్ శాఖకు రాయల్టీగా చెల్లించనున్నారు. మార్చి నెలాఖరు లక్ష్యాన్ని పూర్తిచేస్తాం.

- ఏ రాజశేఖర్, మైనింగ్ శాఖ ఏడీ

కనుపూరు కాలువ నీటి విడుదలపై ట్రైనీ కలెక్టర్ ఆరా



కనుపూరు కాలువ పారుదలను మ్యాప్‌లో పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

నెల్లూరురూరల్ జనవరి 3 : జిల్లాలో శిక్షణ నిమిత్తం వచ్చిన ఐఏఎస్ అధికారి ఆర్. మహేష్‌కుమార్ జలవనరులశాఖ నెల్లూరు ఈఈ పీ కృష్ణామోహన్‌తో కలసి బుధవారం కనుపూరు కాలువ వెంబడి పర్యటించారు. సంగం నుంచి సిద్ధవరప్పాడు వరకు సుమారు 27 కి.మీ మేర కనుపూరు కాలువ పై సాగునీటి పంపిణీ, మోటార్ల నిర్వహణ, చెరువులకు చేరుతున్న నీటి విడుదల పై ఆరా తీశారు. రైతులతో కలిసి ఇబ్బందులు తెలుసుకున్న ఆయన కలెక్టర్ రేవు ముత్యాలరాజు దృష్టికి తీసుకెళ్తానని వెల్లడించారు. ఆయన కనుపూరు కాలువపై కొంత భాగం జరిగిన లెవలింగ్ పనులను పరిశీలించారు.ఆయన వెంట కనుపూరు కాలువ డీఈ అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీ ఛైర్మన్ మస్తాన్‌నాయుడు, జేఈలు ఎన్ బాలసుబ్రమణ్యం, వెంకటకృష్ణా, వీరస్వామి, వినోద్‌కుమార్, విక్రం ఉన్నారు.



వైద్య శిబిరాలకు స్పందన

అనంతసాగరం, జనవరి 3: మండలంలోని బెడుసుపల్లి, మంచాలపల్లి, పాతాళపల్లి గ్రామాల్లో బుధవారం జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరాలు నిర్వహించారు. అనంతసాగరం వైద్యాధికారి హరికృష్ణ ఆధ్వర్యంలో మంచాలపల్లిలో బీపీ, మధుమేహం పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

ఆత్మకూరు, జనవరి 3: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను చదువు, వయసుతో నిమిత్తం లేకుండా క్రమబద్ధీకరించాలని యూఈఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ శివప్రసాద్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్ట్‌కార్మికుల ఐక్యవేదిక పిలుపు మేరకు ఆత్మకూరులో కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సమానపనికి సమానవేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్‌వ్యవస్థను రద్దుపరచి విద్యుత్‌సంస్థ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ కార్మికులు మరణిస్తే రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కనీస వేతన చట్టాన్ని అమలు పరచాలని పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

» ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

ఆత్మకూరు, జనవరి 3: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఆది ఆంధ్రపాఠశాల ఆవరణలో బుధవారం 11, 12 వార్డులకు సంబంధించి జన్మభూమి గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం, నూతన రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం పని చేస్తున్నారని, అదే స్ఫూర్తితో అధికారయంత్రాంగం సైతంముందుకు కదులుతుందని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. అనంతరం నూతన రేషన్‌కార్డులను, పింఛన్లు, చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ రాగి వనమ్మ, మున్సిపల్ కౌన్సిలర్లు దోర్నాదుల సురేష్‌బాబు, జీ నాగభూషణమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ చంద్రా వెంకటసుబ్బానాయుడు, జన్మభూమి కమిటీ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.





జన్మభూమి సభలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, రావులకొల్లులో రుణమాఫీపత్రాలను పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రాష్ట్రప్రభుత్వం ప్రజాసమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా జన్మభూమి-మాఊరు గ్రామసభలను నిర్వహిస్తున్నదని ఇన్‌చార్జి తహసీల్దారు సుబ్బయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రావులకొల్లు, కనుపూరుపల్లి గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం అధికారులను, ప్రజాప్రతినిధులను గ్రామాల్లోకి పంపే దిశగా జన్మభూమి కార్యక్రమాన్ని కొనసాగిస్తుందన్నారు. ఐదవ విడత జన్మభూమి కార్యక్రమంలో కుటుంబవికాసమే సమాజ వికాసం, సమగ్ర రాష్ట్ర వికాసం అనే లక్ష్యంతో కార్యక్రమాన్ని రూపొందించారని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ ఉపాధ్యక్షుడు రామిరెడ్డి మోహన్‌రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటల పోటీలు

ఆత్మకూరు, జనవరి 3: పట్టణంలో ఈ నెల 13వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఆత్మకూరు గణేష్, అధ్యక్షుడు నందా శ్రీనువాసులు తెలిపారు. గత 37 సంవత్సరాల నుంచి ఆనవాయితీగా డీవైఎఫ్ఐ సంక్రాంతి ఆటల పోటీలను కొనసాగిస్తూ యువతకు దిశానిర్ధేశం చేస్తున్నామని పేర్కొన్నారు.

మోదీతోనే దేశ ప్రగతి : సురేష్‌రెడ్డి

ఆత్మకూరు, జనవరి 3: దేశప్రగతి నరేంద్రమోదీతోనే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని, ఇందుకు ఇటీవల జరిగిన గుజరాత్ ఎన్నికలే ప్రత్యక్ష నిదర్శనమని బీజేపీ రాష్ట్ర ప్రధా న కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆత్మకూరులో బీజేపీ శ్రేణులతో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందచేసే నిధులతో చేపట్టే సంక్షేమ పథకాలకు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం పేర్లు మార్చి అమలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టడం సరికాదన్నారు. సొమ్ము కేంద్రానిదైతే సోకు రాష్ట్రానిదిగా ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం దారుణమన్నారు. మహాత్మాగాంధీగ్రా మీణ ఉపాధి హామీ పథకం నిధులతో పనులు చేపడుతూ రాష్ట్రప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఊసే వెల్లడించకపోవడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీపథకం నిధులతో చేపట్టే సిమెంట్‌రోడ్లను పూర్తిగా చంద్రన్నబాట పథకంలో సిమెంట్ రోడ్లుగా టీడీపీ నేతలు ప్రచారం చేసు కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రన్నభీమా పథకం సైతం కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల మాటున జిల్లాలో కోట్లాది రూపాయల అవినీతి జరుగుతుందన్నారు. ఇందులో ఆత్మకూరులో స్వచ్ఛభారత్ కింద చేపట్టిన మరుగుదొడ్ల నిర్మాణంలో జరిగిన అ వినీతే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. కేంద్రప్రభుత్వం చేపట్టిన ముద్రా రుణాల అమలులో సైతం కొందరు అధికారపార్టీ నేతలు చేతివాటం చూపుతుండడంతో పలు అక్రమాలు యధేచ్ఛగా జరుగుతున్నాయన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేర ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రాష్ట్రపతి, ప్రధానమంత్రి ఫొటోలు ఏర్పాటు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్రప్రభుత్వం చెబుతున్నా పూర్తిస్థాయిలో అర్హులకు అందడం లేదన్నారు.



ఆర్డీవో కార్యాలయంలో దేశ ప్రధాని మోదీ, రాష్ట్రపతి కోవింద్ చిత్రపటాలను బహూకరిస్తున్న బీజేపీ నేతలు

అనంతరం ఆర్డీవో కార్యాలయంలో దేశప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్రపతి రామనాథ్‌కోవింద్ చిత్రపటాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మిడతల రమేష్, కంచె సుధాకర్‌రెడ్డి, విజయలక్ష్మి, అన్నం శ్రీనివాసులు, మారుతికుమార్‌రెడ్డి, జిల్లా యువమోర్చానాయకులు మాకిరెడ్డి జనార్దన్, మాధవ్, స్థానిక బీజేపీ నేతలు వాసిపల్లి నారాయణరెడ్డి, చెర్లో శ్రీనివాసులురెడ్డి, రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు



రేషన్‌కార్డులు అందచేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అనంతసాగరం, జనవరి 3: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి మహేశ్వరయ్య, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ రాపూరు సుందరరామిరెడ్డి తెలిపారు. ఎన్టీఆర్ భరోసా కింద అర్హులైన అందరికీ పెన్షన్లు మంజూరు చేస్తున్నట్లు తెలి పారు. అనంతరం చంద్రన్నకానుకలను, పావ లా వడ్డీరుణాల పత్రాలు, కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్, సర్పంచు విజయలక్ష్మి, వైద్యాధికారి హరికృష్ణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మంద కృష్ణను అరెస్ట్ చేయడం అన్యాయం

ఆత్మకూరు, జనవరి 3: ఎస్సీ వర్గీకరణ కోసం శాంతియుతంగా ఉపవాసదీక్షను చేపడుతున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను అరెస్ట్ అన్యాయమని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వెంకట్‌మాదిగ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాల సమావేశాలలో ఎస్సీవర్గీకరణకు బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేర శాంతియుతంగా తన నివాసంలో ఉపవాసదీక్ష చేపడుతున్న మంద కృష్ణమాదిగను అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టేవరకు ఉద్యమం ఆగదన్నారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దారు సుబ్బయ్యకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నేతలు పెంచలయ్య, మహేష్, పుల్లయ్య, పలువురు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ లారీ బోల్తా

సంగం, జనవరి 3: మండలంలోని కలిగిరి రహదారిలో కొండారెడ్డితోటకు ఎదురుగా అదుపుతప్పి బుధవారం సిమెంట్ లారీ బోల్తా పడింది. సంగం వైపు నుంచి కలిగిరికి సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి సడన్ బ్రేకు వేయడంతో అదుపు తప్పి లారీ బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.



బోల్తాపడిన సిమెంట్ లారీ

ఆటో, స్కూటర్ ఢీ : నలుగురికి గాయాలు

సంగం, జనవరి 3: మండలంలోని గాంధీ జనసంఘం వద్ద ముంబాయి రహదారిపై బుధవారం ఆటో, స్కూటర్ ఢీకొన్న సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ప్రయాణికులతో ఆత్మకూరు నుంచి బుచ్చి వైపు ఆటో వెళ్తుండగా మార్గమధ్యలో గాంధీజనసంఘం వద్ద ఎదురుగా వస్తున్న స్కూటర్ ఢీకొంది.. ఈ సంఘటనలో ఆటో రహదారి పక్కన ఉన్న పంట కాలువలో బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో సంగం వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.



బోల్తాపడిన సిమెంట్ లారీ

అంగన్‌వాడీలకు వంట సామాగ్రి పంపిణీ



మర్రిపాడు, జనవరి 3: మండలంలోని బూదవాడలో వున్న 6 అంగనవాడీ కేంద్రాలకు పంచాయతీ నిధులతో వంటసామగ్రిని బుధవారం జన్మభూమి గ్రామసభలో తహసీల్దారు పద్మావతి, సర్పంచు వసంత పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మాజీ సర్పంచు ముటుకుందు లక్ష్మీరెడ్డి, గ్రామపెద్దలు ముటుకుందు సిద్ధారెడ్డి, అంగనవాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు : ఆనం





ఏఎస్‌పేట : మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సంగం : పొదుపు మహిళలకు వడ్డీలేని రుణపత్రాలను పంపిణీ చేస్తున్న ఆత్మకూరు ఎమ్మెల్యే గౌతమ్‌రెడ్డి

ఏఎస్‌పేట, జనవరి 3: తెలుగుదేశం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించడానికి జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని రాజవోలు, దూబగుంట గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసేందుకు అధికారులతో పాటు నాయకులు గ్రామాలకు విచ్చేసేందుకు జన్మభూమి వేదికగా మారుతుందన్నారు. అనంతరం పలు సమస్యలపై అర్జీలను స్వీకరించి పొదుపుమహిళలకు వడ్డీరుణ పత్రాలు, చంద్రన్న కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బాపిరెడ్డి, తహసీల్దారు నాగరాజు, ఎంపీడీవో రమణయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు మాల్యాద్రినాయుడు, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, నాయకులు అల్లంపాటి వెంకటకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

పాఠశాలకు గ్రౌండ్ ఏర్పాటు చేయండి

మండలంలోని రాజవోలు గ్రామ ప్రాథమిక పాఠశాలలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయాలని బుధవారం విద్యార్థులు మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి వినతిపత్రం అందచేశారు.

పెన్షన్ పద్ధతిని ప్రవేశపెట్టాలి

రాజవోలు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రస్తుతం అమలులో ఉన్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని ఆనంకు వినతిపత్రం అందచేశారు.

జన్మభూమి కార్యక్రమం మంచిదే...

సంగం, జనవరి 3: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన జన్మభూమి - మాఊరు కార్యక్రమం మంచిదేనని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని వంగల్లులో జరిగిన జన్మభూమిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు ప్రజల వద్దకే వచ్చి సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం కోసం జన్మభూమి - మాఊరు ఉపయోగకరంగా ఉందన్నారు. దీన్ని అధికారులు పార్టీలకతీతంగా చేయాలన్నారు. ఆత్మగౌరవం పథకంలో చేపట్టిన మరుగుదొడ్లు నూరుశాతం వాడుకోవాలని కోరారు. గ్రామంలో ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ నిధులతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు కృషి చేస్తానని తెలిపారు. మా పార్టీ అధికారంలోకి వస్తే ఇప్పుడిస్తున్న వెయ్యి రూపాయల పింఛన్ రెండు వేలు చేస్తానని జగనన్న తెలిపారన్నారు. అనంతరం వివిధ పథకాల కింద మంజూరైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫిఖాన్, ఎంపీపీ కామాక్షమ్మ, అన్ని శాఖల అధికారులు, టీడీపీ నాయకులు ఆనం ప్రసాద్‌రెడ్డి, రఘురామయ్య, వైసీపీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, మధురెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

జీవనోపాధి భృతి కల్పించాలని వినతి

కనిగిరి రిజర్వాయర్‌లో చేపల వేట నిషేధంతో జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు జీవన భృతి కల్పించాలని జంగాలకండ్రిక గిరిజనలు జన్మభూమి కార్యక్రమానికి వచ్చిన అధికారులకు బుధవారం అర్జీ అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనులకు మద్ధతుగా గ్రామ సర్పంచు కుమార్‌స్వామి, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖరయ్య పాల్గొన్నారు.

వెలవెలబోయిన గ్రామసభలు

మర్రిపాడు, జనవరి 3: మండలంలో జన్మభూమి గ్రామసభలు బుధవారం కొనసాగాయి.మండలపరిధిలోని నాగినేనిగుంట, బ్రాహ్మణపల్లి, బూదవాడ పంచాయతీలో మండలాధికారులు గ్రామసభలను నిర్వహించారు. నాగినేని గుంటలో నిర్వహించిన గ్రామసభ ప్రజలు లేక వెలవెలబో యింది.బ్రాహ్మణపల్లి, బూదవాడల్లో ప్రజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని అధికారులకు సమస్యలను విన్నవించారు. అనం తరం విద్యార్థులకు ఆటలపోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో చంద్రశేఖర్, డీటీ రవి కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధశాఖల మండలాధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జన్మభూమి

చేజర్ల, జనవరి 3: గ్రామాల్లోని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కోటితీర్థం, ఎన్‌వీ.కండ్రిగ, పాతపాడు గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులపై వివరించారు. అనంతరం చంద్రన్నకానుకలు, రేషన్‌కార్డులు, రుణమాఫీపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సల్మాన్‌షరీన్, ఎంపీడీవో మాణిక్యం, తహసీల్దారు హమీద్, డిప్యూటీ తహసీల్దారు శివరామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షులు మోదేపల్లి నవకృష్ణచౌదరి, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

ఓబులాయపల్లి చెరువు వేలం

చేజర్ల, జనవరి 3: మండలంలోని ఓబులాయపల్లి గ్రామ చెరువుకు ఈ నెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో 1427 ఫసలీకి సంబంధించి చేపలు పట్టుకునేందుకు వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా డిపాజిట్ చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందచేస్తున్న ఉద్యోగులు

అనంతసాగరం, జనవరి 3: ఉద్యోగస్తులకు సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేసేలా ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని పాతాళపల్లిలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు తహసీల్దారు చెంచుకృష్ణమ్మకు వినతిపత్రం అందచేశారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో బుధవారం జన్మభూమి-మాఊరు కార్యక్రమం జరగ్గా స్థానిక ఉపాధ్యాయులు, ఉద్యోగులు సీపీఎస్ విధానం రద్దుకు ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించేలా అధికారులు చొరవ చూపాలని వినతిపత్రం ద్వారా విన్నవించారు. సీపీఎస్ విధానంతో ఎంతో మంది ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సావిత్రిబాయి పూలే సేవలు ఆదర్శనీయం



ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అనంతసాగరం, జనవరి 3: మొట్టమొదటి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే సేవలు మహిళలకు ఆదర్శనీయమని అనంతసాగరం ఎంపీపీ కమతం శోభ తెలిపారు. అనంతసాగరం హిందూ మెయిన్ పాఠశాలలో సావిత్రిబాయి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులు నిర్మలాదేవి, అనురాధ, విజయలక్ష్మిలను పలువురు శాలువా, పూలమాలలతో సన్మానించారు.

శాంతిహోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేకపాటి

మర్రిపాడు, జనవరి 3: మండల పరిధిలోని కంపసముద్రంలో శ్రీ కృష్ణుడి ఆలయం వద్ద బుధవారం జరిగిన శాంతిహోమంలో ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి గౌతంరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని హోమ పూజలు చేశారు. ఆలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన తరుణంలో ఈ శాంతిహోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చెన్ను శ్రీధర్‌రెడ్డి, గోపవరం కాంతారెడ్డి, నారపురెడ్డి సుబ్బారెడ్డి, రాజారెడ్డి, మల్లు రమణారెడ్డి, సుందరరామిరెడ్డి, వైసీపీ నాయకులు బొర్రా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కంపసముద్రం గ్రామంలో జరుగుతున్న శాంతిహోమం

సాగరం ఇన్‌చార్జి ఎంఈవోగా సత్యనారాయణ

అనంతసాగరం, జనవరి 3: అనంతసాగరం మండల ఇన్‌చార్జి విద్యాశాఖాధికారిగా మర్రిపాడు ఎంఈవో సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతసాగరం ఎంఈవోగా పని చేస్తున్న చలమయ్య ఇటీవల పదవీ విమరణ పొందడంతో ఎంఈవో పోస్టు ఖాళీ అయింది. ఇన్‌చార్జి ఎంఈవోగా సత్యనారాయణ ఎంఈవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించగా పలు ఉపాధ్యాయసంఘాల నాయకులు ఆయన్ను అభినం దించారు. విధినిర్వహణలో అంకితభావంతో ఉండాలని ఎంఈవో సత్యనారాయణ సూచించారు. అంతేకాక ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా పనిచేయాలని కోరారు. పాఠశాలలో విద్యార్థుల డ్రాపౌట్స్ లేకుండా చూడాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

సావిత్రిబాయి పూలేతో మహిళలకు గుర్తింపు

సంగం, జనవరి 3: సావిత్రిబాయిపూలే కృషి వల్ల నేడు మహిళలకు గుర్తింపు వచ్చిందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతమ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక విద్యావనరుల కేంద్రంలో జరిగిన సావిత్రిబాయిపూలే జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలు అర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమములో ఎంఈవో హనుమయ్య, ఉపాధ్యాయులు త దితరులు పాల్గొన్నారు. అదేవిధం గా సంగంలోని భవిత స్కూల్‌లో సావిత్రిబాయిపూలే జయంతిని పురష్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఉపాధ్యాయినులకు సన్మానం

ఏఎస్‌పేట, జనవరి 3: ఏఎస్‌పేటలోని జడ్పీహైస్కూల్‌లో బుధవారం సావిత్రిపూలే జయంతి సందర్భంగా ఉపాధ్యాయినులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు ఆమె సేవలను కొనియాడారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరీ కేసీ.రాఘవయ్య, సీఆర్‌పీ రఫీ, లైబ్రరీయన్ నారాయణరావు, ఉపాధ్యాయులు , తదితరులు పాల్గొన్నారు.



సంగం : సన్మానం అందుకున్న ఉపాధ్యాయినులు

ఆనకట్టను పరిశీలించిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్

సంగం, జనవరి 3: సంగం ఆనకట్టను ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మహేశ్ కుమార్ బుధవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఈఈ కృష్ణమోహన్ సంగం ఆనకట్ట కుడి, ఎడమ వైపు ఉన్న కాలువలను మ్యాప్ ద్వారా వి వరించారు. ఆనకట్ట ద్వారా జి ల్లాలోని డెల్టాకు సరఫరా అవుతు న్న నీటి వివరాలను వివరించా రు. అనంతరం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి కనుపూరు కాలువను పరిశీలించారు. ఆనకట్టకు దక్షిణం వైపు నిర్మాణంలో ఉ న్న నెల్లూరు తాగునీటి పైలెట్ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ ఇరిగేష్, సాగునీటి రంగంపై అవగాహన చేసుకొనేందుకు ఆనకట్ట పరిశీలనకు వచ్చానన్నారు. స్థానిక అధికారులతో అన్ని వివరాలు తెలుసుకుంటున్నాన్నారు. ఆయన వెంట కనుపూరు కాలువ డీఈ అనిల్ కుమార్‌రెడ్డి, ఏఈ కృష్ణ తదితరులు ఉన్నారు.



సంగం ఆనకట్ట మ్యాప్‌ను పరిశీలిస్తున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ మహేశ్ కుమార్

జిల్లా ఎస్పీ	9440796300	డీఎస్పీ (డీటీసీ)	9440700090
ఏఎస్పీ (అడ్మిన్)	9440796301	డీఎస్పీ (ఎస్సీఎస్టీ సెల్-1)	9490439564
ఏఎస్పీ (ఏఆర్)	9440796388	డీఎస్పీ (ఎస్సీఎస్టీ సెల్-2)	9491085279
ఓఎస్డీ (క్రైమ్స్)	9490619608	నగర డీఎస్పీ	9440796303
స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) డీఎస్పీ	9440796384	సీసీఎస్ డీఎస్పీ	9491081697
డీఎస్పీ (ఏఆర్)	9440796377	ట్రాఫిక్ డీఎస్పీ	9491085280
డీఎస్పీ (హోంగార్డ్స్)	9440794416	మహిళా స్టేషన్ డీఎస్పీ	9490439561

రూరల్ డీఎస్పీ	9440796317	ఆత్మకూరు డీఎస్పీ	9440796389
కావలి డీఎస్పీ	9440796333	సీఐడీ డీఎస్పీ	9440700896
గూడూరు డీఎస్పీ	9440796340	విజిలెన్స్ డీఎస్పీ	8008203302

నేరాలు - ఘోరాలు

సంక్షిప్తం


హరి మృతదేహం

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

వెంకటాచలం, జనవరి 3 : కుటుంబ కలహాల కారణంగా ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎగువమిట్ట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పూనమల్లి హరి(42) కుటుంబ కలహాల కారణంగా మంగళవారం రాత్రి ఇంట్లోని ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించేసరికే ఆయన మృతి చెందాడు. కాగా పెళ్లయి 14 ఏళ్లు అయిన పుట్టికి సంతానం లేకపోవడం వల్ల భార్యాభర్తల మధ్య సఖ్యత కొరవ డిందని పోలీసులు చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి మత్స్యకారుడి మృతి


మృతి చెందిన అక్కంగారి చిన్నయ్య

వావిళ్లదొరువు (కోట), జనవరి 3: మోటార్‌బైక్ అదుపుతప్పడంతో ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. గోవిందపల్లిపాళెంకు చెందిన అక్కంగారి చిన్నయ్య (45) కొత్తపట్నంలో నిర్వహిస్తున్న కృష్ణపట్నం లెదర్ కాంప్లెక్స్ అవగాహన శిబిరానికి హాజరై, తిరిగి వెళుతుండగా, వావిళ్లదొరువు వద్ద అతి వేగం కారణంగా అదుపు తప్పి పక్కనే ఉన్న కాలువలో పడిపో యింది. ఈ సంఘటనలో చిన్నయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై కేవీ నారాయణ రెడ్డి పంచనామా ఏర్పాట్లు చేశారు.

అనుమానాస్పద స్థితిలో..

దగదర్తి, జనవరి 3 : మండలంలోని అనంతవరం గ్రామ పంచాయతీ పరిధిలోని రిజర్వు ఫారెస్ట్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడాన్ని బుధవారం గ్రామస్థులు గుర్తించారు. వీఆర్‌వోకు సమాచారం అందడంతో దగదర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహం పూర్తిగా దెబ్బతిని ఉబ్బడంతో గాయాలు గుర్తించలేకపోతున్నారు. మబ్బురంగు చొక్కా, బులుగు రంగు లుంగీ ధరించి ఉన్నాడు. చొక్కా వెను కభాగాన ప్రియ టైలర్స్ కావలి అని లేబుల్ ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫుల్లు కిక్కు..!



- కొత్త ఏడాదిన ఏరులైన మద్యం
- తాగి ఊగిన మందుబాబులు
- 2 రోజుల్లో రూ.15 కోట్లు తాగేశారు
- ధరలు పెరిగినా ఆగని కొనుగోళ్లు
- బీర్ల అమ్మకాలదే పైచేయి

నెల్లూరు (క్రైం) జనవరి 3 : నూతన సంవత్సర రాక సందర్భంగా మందుబాబులు ఫుల్లుగా తాగేశారు. మద్యం ధరలు పెరిగినా ఏ మాత్రం పట్టించుకోలేదు. పీకల్లోతు తాగి ఎంజాయ్ చేశారు. కొత్త సంవత్సరం పుణ్యమా మద్యం షాపులకు మంచి వ్యాపారమే జరిగింది. మద్యం ప్రియులు రెండ్రోజుల్లో రూ.15 కోట్లకు తాగేశారు. రెండురోజుల పాటు రెండు గంటల సమయం అదనంగా ఇవ్వడంతో మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 35 శాతం అమ్మకాలు పెరిగినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. జిల్లాలోని నెల్లూరు, గూడూరు ఎక్సైజ్ పరిధిలో మొత్తం 349 మద్యం దుకాణాలు, 44 బార్‌లు ఉన్నాయి. ఆయా దుకాణాల్లో నెలకు వందకోట్ల రూపాయల మందు విక్రయాలు జరుగుతాయి. మద్యం కొత్తపాలసీ వచ్చిన నాటి నుంచి బెల్టు దుకాణాల సంఖ్య కొంత మేర తగ్గడం, పోలీసు, ఎక్సైజ్‌శాఖలు నిబంధనలు కఠినతరం చేయడం, సమయపాలన పాటించడం, ఎమ్మార్పీకే మద్యాన్ని విక్రయించడంతో మద్యం అమ్మకాలు తగ్గుతాయని ఎక్సైజ్ అధికారులు భావించారు. వారి అంచనాలు తారుమారు అయ్యాయి. గతేడాదితో పోల్చితే 30 శాతం అమ్మకాలు పెరిగాయి. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ముఖ్యంగా యువకులు మద్యంలో మునిగి తేలడం వల్ల అది సాధ్యమైంది. గత ఏడాది కంటే ఈ ఏడాది బీర్ల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. డిసెంబరు 31, జనవరి ఒకటో తేదీల్లో 2 గంటల సమయం అదనంగా సేల్స్ జరుపుకో వచ్చని ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులివ్వడంతో వ్యాపా రులు ఎగిరి గంతేశారు. అందుకనుగుణంగా పెద్ద ఎత్తున స్టాక్‌ను దించుకున్నారు. ఫలితంగా ఎక్సైజ్ శాఖకు ఆదాయం పెరిగింది. గతేడాది డిసెంబరులో 2,27,600 బీర్ల కేసులు విక్రయించగా ఈ ఏడాది ఆ సంఖ్య 3 లక్షలకు చేరింది. కొత్త ఏడాదిలో ప్రభుత్వం ఆదాయం పెంచేందుకు మరికొన్ని కొత్త నిర్ణయాలు తీసు కోనుందని, అవి అమల్లోకొస్తే ఎక్సైజ్ ఆదాయం పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ వర్గాలు తెలిపాయి.

బార్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

- 40 కేసుల నమోదు

నెల్లూరు (క్రైం), జనవరి 3 : జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుపుతున్న బార్‌లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. 40 బార్లపై కేసులు నమోదు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ చెన్నకేశవరావు నేతృత్వంలోని పది బృందాలు జిల్లా వ్యాప్తంగా బార్లలో తనిఖీలు నిర్వహించాయి. 40 బార్లలో నౌకర్ నామా లేకపోవడం, రికార్డులు సరిగా అమ లు చేయకపోవడం, మైనర్‌లకు మద్యం విక్రయాలు జరపకూడదన్న బోర్డులు ఏర్పా టు చేయకపోవడం తదితర అంశాలపై కేసులు నమోదు చేశారు. గత నెల 31వతేదీ వరకు జరిపిన బెల్ట్‌షాపుల తనిఖీల్లో 115 షాపులపై కేసులు నమోదు చేశారు. వాటిలో కసుమూరుకు చెందిన మానస వైన్స్, రాపూరు మండలం గోనుపల్లికి చెందిన ఈఎస్ఆర్‌వైన్స్‌లు బెల్టుషాపులకు మద్యం సరఫరా చేయడంతో వాటిపై కేసులు నమోదు చేశారు. డక్కిలికి చెందిన సాయికృష్ణ వైన్స్‌పై రెండు కేసులు నమోదు చేశారు. గత ఏడాది జులైలో జరిగిన కేబినెట్ సమావేశంలో బెల్ట్‌షాపులపై తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా జిల్లాలో స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి 31 మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేయడంతో పాటు నివేదికలు సిద్ధం చేసి ఉన్నతా ధికారులకు పంపించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

అమరా గార్డెన్‌లో చోరీ

- రూ.1.10 లక్షలు అపహరణ
- పట్టణంలో కలకలం

నాయుడుపేటరూరల్, జనవరి 3 : నాయుడుపేట పట్టణంలోని అమరాగార్డెన్‌లో బుధవారం పట్టపగలు చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అమరాగార్డెన్‌లో నివాసం ఉంటున్న బాషా, భార్య ఇద్దరు తలుపులకు తాళాలు వేసుకొని కూలీ పనులకు ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి బయలుదేరి వెళ్లారు. బాషా మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో భోజనం కోసం ఇంటికి రాగా తలుపుకు తాళాలు పగలగొట్టిన దృశ్యం చూసి అవాక్కయ్యాడు. తాళాలను దుస్తుల్లో పెట్టి ఉండటం గుర్తించిన దొంగలు ఆ తాళాలతో బీరువాను తీసి అందులో ఉన్న రూ 1.10 లక్షలు చోరీ చేసినట్లు గుర్తించారు. ఆమేర బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాషా మనుమడుకు రెండు చేతులు లేకపోవడంతో చెన్నై వైద్యశాలలో చికిత్సల కోసం నగదును ఇంట్లో దాచినట్లు ఆయన తెలిపాడు. దీంతో వృద్ధ దంపతులు బోరున విలపించారు. పట్టణంలో పట్టపగలు చోరీ జరగడంతో ప్రజల్లో కలకలం రేగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


దొంగలు చోరీ చేసిన బీరువా

కృష్ణపట్నం లెదర్ కాంప్లెక్స్ సదస్సు రసాభాస


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

- తీర్మానాలను బహిర్గతం చేయాలని స్థానికుల పట్టు

వావిళ్లదొరువు (కోట), జనవరి 3 : ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా పరిశ్రమలు పెడతామని వస్తే ఒప్పుకోం. నెల్లోర్స్ పరిశ్రమ మేలు చేస్తుం దో? కీడు చేస్తుందా ప్రజల సమక్షంలోనే తెల్చాలి? ఎన్నివేల మందికి పరిశ్రమలో ఉపాధి కల్పిస్తారో కూడా ఇప్పుడే తేల్చేయండి. లేకపోతే ఎంతటి త్యాగానికైనా సిద్ధమేనని సముద్ర తీర ప్రాంత గ్రామాల ప్రజలు హెచ్చరించారు. కోట మండలం కొత్తపట్నంలో 537 ఎకరాల విస్తీర్ణంలో రూ. 282 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కృష్ణపట్నం లెదర్ కాంప్లెక్స్‌పై బుధవారం స్థానిక తుఫాను షెల్టర్ ప్రాంగణంలో సర్పంచు మానికల పెంచెలమ్మ అధ్యక్షతన నిర్వహిం చిన అవగాహన సదస్సుకు ఏపీఐఐసీ చైర్మన్ కృష్ణయ్య, జోనల్ మేనేజర్ వెంకటేశ్వర్లురావు, కేపీఎస్‌పీఎల్ జనరల్ మేనేజర్ సంజీవ్‌రావు, గూడూరు ఆర్డీవో అరుణ్‌బాబు, తహసీల్దార్ కోసూరు రాజ్యలక్ష్మి, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ హాజరయ్యారు. ప్రతి రైతుకు అమరావతి తరహాలో నష్టపరిహారం ఇప్పిం చే బాధ్యత తనదన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే పరిశ్రమను తాను కూడా వ్యతిరేకిస్తానని తనపై విశ్వాసం వుంచి ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. దీంతో ప్రజలు సదస్సు నిర్వహణకు సహకరించారు.

డీటీసీ వర్సెస్ కానిస్టేబుల్

- నువ్వెంత అంటే నువ్వెంత
- కార్యాలయంలోనే తీవ్ర వాగ్వివాదం

నెల్లూరు (క్రైం) జనవరి 3 : రవాణాశాఖ కార్యాలయంలో సిబ్బంది- అధికారుల మధ్య విభేదాలు ఏ స్థాయిలో ఉన్నాయో మరోసారి బట్టబయలయింది. డీటీసీ కార్యాలయంలో పనిచేస్తూ ఇటీవలే స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఓ కానిస్టేబుల్‌కు- ఉపరవాణా కమిషనర్ (డీటీసీ)కి నడుమ బుధవారం కార్యాలయంలోనే తీవ్ర వాగ్వివాదం జరిగింది. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఇద్దరూ ఒకరినొకరు దూషించుకున్నారు. నీ సంగతి నాకు తెలుసంటూ ఒకరిపై ఒకరు ఆరోపణల వర్షం కురిపించుకున్నారు. చివరికు ఆఫీసు సిబ్బంది కలగ చేసుకుని కానిస్టేబుల్‌కు సర్దిచెప్పి బయటకు పంపించగా పనుల నిమిత్తం వచ్చిన వాహనదారులు బిత్తరపోయి ఈ చోద్యం చూస్తూ నిల్చుండిపోయారు.

ఏం జరిగిందంటే..

రవాణాశాఖ కార్యాలయంలో పనిచేసే కానిస్టేబుల్ మురళి నాలుగు నెలల క్రితం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. కార్యాలయంలోని అవినీతి అక్రమాలు అధికమయ్యాయని, సంబంధిత అధికారులు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఆరోపిస్తూ ఉద్యోగానికి రాజీనామా చేసి కార్యాలయం బయటే వాహన బీమా ఏజెన్సీ తెరిచారు. ఇటీవల నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన స్కూల్ బస్సును ఆర్టీఏ అధికారులు తనిఖీ చేస్తూ బస్సులో ముగ్గురు చిన్నారులు అధికంగా ఉన్నారంటూ ఓవర్ లోడ్ కింద కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించిన జరిమానా చెల్లించేందుకు సదరు స్కూలు నిర్వాహకులు వారం రోజులుగా ప్రయత్నిస్తున్నారు. అదే పాఠశాలలో మురళి పిల్లలు చదువుతుండడంతో ఆ పాఠశాల ప్రతినిధులు మురళిని సంప్రదించి జరిమానా చెల్లించేందుకు సహకరించాలని కోరారు. మురళి ఆ పాఠశాల ప్రతినిధిని తీసుకుని బుధవారం కార్యాలయంలోకి వెళ్లి జరిమానా చెల్లించబోతుండగా, అక్కడే ఉన్న డీటీసీ శివరామప్రసాద్ మురళి వద్దకు వెళ్లి నువ్వెందుకు కార్యాలయంలోకి వచ్చావని నిలదీశారు. పాఠశాలకు సంబంధించిన జరిమానా కట్టేందుకు వచ్చానని మురళి బదులివ్వగా నీకు వ్యక్తిగత పని ఉంటేనే కార్యాలయంలోనికి రావాలని, ఇతరుల పనికోసం కార్యాలయ ప్రాంగణంలోకి అడుగుపెట్టకూడదని డీటీసీ అందరి ముందే కాస్త గట్టిగా అరిచారు. దీంతో మురళి సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇది పౌరసేవలందించే కార్యాలయం అని ఎవరైనా ఎప్పుడైనా సరే కార్యాలయంలోకి రావచ్చని, రాకూడదని ఆదేశాలు జారీచేసే అధికారం నీకు లేదంటూ వాగ్వివాదానికి దిగాడు. ఆగ్రహించిన డీటీసీ నోరు అదుపులో ఉంచుకుని మాట్లాడు లేకపోతే చూసూ ఊరుకోనని చెప్పడంతో మురళి కూడా "మీ అవినీతి అక్రమాలన్నీ నాకు తెలుసునని, త్వరలోనే ఏసీబీ ద్వారా బయటపెట్టి మీ గుట్టు రట్టు చేస్తా. నిత్యం కార్యాలయ వేళలు పూర్తయిన తరువాత బయట వ్యక్తుల ద్వారా మీరు రహస్యంగా చేస్తున్న పనులు, ఫైనాన్షియర్స్, డీలర్ల ద్వారా జరుగుతున్న దోపిడీలు నాకు తెలుసు. వాటి గుట్టు బట్టబయలు చేస్తా" నని కేకలు పెట్టడంతో కార్యాలయ సిబ్బంది కలగ చేసుకుని మురళికి సర్దిచెప్పి బయటకు పంపించేశారు. ఈ సంఘటన జరుగుతున్నంత సేపు కార్యాలయంలోని ఇతర సిబ్బంది, పాటు పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఈ వింత వివాదాన్ని ఆసక్తిగా చూస్తూ నిలబడిపోయారు.


కోడూరుపాడులో సీఎం సభాస్థలిని పరిశీలిస్తున్న కలెక్టర్, టీడీపీ నేతలు

6న కోడూరుపాడుకు
సీఎం రాక

- 'జన్మభూమి' సభలో పాల్గొననున్న చంద్రబాబు
- ఉదయం పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

నెల్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు ఈ నెల 6న విచ్చేస్తున్నట్లు ప్రాథమికంగా సమాచారం అందింది. బుధవారం కడప జిల్లా పులివెందులలో జరిగిన జన్మభూమి కార్యక్రమానికి ఇన్‌చార్జి మంత్రి హోదాలో హాజరైన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సీఎం చంద్రబాబుతో నెల్లూరు జిల్లా పర్యటనపై చర్చించారు. పలు ప్రారంభోత్సవాలు సీఎం చేతుల మీదుగా జరపాలని కోరడంతో సీఎం అంగీకరించినట్లు సమాచారం. గురువారం సీఎంఓ కార్యాలయ అధికారులు సీఎం పర్యటన షెడ్యూల్‌ను ఖరారు చేసి జిల్లా అధికారులకు అందించనున్నారు. ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు నెల్లూరు మండలం కోడూరుపాడులో జరిగే జన్మభూమి - మా ఊరు గ్రామసభకు ముఖ్య అతిథిగా సీఎం విచ్చేస్తారు. ఈ నెల 6న ఉదయం 11 గంటలకు జిల్లాకు చేరుకునే సీఎం మొదట సింహపురి యూనివర్సిటీ భవనాలు, గొలగముడిలోని రెండు భవనాల ప్రారంభం, ముత్తుకూరు నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తారు. 2012లో రూ.23 కోట్లతో వర్సిటీ భవన నిర్మాణాలు ప్రారంభించి 2014లో పూర్తి చేశారు. పరిపాలన, బోధన, హాస్టల్ భవనాలు నిర్మించినా చాలా రోజుల వరకు వర్సిటీని ఆ భవనాల్లోకి తరలించలేదు. సీఎం చేతుల మీదుగా ప్రారంభించాలని ప్రయత్నాలు జరిగినా చివరి నిమిషంలో వాయిదా పడ్డాయి. సాగర మాల ప్రాజెక్టులో భాగంగా నెల్లూరు - ముత్తుకూరు రహదారిని నాలుగు లైన్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.274 కోట్లు ఖర్చు పెట్టేలా ఆమోదం లభించింది. ఈ రోడ్డు పనులకు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయించనున్నారు. అదే విధంగా గొలగముడిలో నిర్మించిన రెండు భవనాలను కూడా సీఎం ప్రారంభించనున్నారు. మంత్రి సోమిరెడ్డి బుధవారం రాత్రి నెల్లూరుకు చేరుకుని సీఎం పర్యటనపై అధికారులతో చర్చించనున్నారు. గురువారం అధికారిక షెడ్యూల్ అందిన వెంటనే కార్యాచరణలోకి దిగి ఏర్పాట్లు సాగనున్నాయి.

● స్థల పరిశీలన

కోడూరుపాడులో జరిగే గ్రామసభకు సీఎం చంద్రబాబు విచ్చేస్తున్నారు. ఈ సభలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సీఎం గడపనున్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ రేవు ముత్యాలరాజు, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, మాజీ మంత్రి ఆదాల ప్రభాకర్ రెడ్డి, మేయర్ అబ్దుల్ అజీజ్ తదితరులు కోడూరుపాడుకు వెళ్లి జన్మభూమి జరిగే సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం సభా ఏర్పాట్లపై కలెక్టర్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.


సాయికృష్ణతో ముచ్చటిస్తున్న ముద్రగడ

ముద్రగడను కలిసిన మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణ

వెంకటగిరి, జనవరి 3: మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్ తల్లి మృతి చెందడంతో ఆయనను పరామర్శించేందుకు వచ్చిన ముద్రగడ పద్మనాభంను పలకరించేందుకు మాజీ ఎమ్మెల్యే సాయికృష్ణ, రాజ కుటుంబ సభ్యులు నగరి నుంచి బయలుదేరినట్లు తెలియడంతో ఆయన రాజనగరికి చేరుకుని సాయికృష్ణను పలకరించారు. ముద్రగడ వెంకటగిరికి వచ్చిన విషయం తెలుసుకున్న నాయకులు ఆయనను కలిసి, పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

కలెక్టర్ సమీక్ష



నెల్లూరు (కలెక్టరేట్), ఈ జనవరి 3 : ఈ నెల సీఎం రాక సందర్భంగా ఏర్పాట్లపై బుధవారం జిల్లా అధికారులతో కలెక్టర్ ముత్యాలరాజు సమీక్షించారు. కలెక్టర్ బంగ్లాలో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కోడూరుపాడులో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జన్మభూమి-మాఊరు గ్రామసభలో సీఎం పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. ఆటలు, గంగిరెద్దులు, గొబ్బెమ్మలు, ముగ్గుల పోటీలను నిర్వహించాలన్నారు. సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని కార్యక్రమాలను రూపొందించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జేసీ ఇంతియాజ్, డీఆర్వో వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

11న ఉపరాష్ట్రపతి రాక : భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ నెల 11న నెల్లూరుకు వస్తున్నారని కలెక్టర్ చెప్పారు. 16వ తేదీ వరకు ఉపరాష్ట్రపతి జిల్లా పర్యటనలో ఉంటారన్నారు. కాగా 16న ముఖ్యమంత్రి చంద్రబాబు మరోమారు నెల్లూరు పర్యటనకు వస్తారన్నారు.

7న మంత్రి లోకేష్ రాక : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేష్ ఈ నెల 7న నెల్లూరుకు వస్తారని కలెక్టర్ తెలిపారు. అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ ఈ నెల 5న నెల్లూరుకు వస్తారని తెలిపారు.

సీఎంఆర్, చందన
మలేషియా విజేత కమలేష్


విజేతను ప్రకటిస్తున్న నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 3 : సీఎంఆర్, చందనబ్రదర్స్ క్రిస్మస్, న్యూయర్, సంక్రాంతి పర్వదినాల సందర్భంగా ఐదు వారాలు ఐదు హీరో బైక్స్ నాల్గో డ్రా బుధవారం రాత్రి తీశారు. ముఖ్య అతిథిగా నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి న్యూఇయర్ బంపర్ డ్రా విజేతను లక్కీ డిప్ ద్వారా సీఎంఆర్, చందన మలేషియా ట్రిప్ విజేతగా నరుకూరుకు చెందిన ఎన్. కమలేష్‌ను ఎంపిక చేసి ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి వారం లక్కీ డ్రా కూపన్ డ్రా తీసి శాంతినగర్‌కు చెందిన సీహెచ్ రిషిగ్రేస్‌ను హీరో మోటారు బైక్ విజేతగా ప్రకటించారు. డైలీ డ్రాలో ఎనిమిది మంది విజేతలను ఆనుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చాట్ల నరసింహారావు లక్కీ కూపన్ల డ్రా తీసి ఎంపిక చేశారు. అనంతరం క్రిస్మస్ బంపర్ డ్రా కారు విజేత కాకాణి ఏంజెల్‌కు అతిథులు అందచేశారు. డైలీ డ్రా విజేతలకు బహుమతులు అందచేశారు. వారు మాట్లాడుతూ పండుగల సందర్భంగా వినియోగదారులకు విలువైన బహుమతులు అందచేసి ప్రోత్సహిస్తున్న సీఎంఆర్ చందనా బ్రదర్స్ అధినేతలను అభినందించారు. సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ అమేజింగ్ సేల్స్‌కి జిల్లా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. రాజీయాడ్స్ పెంచలయ్య మాట్లాడుతూ మార్కెట్‌లోకి ఎన్నో దుకాణాలు వచ్చినప్పటికీ సీఎంఆర్‌లో ఉన్న వెరైటీలు, ధరలు అందించలేవన్నారు. లక్కీ డ్రా కూపన్‌పై డైలీ ఎనిమిది గృహోపకరణాలు, ఐదు వారాలు ఐదు బైక్‌లు, రెండు టాటా కార్లు, బంపర్ బహుమతిగా అందిస్తున్నామని, ఈ అవకాశం జనవరి 18 వరకు ఉంటుందని ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శైలేష్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను ఒప్పించి
పరిశ్రమ ఏర్పాటు చేసుకోవాలి

బీజేపీ, జనసేన

రాపూరు, జనవరి 3: ప్రజా మద్దతుతోనే పరిశ్రమలు ఏర్పాటుచేసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. రావిగుంటపల్లి వద్ద ఏర్పాటుచేస్తున్న కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంటు పరిశ్రమను జనసేన కార్యకర్తలు, స్థానికులతో కలసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ ప్రాజెక్టుతో ఎలాంటి ఇబ్బందులు లేవన్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రజల మద్దతు లేకుండా పనులు చేపడితే ఒప్పుకునే ప్రసక్తే లేదన్నారు.

జనసేన అధినేత దృష్టికి..

పవన్ కల్యాణ్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళతామని జనసేన నాయకుడు రాజా యాదవ్ తెలిపారు. ప్రాజెక్టు పనులను పరిశీలించి విలేఖరులతో మాట్లాడారు. సమస్య తమ దృష్టికి రావడంతో, బీజేపీ నాయకులతో కలసి వచ్చామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులతోపాటు బీజేపీ మహిళా నాయకురాలు కామేశ్వరమ్మ, జనసేన నాయకులు ఆనంద్, ఆసిక్, సుధీర్, వినయ్, బెల్లం అంకయ్య, గంగిరెడ్డి, చరణ్, మణి, ప్రసాద్, అశోక్‌తోపాటు ఐదు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

భారీగా పోలీసు బలగాలు

బీజేపీ, జనసేన నాయకులు పరిశ్రమ వద్దకు వస్తున్నారన్న సమాచారంతో వెంకటగిరి సీఐ శ్రీనివాస్, రాపూరు, డక్కిలి ఎస్సైలు లక్ష్మణరావు, మరిడినాయుడు బందోబస్తు ఏర్పాటుచేశారు.


వేస్ట్ మేనేజ్‌మెంటు బాధ్యులతో మాట్లాడుతున్న బీజేపీ, జనసేన నాయకులు

ట్రస్టు పేరుతో వసూళ్లు

- రెవెన్యూ అధికారి పబ్లిక్ దందా
- ట్రస్టు చైర్మన్‌గా తహసీల్దారు నరసింహులు
- ఏ పని కావాలన్నా గుడి కోసం విరాళాలు
- కోవూరు సబ్ రిజిస్ట్రార్ వద్ద ట్రస్టు రిజిస్ట్రేషన్
- లక్షల వసూళ్లకు లెక్కాపక్కా లేదు
- సర్వీసు నిబంధనలకూ పూర్తి విరుద్ధం

నెల్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నెల్లూరు తహసీల్దారు ముత్యం నరసింహులు తాను చైర్మన్‌గా ఉన్న భగవాన్ శ్రీ శ్రీ వెంకయ్య స్వామి చారిటబుల్ ట్రస్టు పేరుతో సాగిస్తున్న అక్రమ వసూళ్ల దందాపై పాఠకులు అందించిన సమాచారం ప్రకారం... నెల్లూరు నగరంలోని పొదలకూరు రోడ్డు ఎన్‌సీసీ కాలనీలో 25 ఏళ్ల క్రితం కొందరు భక్తులు అవధూత భగవాన్ శ్రీ శ్రీ వెంకయ్యస్వామి చిత్రపటంతో చిన్నపాటి ఆశ్రమాన్ని నిర్వహించేవారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఓ వ్యక్తి ఆశ్రమం స్థలంలో ఉన్న గుంతలను పూడ్చి ఏటా ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తూ వచ్చేవారు. జిల్లాలో వెంకయ్యస్వామికి ఉన్న భక్తుల ఆదరణ అంతా ఇంతా కాదు. గుడి ఆలనాపాలనా చూస్తున్న ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారి పదేళ్ల క్రితం చనిపోయారు. ఆ తరువాత ఆ ఆశ్రమ నిర్వహణ బాధ్యతలు ముత్యం నరసింహులు చేపట్టారు. ఆయన సంగం, ఏఎస్‌పేట, రాపూరు, జలదంకి, మనుబోలు, కోవూరు, నెల్లూరుల్లో తహసీల్దారుగా పనిచేసే సమయంలో వివిధ సమస్యలపై తన వద్దకు వచ్చే నేతలు, ప్రజలకు ఆయా పనులు చేసిపెట్టి గుడి నిర్మాణానికి విరాళాలు అందించాలని కోరేవారు. వెంకయ్యస్వామిపై ఉన్న భక్తి భావంతో చాలా మంది దాతలు విరాళాలు అందించేవారు. రూ. లక్షల్లో విరాళాలు అందుతుండడంతో అధికారికంగా ట్రస్టుబోర్డు ఏర్పాటు చేయాలని నరసింహులు ఓ దశలో భావించారు. ఆయన కోవూరు తహసీల్దారుగా పనిచేస్తున్న సమయంలో గత ఏడాది ఏప్రిల్ 21న 'అవధూత భగవాన్ శ్రీశ్రీ వెంకయ్యస్వామి చారిటబుల్ ట్రస్టు' పేరుతో కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ట్రస్టును రిజిస్ట్రర్ చేశారు. ట్రస్టు కార్యాలయం అడ్రస్ ఎన్‌సీసీ కాలనీ, పొదలకూరు రోడ్డుగా పేర్కొన్నారు. ముత్యం నరసింహులు చైర్మన్‌గా, మరో 17 మంది సభ్యులుగా ఈ ట్రస్టును నెలకొల్పినట్లు రిజిస్ట్రేషన్ సమయంలో పేర్కొన్నారు. ట్రస్టుగా ఏర్పడడంతో పూర్తి పెత్తనం చైర్మన్ గుప్పెట్లోకి చేరింది. నిర్వహణ, ఉత్సవాలు చైర్మన్ పర్యవేక్షణలో సాగుతాయి. నిబంధనల ప్రకారం విరాళాలు, దాతల సహకారాన్ని వివరంగా నమోదు చేసి, జాతీయ బ్యాంకుల్లో ఖాతా తెరచి, వచ్చిన విరాళాలను అందులో జమచేసి ఖర్చు చేయాల్సి ఉంటుంది. చైర్మన్‌కు చెక్ పవర్ అధికారం ఉంటుంది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1న జమా ఖర్చులపై ఆడిట్ నిర్వహించాలి. ఏడాదిలో ఒకసారి ట్రస్టు సర్వసభ్య సమావేశం నిర్వహించాలి. ట్రస్టుకు సమకూరే ఆస్తులన్నీ ఆ ట్రస్టు పేరుతోనే ఉండాలి. ఇలా 24 అంశాలను తు.చ. తప్పకుండా అమలు చేస్తామని రిజిస్ట్రేషన్ సమయంలో పేర్కొన్నారు కానీ, ఏ రోజూ అవి అమలు కావడం లేదని భక్తులు అంటున్నారు.


पचास रुपये

FIFTY RUPEES

रु.50

Rs.50

INDIA NON JUDICIAL

కోవూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ట్రస్ట్‌బోర్డు రిజిస్ట్రేషన్ పత్రం

ట్రస్టు పేరుతో వసూళ్ల పర్వం

దేవునికి సేవ చేసేందుకు నెలకొల్పిన ఈ ట్రస్టు ఆ రెవెన్యూ అధికారికి సిరులు కురిపిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. నెల్లూరు తహసీల్దారుగా గత ఏడాది జూన్ 30న బాధ్యతలు చేపట్టిన ముత్యం నరసింహులు ట్రస్టు పేరుతో రూ. లక్షలు వసూళ్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నెల్లూరు సిటీ, రూరల్ మండలాల పరిధికి అధికారి కావడంతో ఇక్కడ నిత్యం ఎన్నో భూ సమస్యలు వస్తుంటాయి. వీటిని పరిష్కరించే పేరుతో రెవెన్యూ వసూళ్ల దందా సాగిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. నెల్లూరు కార్పొరేషన్‌లో కాంట్రాక్టరుగా వ్యవహరించే ఓ వ్యక్తి నుంచి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసమని రూ. 8 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. మరో ఆలయ చైర్మన్ నుంచి రూ. 5 లక్షలు గుడి నిర్మాణం కోసం వసూలు చేశారు. ఇలా అధికారి రెవెన్యూ పనుల కోసం వెళ్లిన వారినుంచి పెద్దఎత్తున విరాళాలు సేకరిస్తున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. 25 ఏళ్ల క్రితం నెలకొల్పిన వెంకయ్యస్వామి ఆలయంలో మొదట చిన్న షెడ్ వేసి చిత్రపటంతో పూజలు నిర్వహించేవారు. ఆ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో వెంకయ్యస్వామికి ఆలయం నిర్మించాలని ప్రస్తుతం పనులు చేపట్టారు. దైవకార్యం చేపట్టడంపై ఎవరికీ అభ్యంతరం లేకపోయినా వచ్చిన విరాళాల లెక్కలు మాత్రం బయటపెట్టకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. విరాళాలు ఎంతవచ్చినా గుడి నిర్మాణం దశల వారీగా సాగుతూనే ఉంది.

సర్వీస్ రూల్స్‌కు విరుద్ధం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఫండ్‌మెంటల్ రూల్- 2, నియమం- 11 ప్రకారం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పూర్తి కాలం ప్రభుత్వ సేవలోనే ఉన్నట్లుగానే పరిగణిస్తారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ (సీసీఎల్‌ఏ) రూల్ ప్రకారం ఏ ప్రభుత్వ ఉద్యోగి ఇతర కార్యక్రమాల్లో ఉండడం పూర్తిగా విరుద్ధం. ట్రస్టులు ఇతర వ్యవహారాల్లో చైర్మన్లుగా కొనసాగడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం. ఇన్నాళ్లు అనధికారికంగా ట్రస్టు బాధ్యతలు నిర్వహించిన ముత్యం నరసింహులు గత ఏడాది ఏప్రిల్ 21న ట్రస్టును రిజిస్టర్ చేసి తానే చైర్మన్‌గా ప్రకటించుకున్నారు. విరాళాల సేకరణపైనే పలు విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఓ ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి ట్రస్టు చైర్మన్‌గా ఎలా ఉంటారన్నది సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ ట్రస్టు పర్యవేక్షణలో సాగుతున్న అన్ని వ్యవహారాలపై ఉన్నతాధికారులు విచారణలు జరపాలని భక్తులు కోరుతున్నారు.

వెంకయ్యస్వామి కోసమే : ముత్యం నరసింహులు, తహసీల్దారు, నెల్లూరు



పాతికేళ్ల నుంచి ఉన్న వెంకయ్యస్వామి ఆశ్రమంలో కొత్తగా గుడి నిర్మించాలని దాతల నుంచి విరాళాలు సేకరిస్తున్నాం. కొందరు సిమెంటు, స్టీలు, ఇతరత్రా రూపాల్లో సహకారం అందిస్తున్నారు. వీటితో ఆలయ నిర్మాణం జరుగుతోంది. ట్రస్టు బోర్డు సభ్యులు ఒకరు అ అంటే... మరొకరు ఆ అంటారు. అందుకనే విషయం తెలిసిన వ్యక్తిగా నన్ను ట్రస్టుబోర్డు చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అక్కడ ఎలాంటి అవినీతి, వసూళ్ల వ్యవహారం జరగడం లేదు. ఇక ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ట్రస్టు చైర్మన్‌గా ఉండడమంటారా!. దైవ కార్యంలో రూల్స్ చూడలేం.

నెల్లూరు రూరల్, జనవరి 3 :

సాగునీటి నిర్వహణలో సమన్వయంతో పనిచేయాల్సిన రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల మధ్య పొత్తు కుదరకపోవడంతో కనుపూరు కాలువ చివరి ఆయకట్టుకు సాగు నీరు అందడం అనుమానంగా ఉంది. అధికారుల పర్యవేక్షణ లోపం, అనధికారిక ఆయకట్టుదారులకు రాత్రిళ్లు విద్యుత్ సరఫరా కొనసాగుతుండడంపై చివరి ఆయకట్టుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నీటి వాడకం వల్ల చివరి భూములకు నీరందక పంటలు పండవని దిగాలు పడుతున్నారు. సాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు ఇరిగేషన్, వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు, డిస్కం శాఖల అధికారులతో కలెక్టర్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇరిగేషన్ మినహా మిగతా శాఖల అధికారులు పత్తాలేకుండా పోయారు. దాంతో అనధికార ఆయకట్టు దారులు నీటిని తోడేస్తున్నారు. వారి నుంచి డిస్కం అధికారులు ఆమ్యామ్యాలు తీసుకొని విద్యుత్ సరఫరా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.



కనుపూరు కట్టపై అనధికార మోటార్లు

- కనుపూరు చివరి ఆయకట్టుకు నీరు ప్రశ్నార్థకం
- కొనసాగుతున్న అక్రమ నీటి వాడకం
- కలిసి నడవని రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖలు
- ఇరిగేషన్ శాఖ ఫిర్యాదులపై డిస్కం పెడచెవి

సాగునీటి సరఫరాలో సయోధ్య ఏది?

కనుపూరు కాలువ కింద సుమారు 32 వేల ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. మరో 30 వేల ఎకరాలు మోటార్ల కింద ఉంది. నెల్లూరురూరల్ మండలంతో పాటు పొదలకూరు, మనుబోలు, వెంకటాచలం ప్రాంతాలలోని 83 చెరువులతో లింకైన కనుపూరు కాలువ సంగం నుంచి 55 కిలోమీటర్ల మేర ప్రయాణించి మనుబోలు మండలం గొల్లపాళెం వద్ద ముగుస్తుంది. అక్కడ నుంచి మరో 12 కిలోమీటర్ల ఉండే బండేపల్లి బ్రాంచ్ కాలువ జట్లకొండూరు చెరువులో కలుస్తుంది. నిత్యం కాలువలో పారుతున్న 500 క్యూసెక్కుల నీరు అధికారుల సమన్వ లోపంతో పక్కదారిపడుతోంది. సోమశిల జలాశయంలో నీటి లభ్యత కొరత కారణంగా అనధికార ఆయకట్టుదారుల (మోటారు వ్యవసాయదారులు)కు శని, ఆదివారాల్లోనే నీళ్ల అందించాలని అధికారులు నిర్ణయించారు. ఇటీవల కాస్త నీటి అవసరం ఉండడంతో శుక్రవారాన్ని కూడా ఆ జాబితాలో చేర్చారు. జలవనరుల శాఖతో పాటు రెవెన్యూ, పోలీసు, వ్యవసాయం, డిస్కం అధికారులను బృందంగా కలెక్టర్ ముత్యాలరాజు ఏర్పాటు చేశారు. ఏ మండలానికి ఆ మండలంలో ఆయా బృందాలు కాలువపై గస్తీ తిరగాలి. ఆ మూడ్రోజుల మినహా మిగతా రోజుల్లో విద్యుత్ సరఫరా చేయకూడదు. ఇరిగేషన్‌శాఖ అధికారులు తప్ప ఏ శాఖ సిబ్బందీ అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దానిని ఆసరా చేసుకున్న అనధికార ఆయకట్టు దారులు మిగతా రోజుల్లోనూ ఇష్టానుసారంగా నీటిని తోడేస్తున్నారు. కనుపూరు కాలువ కింద మొత్తం 62 వేల ఎకరాల వరి సాగవుతోంది. ఈ మొత్తానికి 6.5 టీఎంసీల నీరు అవసరం. అనధికార ఆయకట్టు దారులు విచ్చలవిడిగా సాగునీటిని తోడేస్తే చివరి ఆయకట్టు సాగుకు నీరు పారే అవకాశం తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం నారేత దశ దాటింది. కలుపుల కాలం. ఎక్కువ నీరుంటే కలుపు తీసే అవకాశం ఉంది. కొన్ని శాఖలు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించకపోవడంతో అసలు హక్కు దారులు ఆందోళనలో పడ్డారు.



కనుపూరు కాలువలోనుంచి నీళ్ల తోడుతున్న విద్యుత్ మోటార్లు

చేతులు కలపని ఆ నాలుగు శాఖలు

ఇరిగేషన్ శాఖతో మిగతా నాలుగు శాఖల సమన్వయం లోపించింది. ప్రధాన బాధ్యత జలనవరులశాఖదే అయినందున ఎక్కువ సమయం కేటాయించి పర్యవేక్షణ జరపాలని మిగత నాలుగు శాఖల అధికారులు అంటోండడం గమనార్హం. అందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా అవి తమకు వర్తించవన్నట్లు ఆ శాఖల అధికారుల తీరు ఉంది. తాము మాత్రం సొంత ఖర్చులతో వాహనాలు ఏర్పాటు చేసుకుని రాత్రుళ్ల పర్యటిస్తూ జీతాలు ఖర్చు చేసుకోవాల్సి వస్తోందని జలవనరులశాఖ జేఈలు వాపోతున్నారు.

ఇరిగేషన్ అధికారులు చెప్తే చేస్తాం



కనుపూరు కాలువపై పర్యవేక్షణ పూర్తిగా ఇరిగేషన్ శాఖది. వాళ్లు చెప్తే మేము వెళ్తాం. మోటార్లు ఎక్కడ అనధికారికంగా పనిచేస్తున్నాయో వాళ్లే గుర్తించి మాకు చెప్తే మేము అడ్డుకుంటాం. వాళ్లిచ్చే సమాచారం మేరకు మా వాళ్లు పనిచేస్తున్నారు.

- శ్రీహరి, నెల్లూరు ట్రాన్స్‌కో ఏడీ

చివరి ఆయకట్టుకు నీరివ్వడమే లక్ష్యం



కనుపూరు కాలువ కింద ఆయకట్టుదారులకు సాగునీరు అందించాల్సిన బాధ్యత మాపై ఉంది. ప్రధానంగా చివరి ఆయకట్టుదారునికీ సాగునీరు చేర్చడమే ప్రస్తుతం మా ముందున్న లక్ష్యం. మా శాఖ జేఈలు నిత్యం కనుపూరు కాలువపైనే ఉంటున్నారు. ప్రతి వ్యక్తితో వాట్సప్, వీడియో కాల్స్‌లో మాట్లాడుతున్నా.

- పీ కృష్ణమోహన్, జలవనరులశాఖ నెల్లూరు ఈఈ

విద్యుత్ శాఖ సిబ్బంది చేతివాటం?

సాగునీటి సరఫరాలో ఉన్నతాధికారులు కనుపూరుపై విధించిన ఆంక్షలు విద్యుత్‌శాఖకు కాసులు కురిపిస్తున్నాయి. డిస్కం అధికారులు విద్యుత్ సరఫరా చేసినందుకు ఒక్కో మోటారు దారు నుంచి రూ.200లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. వారంలో శుక్ర, శని, ఆదివారాల్లోనే మోటార్లదారులు సాగునీటిని తోడుకోవాలని నిబంధనలు ఉన్నాయి. వాటిని విద్యుత్‌శాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది క్యాష్ చేసుకుంటున్నారు. నిర్ణయించిన రోజులు కాకుండా రోజుల్లోనూ రాత్రుళ్ల విద్యుత్ సరఫరాను రహస్యంగా ఇచ్చేస్తున్నారు. రైతుల నుంచి దండిన మొత్తాన్ని మండల స్థాయి అధికారుల వరకు వాటాలు వేసుకొని పంచుకున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

» ప్రారంభోత్సవానికి దూరంగా మంత్రులు » 11 జిల్లాల నుంచి 198 నమూనాల ప్రదర్శన » ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


కార్యక్రమం ప్రారంభానికి జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ ముత్యాలరాజు


చిన్నారుల నృత్య ప్రదర్శన

నెల్లూరు (క్యాంపస్), జనవరి 3 : పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ రాష్ట్ర స్థాయి బాలల వైజ్ఞానిక, గణిత, పర్యావరణ ప్రదర్శన నగరంలోని సుబేదారుపేటలో ఉన్న సెయింట్ జాన్స్ పాఠశాలలో బుధవారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శనలో 11 జిల్లాల నుంచి 198 నమూనాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శించారు. శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలకు సంబంధించి నమూనాలు ప్రదర్శనకు రాలేదు. మూడురోజులు జరగనున్న ఈ ప్రదర్శన 5వ తేదీ సాయంత్రంతో ముగుస్తుంది. ముగింపు కార్యక్రమంలో జాతీయ స్థాయికి ఎంపికైన నమూనాలను ప్రకటిస్తారు.

ప్రారంభోత్సవానికి మంత్రులు దూరం

రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా నెల్లూరు జిల్లాలో ఈ రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. జిల్లా మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పొంగూరు నారాయణ, విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఈ ప్రదర్శన ప్రారంభోత్సవానికి హాజరు కాలేదు.

విద్యావిధానం, తల్లిదండ్రులు మారాలి

ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడారు. విద్యా విధానాలలో మార్పు రావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయి వసతులు కల్పిస్తే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. హైస్కూళ్లలోనే ఇంటర్ విద్యను విలీనం చేయాలన్నారు.

కలెక్టర్ రేవు ముత్యాలరాజు మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుంటే ప్రపంచమే ఆ లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు సహకరిస్తుందన్నారు. మేయర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ పేదరికాన్ని జయించాలంటే విద్య ఒక్కటే మార్గమని తల్లిదండ్రులు గ్రహించాలన్నారు. ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సైన్స్‌పై విద్యార్థులు మక్కువ చూపేలా తరగతి గది నుంచే మార్పు తీసుకురావాలన్నారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తోందని, తల్లిదండ్రుల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే అనీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ పిల్లలు ఏ రంగంలో ఆసక్తి చూపుతున్నారో తల్లిదండ్రులు గమనించి ఆ రంగంలో వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్జేడీ శ్రీనివాసులురెడ్డి, డీఈవో శామ్యూల్, పీవో విశ్వనాథ్, శాస్త్రవేత్త జగదీష్, ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


ప్రదర్శన చూసేందుకు బారులు తీరిన విద్యార్థులు

ఆకట్టుకుంటున్న నమూనాలు

ఈ ప్రదర్శనలో పలు జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు రూపొందించిన నమూనాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ నమూనాలు చూసేందుకు నగరంలోని పలు పాఠశాలల నుంచి వందల మంది విద్యార్థులు తరలివచ్చారు. నేడు, రేపు ఈ ప్రదర్శన కొనసాగనుంది.

అలరించిన సాంస్కృతికాలు

ప్రదర్శనలో భాగంగా సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల నృత్య ప్రదర్శనలు, పాటల పోటీలు, నాటికలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనపై విద్యార్థులకు క్విజ్, వక్తృత్వం, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. చివరిగా డిజిటల్ లావాదేవీలపై సెమినార్ నిర్వహించారు.

బాల శాస్త్రవేత్తలూ భళా!

» బుల్లి బుర్రలతో ఆసక్తికర నమూనాలు » ఆలోచింపజేస్తున్న ఉపాధ్యాయుల మోడల్స్

» ఆకట్టుకుంటున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

నెల్లూరు (క్యాంపస్), జనవరి 3 : స్వయం శుభ్రత మూత్రశాలను ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుంది... వైద్యశాలలో ఉపయోగించి పారేసే వ్యర్థాలు సమాజానికి ఏవిధంగా హాని కలిగిస్తాయి, హాని కలిగించకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలి. మనం రోజూ ఉపయోగించే వస్తువుల్లో కల్తీలను ఏ విధంగా తెలుసుకోవచ్చు.. ఇలాంటి ప్రయోగాలతో ఆకట్టుకునేలా బాల శాస్త్రవేత్తలు నమూనాలను ప్రదర్శిస్తే.. మద్యం సేవించి నడపబోతే వాహనాలు స్టార్ట్ కాకుండా తక్కువ ఖర్చుతో సెన్సార్ ఏర్పాటు చేయడం, వాహనాలలో ఫైర్, స్పీడ్ బ్రేకర్, రోడ్డు డౌన్ అలారాలు ఏర్పాటు చేసి ప్రమాదాలను ముందే గుర్తించడం వంటి నమూనాలతో ఉపాధ్యాయులు ఆలోచింపజేసే నమూనాలతో ముందుకొచ్చారు. సుబేదారుపేటలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో బుధవారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో ఈ నమూనాలను వీక్షించవచ్చు. 5వతేదీ వరకు, మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుంది. సుస్థిరాభివృద్ధికై ఆవిష్కరణలు అనే ప్రధానాంశంతో ఆరోగ్యం- స్వస్థత, వనరుల నిర్వహణ- ఆహార భద్రత, వ్యర్థాల నివారణ- జలసంరక్షణ, రవాణా- సమాచార రంగం, డిజిటల్- సాంకేతిక పరిష్కారాలు, గణిత నమూనాలు.. అనే ఆరు ఉప శీర్షికలతో 198 నమూనాలను ప్రదర్శనలో ఉంచారు.

మూత్రశాల స్వయం శుభ్రత



ప్రకాశం జిల్లా పొనగానినారిపాళెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన టి జయకృష్ణ, ధనుష్‌లు స్వయం శుభ్రత మూత్రశాల నమూనాను ప్రదర్శనకు ఉంచారు. ఈ నమూనా ప్రధాన ఉద్దేశం మూత్రశాలను శుభ్రపరిచేందుకు పర్యవేక్షణ అవసరం లేకుండా వాటికి అవే శుభ్రపరుచుకోవడం. మూత్ర విసర్జనకు గదిలోకి వెళ్లేప్పుడు తలుపు తీయడం, వేయడాన్ని సెన్సార్‌ల ద్వారా గుర్తించి ట్యాంకులో ఉన్న నీరు పైపుల ద్వారా వెలువడేలా ఇందులో ఏర్పాటు ఉంటుంది.

పక్షుల నుంచి గింజలను కాపాడేందుకు..



కడప జిల్లా రాజంపేట మండలం తాళ్లపాక జడ్పీ పాఠశాల విద్యార్థులు ఆర్ బాలకృష్ణ, ఎస్ వెంకటేశ్వర్లు పీవీసీ పైపుల సాయంతో ఓ సౌండ్ గన్ తయారు చేశారు. ఇది ఆహార పదార్థాలను, ఆహార పంటలను ఆశించే పక్షులు, వన్యజీవులను పెద్ద శబ్దంతో బెదరగొడుతుంది. ఈ గన్‌ను ఒకసారి పేలిస్తే దాని నుంచి వచ్చే శబ్దం రెండెకరాల దూరం వరకు వ్యాపిస్తుంది. ఈ శబ్దం విని పిట్టలు, పక్షులు పంట జోలికి రావని, తక్కువ ఖర్చుతో తయారయ్యే ఈ గన్‌ను వినియోగించడం ద్వారా పంటను కాపాడుకోవడంతోపాటు జీవరాశిని కాపాడుకోవచ్చని విద్యార్థులు తెలుపుతున్నారు.



ఆస్పత్రి వ్యర్థాలను సమూలంగా నాశనం చేయడం

కడప జిల్లా రాయచోటి మండలం మాసాపేట గ్రామంలోని ఎస్ఆర్ఆర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థి మహ్మద్‌రఫీ మేనేజ్‌మెంట్ ఆఫ్ బయో హజార్డ్స్ నమూనాను ప్రదర్శనలో ఉంచాడు. ఈ నమూనా ముఖ్య ఉద్దేశం ఆస్పత్రుల్లో ఉపయోగించిన వ్యర్థాలను బయట ఎక్కడపడితే అక్కడ వేయడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం. ఆస్పత్రి వ్యర్థాల వల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతారని, వీటిని ఏ విధంగా సమూలంగా నాశనం చేయాలన్న విషయాన్ని తెలియజేస్తూ ఈ నమూనాను ప్రదర్శించాడు.

వాహనాలలో డేంజర్ అలారం

అనంతపురం జిల్లా గుత్తి జడ్పీ బాలికల అధ్యాపకురాలు బివి జలజాక్షి 'ట్రాన్స్‌పోర్టు అండ్ కమ్యూనికేషన్ ఇంటెలిజెన్స్ ఇన్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్' అనే నమూనాను ప్రదర్శనలో ఉంచారు. రహదారులపై జరిగే ప్రమాదాలను ముందుగానే గుర్తించి ప్రమాదాలు జరగకుండా చూడడం దీని ప్రధాన ఉద్దేశం. దీనికోసం వాహనాల్లో మంటలు, స్పీడ్‌బ్రేకర్, రోడ్డు డౌన్, రోడ్డు హై ప్రాంతాలను గుర్తించే అలారంను ఏర్పాటు చేశారు. ఈ అలారం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలియజేశారు.





కల్తీని గుర్తించడం ఎలా

కర్నూలు జిల్లా చాగలమర్రి జడ్పీ హైస్కూలు విద్యార్థి బి సాయి యశ్వంత్ కల్తీని గుర్తించు- ఆరోగ్యంగా జీవించు అనే నమూనాను ప్రదర్శనలో ఉంచాడు. మనం రోజూ ఉపయోగించే పాలు, పప్పు దినుసులు, ఉప్పు, చక్కెర లాంటి నిత్యావసర వస్తువులలో కల్తీని ఏ విధంగా గుర్తించవచ్చో ఈ నమూనా ద్వారా ప్రజలకు క్షుణ్ణంగా తెలియజేస్తున్నాడు.

మద్యం సేవిస్తే వాహనం స్టార్ట్ కాదు!



ప్రకాశం జిల్లా దర్శి జడ్పీ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ఎన్ నాగేశ్వరరావు 'డిటెక్షన్ ఆఫ్ డ్రైవర్- ప్రొటెక్షన్ ఆఫ్ డ్రైవింగ్' అనే నమూనాను ప్రదర్శనలో ఉంచారు. ఈ నమూనా ముఖ్య ఉద్దేశం డ్రంక్ అండ్ డ్రైవ్‌ను నివారించడం. వాహన ప్రమాదాలు ఎక్కువగా వాహన చోదకులు మద్యం సేవించి నడిపే సమయంలో జరుగుతున్నాయని నివేదికలు తెలుపుతున్నాయి. వాహనంలో ఈ నమూనా సెన్సార్ బిగిస్తే డ్రైవర్ మద్యం సేవించినా, సీట్ బెల్టు పెట్టుకోకున్నా వాహనం స్టార్ట్ కాదు. తద్వారా ప్రమాదాలు నివారించవచ్చు.

ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్ నూతన అధ్యక్షుడు?

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

1. 2017కి గాను పురుషుల విభాగంలో ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ విజేత?
ఎ) మాగ్నస్ కార్ల్‌సన్(నార్వే)
బి) వ్లాదిమర్ ఫెడోసివ్(రష్యా)
సి) విశ్వనాథన్ ఆనంద్(ఇండియా)
డి) అలెగ్జాండర్ గ్రిషుక్(రష్యా)

2. 2017కి గాను మహిళల విభాగంలో ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ విజేత?
ఎ) జువెన్‌జున్(చైనా)
బి) జుడిత్ పోల్గర్(హంగేరి)
సి) సోఫియా పోల్గర్(హంగేరి)
డి) అనా ఉషెనినా(ఉక్రెయిన్)

3. 2017కి గాను 'రాయల్‌కప్' ఏషియన్ టూర్ టైటిల్ విజేత శివకపూర్. అతడు ఏ క్రీడకు సంబంధించిన వ్యక్తి?
ఎ) షూటింగ్ బి) బిలియర్డ్స్
సి) గోల్ఫ్ డి) జిమ్నాస్టిక్స్

4. గ్లోబ్ సాకర్ అవార్డ్స్-2017 ఉత్తమ సాకర్ ఆటగాడిగా ఎవరు ఎంపికయ్యారు?
ఎ) లియోనెల్ మెస్సీ బి) క్రిస్టియనా రొనాల్డో
సి) నెయ్‌మార్(బ్రెజిల్) డి) ముల్లర్(జర్మనీ)

5. ఢిల్లీపై గెలుపొంది 2017-18 రంజీ ట్రోఫీ చాంపియన్‌గా నిలిచిన జట్టు?
ఎ) ముంబై బి) గుజరాత్
సి) తమిళనాడు డి) విదర్భ



6. 61వ జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆతిథ్యమిస్తున్న వేదిక?
ఎ) లుధియానా(పంజాబ్)
బి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
సి) బెంగళూరు(కర్ణాటక)
డి) తిరువనంతపురం(కేరళ)

7. రంజీ ట్రోఫీ ఫైనల్‌లో హ్యాట్రిక్ సాధించిన రెండో బౌలర్ రజనీష్ గుర్బానీ(విదర్భ). అయితే 1972-73లో ఈ ఘనత సాధించిన తొలి బౌలర్?
ఎ) కళ్యాణ సుందరం(తమిళనాడు)
బి) ఆర్.పి.సింగ్(ఉత్తరప్రదేశ్)
సి) అర్షద్ అయూబ్(హైదరాబాద్)
డి) జవగళ్ శ్రీనాథ్(కర్ణాటక)

8. క్రికెట్ చరిత్రలో తొలిసారిగా నాలుగు రోజుల టెస్ట్ మ్యాచ్‌ను ఏ రెండు దేశాల మధ్య నిర్వహించారు?
ఎ) ఆస్ట్రేలియా - న్యూజిలాండ్
బి) దక్షిణాఫ్రికా-జింబాబ్వే
సి) దక్షిణాఫ్రికా - న్యూజిలాండ్
డి) వెస్టిండీస్ - జింబాబ్వే

9. 2018 జనవరి 12-16 వరకు 22వ జాతీయ యువజన ఉత్సవాలు ఏ నగరం వేదికగా నిర్వహించనున్నారు?
ఎ) జైపూర్(రాజస్థాన్)
బి) రాయ్‌పూర్(ఛత్తీస్‌గఢ్)
సి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
డి) మదురై(తమిళనాడు)

10. 2017 డిసెంబర్ 27-31 వరకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఆతిథ్యం ఇచ్చిన నగరం?
ఎ) హైదరాబాద్(తెలంగాణ)
బి) గాంధీనగర్(గుజరాత్)
సి) కొచ్చి(కేరళ) డి) భువనేశ్వర్(ఒడిశా)

11. 2018 జనవరి 13-15 వరకు అంతర్జాతీయ తీపి పదార్థాల ఉత్సవాలకు ఆతిథ్యం ఇవ్వనున్న నగరం?
ఎ) కాకినాడ(ఆంధ్రప్రదేశ్)
బి) నాగ్‌పూర్(మహారాష్ట్ర)
సి) అమరావతి(ఆంధ్రప్రదేశ్)
డి) హైదరాబాద్(తెలంగాణ)

12. 78వ 'ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్-2017' సదస్సును ఎక్కడ నిర్వహించారు?
ఎ) ఉస్మానియా యూనివర్సిటీ(హైదరాబాద్)
బి) జాదవ్‌పూర్ యూనివర్సిటీ(కోల్‌కతా)
సి) షేర్-ఎ-కశ్మీర్ యూనివర్సిటీ(శ్రీనగర్)
డి) బర్కతుల్లా యూనివర్సిటీ(భోపాల్)

13. 2017 డిసెంబర్ 31న బహిరంగ మలవిసర్జన రహిత రాష్ట్రంగా దేన్ని ప్రకటించారు?
ఎ) మిజోరాం బి) ఒడిశా
సి) అరుణాచల్‌ప్రదేశ్ డి) బీహార్

14. కూరగాయలకు కనీస మద్దతు ధర ప్రకటించడం ద్వారా ఆ ప్రత్యేకత పొందిన తొలిరాష్ట్రంగా నిలిచింది?
ఎ) పంజాబ్ బి) హర్యానా
సి) నాగాలాండ్ డి) బీహార్

15. ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్‌కు నూతన అధ్యక్షుడు?
ఎ) వినయ్ సహస్రబుద్దే బి) లోకేశ్ చంద్ర
సి) ప్రతిష్టశర్మ డి) నజ్మాహెప్తుల్లా

16. కేంద్ర పునర్వినియోగ ఇంధన వనరుల శాఖ వివరాల ప్రకారం మునిసిపల్ వ్యర్థాల నుంచి తయారవుతున్న విద్యుత్ 65.75 మెగా వాట్స్. మొత్తం విద్యుత్‌లో ఎంత శాతం?
ఎ) 1.6% బి) 0.02% సి) 0.8% డి) 0.6%

17. 2018 మార్చిలో 105వ సైన్స్ కాంగ్రెస్ సమావేశానికి ఆతిథ్యమిస్తున్నది?
ఎ) ఉస్మానియా యూనివర్సిటీ(హైదరాబాద్)
బి) మణిపూర్ యూనివర్సిటీ(ఇంఫాల్)
సి) శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ(తిరుపతి)
డి) ఫిజికల్ రీసెర్చ్ లేబరేటరీ(అహ్మదాబాద్)

18. పాసింజర్ రైళ్లకు ఎప్పటిలోగా బయోటాయ్‌లెట్లను 100% అమర్చాలని కేంద్రం నిర్ణయించింది?
ఎ) 2018 డిసెంబర్ బి) 2019 మార్చి
సి) 2018 జూలై డి) 2022 మార్చి

19. 2017కి గాను PETA పర్సన్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికైన బాలీవుడ్ నటి అనుష్కశర్మ. PETA ను విస్తరించండి.
ఎ) పీపుల్ ఫర్ ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్
బి) ప్రొటెక్షన్ ఎంటాంజిబుల్ యానిమల్స్
సి) ప్రిజర్వేషన్ అండ్ ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్
డి) పీపుల్ ఫర్ ఎమోషనల్ ట్రాకింగ్ ఆఫ్ యానిమల్స్

20. 2018 జనవరి 12న కార్టోశాట్-2 సహా 31 ఉపగ్రహ ప్రయోగాలకు ఇస్రో ఉపయోగిస్తున్న వాహక నౌక?
ఎ) PSLV-C36 బి) PSLV-C40
సి) PSLV-C342 డి) PSLV-C39

21. 2017 డిసెంబర్ 29న నిర్మలా సీతారామన్ 'సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆపర్చునిటీస్ అండ్ లెర్నింగ్' కేంద్రాన్ని ఎక్కడ ప్రారంభించారు?
ఎ) మంగళూరు(కర్ణాటక)
బి) విశాఖపట్నం(ఆంధ్రప్రదేశ్)
సి) ట్యుటికొరిన్(తమిళనాడు)
డి) పనజి(గోవా)

22. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018 సంవత్సరాన్ని ఏ విధంగా ప్రకటించింది?
ఎ) నవతేజ శిశు వికాస సంవత్సరం
బి) విద్యుదీకరణ సంవత్సరం
సి) రైతు సౌభాగ్య సంవత్సరం
డి) తెలుగు అభివృద్ధి సంవత్సరం

23. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ 2017కు గాను వెలువరించిన 'శాంతి అనుకూల సూచి'లో తొలి మూడు స్థానాలు పొందిన దేశాలు వరుసగా ...
ఎ) స్వీడన్, స్విట్జర్లాండ్, డెన్మార్క్
బి) ఐస్‌లాండ్, నార్వే, ఫిన్లాండ్
సి) స్వీడన్, స్విట్జర్లాండ్, ఫిన్లాండ్
డి) ఫిన్లాండ్, స్వీడన్, నార్వే

24. హిమాచల్‌ప్రదేశ్ నూతన ముఖ్యమంత్రి?
ఎ) జయప్రకాశ్ నడ్డా బి) ప్రేమ్‌కుమార్ దుమాల్
సి) జైరామ్ ఠాకూర్ డి) సత్పాల్‌సింగ్ సాధి

25. జాతీయ ఇ-గవర్నెన్స్‌లో భాగంగా చేపట్టిన క్రిమినల్ ట్రాకింగ్ అండ్ నెట్‌వర్క్ సిస్టం ఆధారంగా 2018 జనవరి 1 నుంచి అన్ని పోలీస్ కార్యకలాపాలను డిజిటలైజ్ చేసిన రాష్ట్రం?
ఎ) ఆంధ్రప్రదేశ్ బి) గోవా సి) గుజరాత్ డి) ఒడిశా

26. 2017 డిసెంబర్ 27న రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ఏ రాష్ట్రానికి చెందిన ఫైబర్ నెట్ ప్రాజెక్టును ప్రారంభించారు?
ఎ) మధ్యప్రదేశ్ బి) ఆంధ్రప్రదేశ్
సి) బీహార్ డి) తెలంగాణ

27. 2018 జనవరి 1న తెలంగాణ పోలీస్‌శాఖ ప్రవేశపెట్టిన 'TSCOP' యాప్ ద్వారా ఎన్ని రకాల సేవలు అందుబాటులోకి రానున్నాయి?
ఎ) 100 బి) 63 సి) 44 డి) 54

28. సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఇటీవల ఏ రాష్ట్రంలో ఆరు నెలల పాటు పొడిగించారు?
ఎ) త్రిపుర బి) నాగాలాండ్
సి) మణిపూర్ డి) మేఘాలయ

29. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 700 మెగావాట్ల లక్ష్యంతో పాకిస్థాన్ ప్రభుత్వం 'ఆజాద్ పట్టాన్ జల విద్యుత్ కేంద్రం'ను ఏ నదిపై నిర్మిస్తోంది?
ఎ) సింధు నది బి) జీలం నది
సి) స్వాత్ నది డి) కుర్రం నది

30. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్స్ 2017కి గాను వెలువరించిన 'శాంతి అనుకూల సూచి'లో భారత ర్యాంక్?
ఎ) 90 బి) 163
సి) 106 డి) 123



31. ఆంధ్రప్రదేశ్ నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డిజిపి)?
ఎ) నండూరి సాంబశివరావు
బి) గౌతం సవాంగ్
సి) మాల కొండయ్య
డి) అరవిందరావు



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

32. లైబీరియా నూతన అధ్యక్షుడు?
ఎ) జార్జి వా
బి) చార్లెస్ టేలర్
సి) ఎలెన్ జాన్సన్ సర్లీఫ్
డి) విలియం ట్యుబ్‌మన్

33. కేర్‌రేటింగ్స్(క్రెడిట్ రేటింగ్స్ అండ్ రీసెర్చ్)-2017 నివేదిక ప్రకారం ప్రపంచంలో అత్యధిక నిరర్థక ఆస్తులు కలిగిన దేశం గ్రీసు, కాగా భారత్ ర్యాంక్?
ఎ) 18 బి) 35
సి) 14 డి) 5

34. దేశ చరిత్రలో తొలిసారి ప్రపంచ చెస్ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా ప్రాముఖ్యం పొందిన దేశం?
ఎ) లిబియ బి) ఖతార్
సి) సౌదీ అరేబియా డి) ఘనా

35. 2018 జనవరి 1 నుంచి VAT(వాల్యూ ఆడెడ్ ట్యాక్స్)ను ప్రవేశపెట్టిన దేశాలు?
ఎ) సౌదీ అరేబియా, యుఎఇ బి) కెన్యా, దక్షిణాఫ్రికా
సి) గ్రీసు, వెనిజులా డి) ఇథియోపియా, గ్రీసు

36. 2017 డిసెంబర్ 26న భారత్ ఏ దేశానికి 1 మిలియన్ డాలర్ల మానవతాపరమైన వైద్య సహాయం అందించాలని నిర్ణయించింది?
ఎ) గ్రీసు బి) యెమన్
సి) మయన్మార్ డి) శ్రీలంక

37. జింబాబ్వే నూతన ఉపాధ్యక్షుడు?
ఎ) అబ్దుల్లాహి ఫర్మాజో బి) ఒమర్-అల్-బషీర్
సి) సెబాస్టియన్ పినెరా డి) కాన్‌స్టాంటిన్ చివేగా

38. మాలి నూతన ప్రధాని?
ఎ) ఇబ్రహిం కేయిత బి) బొబయ్ మైగా
సి) మిచెల్లి బాచ్‌లెట్ డి) సెబాస్టియన్ పినెరా

సమాధానాలు

1) సి	9) ఎ	17) బి	25) డి	33) డి
2) ఎ	10) బి	18) బి	26) బి	34) సి
3) సి	11) డి	19) ఎ	27) డి	35) ఎ
4) బి	12) బి	20) బి	28) బి	36) బి
5) డి	13) సి	21) ఎ	29) బి	37) డి
6) డి	14) బి	22) డి	30) ఎ	38) బి
7) ఎ	15) ఎ	23) సి	31) సి	
8) బి	16) బి	24) సి	32) ఎ	

ఫెలోషిప్స్

సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్

బెంగళూరులోని డిఆర్‌డిఒ-సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
జూనియర్ రీసెర్చ్ ఫెలో: 15
విభాగాలు:ఏరోడైనమిక్స్, స్ట్రక్చరల్ డిజైన్ అనాలసిస్, రాడార్ ఇంజనీరింగ్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, నెట్‌వర్కింగ్ & డిస్‌ప్లే సిస్టమ్స్, మిషన్ కంప్యూటర్, థర్మల్ మేనేజ్‌మెంట్.
అర్హత:బిఇ/బిటెక్/ఎంఇ/ఎంటెక్(ఎలక్ట్రానిక్స్/ఇసిఇ/ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇఇఇ/సిఎస్‌ఇ/ ఇన్ఫర్మేషన్ సైన్స్/ఏరోనాటిక్స్/మెకానికల్ ఇంజనీరింగ్). నెట్/గేట్ అర్హత ఉండాలి.
వయోపరిమితి: 28 సంవత్సరాలు మించకూడదు
ఫెలోషిప్: రూ.25,000 **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా **చివరి తేదీ:** 2018 జనవరి 19
చిరునామా: The Director, Centre for Airborne Systems (CABS), DRDO, Ministry of Defence, Belur, Yemlur PO., Bengaluru - 560 037.
వెబ్‌సైట్: https://www.drdo.gov.in

టిఫర్ విఎస్ఆర్‌పి-2018

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టిఫర్) సమ్మర్ ప్రోగ్రాంలో రీసెర్చ్ కోసం దరఖాస్తులు కోరుతోంది.
ప్రోగ్రాం: విజిటింగ్ స్టూడెంట్స్ రీసెర్చ్ ప్రోగ్రాం
కాల వ్యవధి: 2018 మే 7 నుంచి జూలై 4 వరకు
స్టయిపెండ్: నెలకు రూ.7000
అర్హత: ఆయా కోర్సుల్లో ప్రస్తుతం చదువుతున్న డిగ్రీ లేదా పీజీ విద్యార్థులు
ఎంపిక: అకడమిక్ మెరిట్, రైటప్, రిఫరీ నివేదికల ఆధారంగా **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్
చివరి తేదీ: 2018 ఫిబ్రవరి 28
వెబ్‌సైట్: http://www.tifr.res.in

ఎన్ఐపిజిఆర్

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ జీనోమ్ రీసెర్చ్ సీనియర్ రీసెర్చ్ ఫెలో భర్తీకి దరఖాస్తు కోరుతోంది.
సీనియర్ రీసెర్చ్ ఫెలో:01
అర్హత: ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్/బయో టెక్నాలజీ/ బయో ఇన్ఫర్మాటిక్స్/మాలిక్యూలర్ బయాలజీ)
అనుభవం:సంబంధిత విభాగంలో రెండేళ్ల అనుభవం ఉండాలి. **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్
చివరి తేదీ: 2018 జనవరి 12
చిరునామా: Dr. Swarup Kumar Parida, Scientist, NIPGR. Aruna Asraf Ali Mrag, P.O. Box No. 10531, New Delhi - 110067.
వెబ్‌సైట్: http://www.nipgr.res.in/careers

భారతదేశంలో జనగణనను ఎవరు నిర్వహిస్తారు?

పాఠం-5

భారతదేశ నదులు, నీటి వనరులు

ఒక మార్కు ప్రశ్నలు

1. **భారత నదీ వ్యవస్థ ఏ అంశాలకు అనుగుణంగా రూపొందింది?**

జ: భారతదేశ నదీ వ్యవస్థ భౌతిక అంశాలకు అనుగుణంగా రూపొందింది. అవి 1)హిమాలయాలు, 2)ద్వీపకల్ప పీఠభూమి, 3)గంగా - సింధూ మైదానం.

2. **హిమాలయ నదులను జీవనదులని ఎందుకు పిలుస్తున్నారు?**

జ: హిమాలయ నదులు జీవనదులు, సంవత్సరమంతా వీటిలో నీరు ఉంటుంది. వర్షపాతం, కరుగుతున్న మంచుతో నీరు అందడం వల్ల వీటిని జీవనదులుగా పిలుస్తున్నారు.

3. **తుంగ భద్రానది పరివాహక ప్రాంతాన్ని ఎలా విభజిస్తారు?**

జ: తుంగభద్రానది పరివాహక ప్రాంతాన్ని మూడుగా విభజిస్తారు. 1)కర్ణాటకలోని ఎగువ, మధ్య పరివాహక ప్రాంతాలు, 2)ఆంధ్రప్రదేశ్‌లోని దిగువ పరివాహక ప్రాంతం.

4. **భూగర్భ జలాలకు సంబంధించిన చట్టాలు ఎందుకు ప్రస్తుత పరిస్థితులకు అనుకూలమైనవి కావు?**

జ: భూగర్భ జలాల వినియోగం నామమాత్రంగా ఉన్న రోజుల్లో సంబంధిత చట్టాలను రూపొందించారు. దాంతో అవి నేటి కాలానికి అనువుగా లేవు.

5. **'వాటర్ షెడ్' పదాన్ని వర్ణించండి.**

జ: ఒక ఎత్తయిన ప్రాంతంలో ఒక వైపు నీటి ప్రవాహాలు ఒక నదిలోనూ, మరో వైపు నీటి ప్రవాహాలు మరో నదిలోనూ కలిస్తే దానిని 'వాటర్ షెడ్' అని అంటారు. ఈ నీటిని భూమిలోనికి ఇంకేలా చేయడానికి చెట్లు నాటవచ్చు. లేదా చెరువులు లాంటివి తవ్వించవచ్చు. అలా చేయడాన్ని 'వాటర్ షెడ్ అభివృద్ధి పథకం' అని అంటారు.

2 మార్కుల ప్రశ్నలు

1. **హిమాలయ నదుల గూర్చి తెలపండి?**

జ: హిమాలయ నదులు మూడు ముఖ్యమైన వ్యవస్థల కిందకు వస్తాయి. అవి గంగ, సింధూ, బ్రహ్మపుత్ర నదులు. ఈ నదులు దాదాపు ఒకే ప్రాంతంలో కొన్ని కిలోమీటర్ల వ్యత్యాసంతో పుట్టి పర్వత శ్రేణుల వల్ల వేరు అయ్యాయి. అవి మొదట పర్వతాల ప్రధాన అక్షానికి సమాంతరంగా ప్రవహిస్తాయి. తరవాత ఒక్కసారిగా అవి దక్షిణానికి మలుపు తిరిగి ఎత్తయిన పర్వత శృంఖలాలను కోసుకుంటూ ఉత్తర భారత మైదానాలను చేరుకుంటాయి. ఈ క్రమంలో ఇవి లోతైన V ఆకారపు లోయలను ఏర్పరిచాయి. ఇది సింధు, బ్రహ్మపుత్ర నదుల్లో బాగా కనిపిస్తుంది.

2. **అవపాతం అంటే ఏమిటి?**

జ: అవపాతం అంటే వర్షం ఒక్కటే కాకుండా వడగళ్లు, హిమం, పొగమంచు కూడా ఉంటాయి. అవపాతం అన్ని సంవత్సరాలు ఒకేలా కాకుండా ఏటా మారుతూ ఉంటుంది. అవపాతం సగటును పరిగణనలోకి తీసుకుంటారు.

3. **హివారే బజారులో నాలుగు ముఖ్యమైన నిషేధాలు ఏవి?**

జ: మహారాష్ట్రలో ఆదర్శ గ్రామ పథకాన్ని మొదలు పెట్టినపుడు గ్రామాల ఎంపికకు కొన్ని షరతులు పెట్టారు. దీంట్లో ముఖ్యమైన నాలుగు నిషేధాలు ఉన్నాయి. 'రాలే గావ్ సిద్ధి' సాధించిన విజయంతో అవి ప్రఖ్యాతి గాంచాయి. అవి..చెట్లను నరకడం నిషేధం, పశువులను స్వేచ్ఛగా మేయడానికి వదలడం నిషేధం, మత్తు పానీయాల నిషేధం, అధిక సంతానం నిషేధం. అంతే కాకుండా ప్రజలు కొంత శ్రమదానం కూడా చెయ్యాలి. భూమిలేని పేదలకు దీని నుంచి మినహాయింపు ఉంది.

4. **పుట్టుక ఆధారంగా మనదేశ నదీ జలవ్యవస్థను వర్గీకరించండి.**

జ: పుట్టుక ఆధారంగా మనదేశ నదీ జల వ్యవస్థను రెండుగా విభజించవచ్చు. అవి:1)హిమాలయ నదులు, 2)ద్వీపకల్ప నదులు. **హిమాలయ నదులు:** వీటిలో నీళ్ల ఉంటాయి. వర్షపాతం, కరుగుతున్న మంచుతో నీళ్ల అందడం వల్ల జీవనదులుగా పిలుస్తున్నారు. ఉదా: గంగా, సింధు, బ్రహ్మపుత్ర మొదలైనవి.

ద్వీపకల్ప నదులు: ద్వీకల్ప నదుల్లో సంవత్సరమంతా నీరు ఉండదు. ఇవి వర్షం మీద ఆధారపడి ఉంటాయి.

ఉదా: గోదావరి, కృష్ణా, కావేరి, మహానది మొదలైనవి

5. **పటాన్ని పరిశీలించి కింద ప్రశ్నలకు జవాబులు రాయండి?**



పటం - : గంగా, బ్రహ్మపుత్రా సంగమం

1. హిమాలయాల్లో పుట్టి గంగానదిలో కలిసే ఉపనదు లేవి?
2. బ్రహ్మపుత్ర నదిని టిబెట్‌లో ఏ పేరుతో పిలుస్తారు?
3. ద్వీకల్ప పీఠభూమిలో పుట్టి గంగానదిలో కలిసే ఉపనదులు ఏవి?
4. గంగానది ఏయే రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తోంది?

సమాధానాలు:

1) గోమతి, గండక్, కోసి, ఘగ్గర్ మొదలైన ఉపనదులు
2) బ్రహ్మపుత్ర నదిని టిబెట్‌లో సాంగ్‌పో నది అని పిలుస్తారు
3) చంబల్, బేత్వా, ధమ్సా, సోన్ మొదలైనవి ద్వీపకల్ప పీఠభూమిలో పుట్టి గంగానదిలో కలిసే ఉపనదులు
4) గంగానది ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తోంది

4 మార్కుల ప్రశ్నలు

1. **మీ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. ఏయే కారణాల వల్ల ఇలా జరిగిందని నీవు భావిస్తున్నావు?**

జ: 1) భూగర్భ జలం ప్రధాన జలవనరుగా ఉన్నది
2) భూగర్భ జలాలు అక్కడికి చేరుకునే వాటి కంటే ఎక్కువ మొత్తంలో వాటిని తోడి వేస్తున్నారు.
3) పర్యవసానంగా ఎక్కువ లోతుకు బోరుబావులను తవ్వుతున్నారు
4) భూగర్భ జలాలను వ్యవసాయానికి ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.
5) పారిశ్రామిక, గృహ అవసరాలకు కూడా భూగర్భ జలాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు.
6) అడవుల నరికివేత వల్ల కూడా భూమిలోకి ఇంకే నీటి పరిమాణం తగ్గుతుంది.
7) ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కువగా భూమి మీద వదలడం వల్ల భూమిలోకి నీరు ఇంకే స్థాయి తగ్గి, భూగర్భ జల మట్టాలు తగ్గిపోతున్నాయి.
8) ఇంకుడు గుంతలను సరిగా వినియోగించకపోవడం మొదలైన కారణాల వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి.

పాఠం-6

ప్రజలు

ఒక మార్కు ప్రశ్నలు

1. **భారతదేశంలో జనగణనను ఎవరు నిర్వహిస్తారు?**

జ: సెన్సస్ ఆఫ్ ఇండియా అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ జనగణన, సేకరణ, నమోదు, విశ్లేషణ మొదలైన కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

2. **భారతదేశ అక్షరాస్యత ఎంత?**

జ: భారతదేశ అక్షరాస్యత: 74.04%, పురుషుల అక్షరాస్యత:82.14%, స్త్రీల అక్షరాస్యత: 65.46%

3. **జనాభా మార్పును ప్రభావితం చేసే అంశాలు ఏవి?**

జ: 1)జననాలు 2)మరణాలు 3)వలసలు

4. **2011లో భారతదేశ జనాభా వృద్ధి శాతం ఎంత?**

జ: 2011లో భారతదేశ జనాభా వృద్ధిశాతం : 17.58%

5. **భారతదేశంలో అత్యధిక జన సాంద్రత గల రాష్ట్రం ఏది?**

జ: అత్యధిక జన సాంద్రత గల రాష్ట్రం - పశ్చిమ బెంగాల్(904)

6. **భారతదేశంలో అత్యల్ప జనసాంద్రత గల రాష్ట్రం ఏది?**

జ: అత్యల్ప జనసాంద్రత గల రాష్ట్రం - అరుణాచల్ ప్రదేశ్(13)

7. **ఆంధ్ర ప్రదేశ్‌లో అత్యధిక జన సాంద్రత గల జిల్లా ఏది?**

జ: ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక జనసాంద్రత గల జిల్లా - కృష్ణా(519)

8. **ఆంధ్రప్రదేశ్‌లో అత్యల్ప జన సాంద్రతగల జిల్లా ఏది?**

జ: ఆంధ్రప్రదేశ్‌లో అత్యల్ప జన సాంద్రతగల జిల్లా - వైఎస్ఆర్ కడప జిల్లా(188)

9. **జనాభా వృద్ధి శాతం అంటే ఏమిటి?**

జ: జనాభా వృద్ధి శాతం చాలా ముఖ్యమైన అంశం. దీనిని సంవత్సరానికి శాతంలో లెక్కగడతారు. ఉదాహరణకు సంవత్సరానికి 2% వృద్ధి అంటే అంతకు ముందు సంవత్సరంలో ఉన్న ప్రతి వంద మందికి ఇద్దరు చొప్పున జనాభా పెరిగిందన్నమాట. ఇది చక్రవడ్డీలాగా ఉంటుంది. దీనిని వార్షిక వృద్ధి శాతం అంటారు.

10. **లింగ నిష్పత్తిని ఎలా లెక్కిస్తారు?**

జ: ప్రతి 1000 మంది పురుష జనాభాకు ఉండే స్త్రీ జనాభా ఆధారంగా లింగ నిష్పత్తిని లెక్కిస్తారు.

11. **మనదేశంలో గత దశాబ్దకాలంలో మరణాల శాతం తగ్గడానికి గల ప్రధాన కారణమేమిటి?**

జ: 1.మెరుగైన వైద్య సేవలను ప్రజలకు అందించడం వల్ల
2.వైద్య విధానంలో ఆధునిక సౌకర్యాల వినియోగం వల్ల
3.విద్య, సైన్స్, సాంకేతిక పరిజ్ఞానం పెరిగి, ప్రజల జీవన ప్రమాణం మెరుగవడం వల్ల

2 మార్కుల ప్రశ్నలు

1. **దేశ జనాభాను వయసుల వారీగా వర్గీకరించి వివరించండి.**

జ: భారతదేశ జనాభాను ప్రధానంగా మూడు వయసుల వర్గాలుగా విభజించారు. అవి...
1) పిల్లలు(సాధారణంగా 15 సంవత్సరాల లోపువారు) సంరక్షణను కుటుంబం చూసుకుంటుంది.
2) పనిచేసే వయసు(15-59 సంవత్సరాలు) సాధారణంగా సమాజంలో పనిచేసే జనాభా ఇది. వీరు పునరుత్పత్తి వయసులో కూడా ఉంటారు.
3) వృద్ధులు(59 సంవత్సరాలు పైబడిన వారు) వృద్ధాప్యంలో మద్దతు కోసం ఈ వయసు తమ కుటుంబాలపై ఆధారపడి ఉంటారు.

2. **భారతదేశ జనసాంద్రత హెచ్చు తగ్గులకు కారణమేమిటి?**

జ: 2011లో భారతదేశ జన సాంద్రత చదరపు కిలోమీటరుకి 382 వ్యక్తులు. ఈ సాంద్రతలో తేడాలు పశ్చిమబెంగాల్‌లో 904 నుంచి అరుణాచల్ ప్రదేశ్‌లో 13 వరకు ఉన్నాయి. అసోం, ద్వీపకల్ప ప్రాంత అనేక రాష్ట్రాల్లో జనసాంద్రత ఒక మాదిరిగా ఉంది. భూభాగం కొండలు, రాళ్లతో ఉండటం, ఒక మోస్తరు కాని నేలలు ఈ ప్రాంతంలోని జనసాంద్రతను ప్రభావితం చేశాయి. ఉత్తర మైదానాలు, కేరళలో చదునైన మైదానాలు, సారవంతమైన నేలలు, అధిక వర్షపాతం ఫలితంగా అధిక నుంచి చాలా అధిక జనసాంద్రత ఉంది.

3. **కింది పేరాగ్రాఫ్‌ను చదివి ప్రశ్నకు సమాధానం ఇవ్వండి.**

జ: 'ఆడపిల్ల కంటే మగపిల్లవాడు పుట్టాలని కోరుకునే వారు ఎక్కువ అవుతున్నారు. ఫలితంగా 'లింగ వివక్ష' భారతదేశంలో ఇప్పట్లో పోయే సూచనలు కనిపించడం లేదు. మగపిల్లలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు దాంతో మగపిల్లల్లో కంటే ఆడపిల్లల్లో మరణాల శాతం ఎక్కువగా ఉంది. అనేక కుటుంబాలు ఆడపిల్లలను భారంగా భావిస్తాయి. మహిళల పట్ల ఈ వివక్షను తగ్గించడానికి బలమైన శక్తిగా మహిళల చదువు ఉపయోగపడుతుంది".



కె.తులసిలక్ష్మి
సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు

ప్రశ్న: లింగ నిష్పత్తిలోని తేడాల కారణంగా సమాజంపై పడే ప్రభావాలను పేర్కొనండి?

జ: 1) ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుంది
2) మగ పిల్లలందరికీ వివాహాలు జరిగే అవకాశాలు భవిష్యత్తులో తగ్గుతాయి.
3) కుటుంబ వ్యవస్థ దెబ్బతింటుంది
4) లింగ వివక్ష సమాజంలో పెరుగుతోంది
5) సమాజంలో నేర స్వభావం పెరిగిపోతుంది.


4 మార్కుల ప్రశ్నలు

1. **భారతదేశ జనగణన గూర్చి వివరింపుము?**

జ: భారత దేశంలోని జనాభాకి సంబంధించిన సమాచారాన్ని 'సెన్సస్ ఆఫ్ ఇండియా' అందిస్తుంది. జనాభా అంతటికి సంబంధించిన సమాచారాన్ని పద్ధతి ప్రకారం సేకరించి, నమోదు చేయడాన్నే జనగణన అంటారు. పదేళ్లకు ఒకసారి భారతదేశంలోని ప్రజల సమాచారాన్ని సేకరిస్తారు. ఈ పని చేసే వాళ్లు ప్రతి ఊరు, పట్టణం, నగరంలోని ప్రతి ఇంటికి వెళ్లి అందులో ఉంటున్న వాళ్ల వివరాలు సేకరిస్తారు. ప్రజల వయసు, వృత్తి, ఇంటిరకం, చదువు, మతం వంటి అనేక వివరాలను జనగణన అందిస్తుంది. 'సెన్సస్ ఆఫ్ ఇండియా' అనే కేంద్ర ప్రభుత్వం సంస్థ ఈ సమాచార సేకరణ, నమోదులను నిర్వహిస్తుంది.

భారతదేశంలో జనగణన: భారతదేశంలో మొదటి జనగణన 1872లో జరిగింది. అయితే మొదటి సంపూర్ణ జనగణన 1881లో జరిగింది. అప్పటి నుంచి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి క్రమం తప్పకుండా జనగణనను చేపడుతున్నారు. 2011లో భారతదేశ జనాభా 1, 21, 01,93,422. ఈ 121 కోట్ల జనాభాలో 62,37,24,248 మంది పురుషులు, 58,64,69,174 మంది స్త్రీలు ఉన్నారు.

2. **కింది గ్రాఫ్ ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.**



ప్రశ్నలు

1) లింగ నిష్పత్తిలో 1951 నుంచి నీవు ఎలాంటి మార్పులు గమనించావు?
2) ఏ సంవత్సరంలో స్త్రీల సంఖ్య తక్కువగా ఉంది?
3) స్త్రీల సంఖ్య తగ్గడాన్ని నివారించడానికి ఏమి చేయాలి?
4) స్త్రీ, పురుష నిష్పత్తి అంటే ఏమిటి?

జవాబులు:

1) 1951 నుంచి 1971 వరకు స్త్రీ, పురుష నిష్పత్తి తగ్గుతూ వచ్చి, 1991 నుంచి క్రమేపీ పెరుగుతూ వచ్చింది.
2) 1991 సంవత్సరంలో స్త్రీల సంఖ్య తక్కువగా ఉంది.
3) ప్రకృతిలో స్త్రీ, పురుషులు సమానమే అనే భావనను ప్రచారం చేయాలి
4) జనాభాలో ప్రతి 1000 మంది పురుషులకు ఎంతమంది స్త్రీలు ఉన్నారో తెలియజేసే నిష్పత్తి స్త్రీ పురుష నిష్పత్తి.

సర్వేపల్లి



ఒకే ఈతలో రెండు ఆవు దూడల జననం

పొదలకూరు, జనవరి 3: ప్రభగిరిపట్నం అభయాంజనేయ స్వామి ఆలయానికి చెందిన గోశాలలో ఓ ఆవు ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. ఇక్కడి గోశాలలో దాతల ఇచ్చిన ఆవులు సుమారు 40వరకు ఉండగా అందులో సీతమ్మ పేరు గల ఆవు రెండు పెయ్యి దూడలను ఈనింది. రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని ఆలయ పర్యవేక్షకుడు శివకుమార్ తెలిపారు.

సంక్షిప్తం

5న మంత్రి సోమిరెడ్డి రాక

మనుబోలు,జనవరి 3: ఈనెల 5వ తేదీన మండలంలోని వీరంపల్లి,పిడూరు పాళెం గ్రామాల్లో జన్మభూమి-మాఊరు గ్రామసభలు జరగనున్నాయి. ఈగ్రామసభలకు రాష్ట్ర వ్యవసాయమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రానున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు ముగ్గుల పోటీలు

పొదలకూరు, జనవరి 3: పట్టణంలోని సాయిబాబా మందిరం ఆవరణంలో స్థానిక షిరిడీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో నెల్లూరు చిన్మయ మిషన్ మహిళలకు గురువారం ఉదయం 10గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముగ్గులకు కావాల్సిన ముగ్గుపిండి, రంగులు నిర్వాహకులే అందజేస్తారని పేర్కొన్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని, ఆసక్తి గల మహిళలు ఈ పోటీలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఆత్మీయ సదస్సుకు తరలిరండి



సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యుత్ సిబ్బంది

మనుబోలు, జనవరి3: నెల్లూరులోని టౌన్‌హాలులో నేడు జరగనున్న జిల్లా విద్యుత్ ఒప్పంద కార్మికుల ఆత్మీయసదస్సుకు జిల్లాలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో పనిచేసే ఒప్పంద కార్మికులంతా తరలిరావాలని యూఈసీడబ్ల్యూయూ సంఘం గూడూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి కే. వెంకటేష్ అన్నారు. మండలంలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులందరికీ సదస్సుకు రావాలని బుధవారం పిలుపునిచ్చారు. కాగితాలపూరు వద్ద నున్న సబ్‌స్టేషన్‌లో ఒప్పంద కార్మికులంతా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ ఒప్పంద కార్మికుల సమస్యలను భారీగా ర్యాలీలు, ధర్నాలు, సమరభేరిలు ఏర్పాటు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అందుకనే విద్యుత్‌రంగంలో ఉన్న అన్ని సంఘాల ఐక్యవేదిక కోసమే ఆత్మీయసదస్సు ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో 400కేవిఏ నాయకులు ఎన్, సుకుమార్, జి. శ్రీనువాసులు, ఆర్. ప్రభు, సర్దార్ బాషా పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే చంద్రన్న లక్ష్యం



తోటపల్లిగూడూరు: సభలో మాట్లాడుతున్న బొమ్మి సురేంద్ర



పొదలకూరు: మహిళలకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్న మండల అధికారులు

తోటపల్లిగూడూరు, జనవరి 3 : రాష్ట్రంలోని పేద ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఆ లక్ష్యంతో పరిపాలన సాగిస్తున్నాడని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొమ్మి సురేంద్ర తెలిపారు. బుధవారం మండలంలోని పాపిరెడ్డిపాళెం, వరకవి పూడి గ్రామాలలో జరిగిన జన్మభూమి, మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు, పింఛన్లు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారంతో వేల కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, తారు రోడ్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమలత, తహసీల్దార్ పుల్లయ్య, పీఆర్, ఆర్‌డబ్ల్యూస్, హౌసింగ్, వ్యవసాయ శాఖాధికారులు శ్రీనివాసులు, నజీర్‌బాషా, వెంకటేశ్వర్లు, జ్యోత్స్న, సర్పంచ్‌లు మాధవయ్య, వెంకటేశ్వర్లు, తెలుగుదేశం నాయకులు దువ్వూరు వెంకటకృష్ణారెడ్డి, రఘుబాబు, పరుచూరి హరి, మేనాటి శీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు: మండలంలోని కొమ్మలపూడి, వడ్లపూడి గ్రామాల్లో బుధవారం అధికారులు జన్మభూమి-మాఊరు గ్రామసభలను నిర్వహించారు. కొమ్మలపూడిలో ఎంపీడీవో శ్రీనువాసులు రెడ్డి పర్యవేక్షణలో, వడ్లపూడిలో తహసీల్దార్ బి. లీలారాణి పర్యవేక్షణలో మండల స్థాయి అధికారులు జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. కొమ్మలపూడి జన్మభూమి కార్యక్రమాన్ని సర్వేపల్లి నియోజకవర్గ జన్మభూమి ప్రత్యేకాధికారి ఎస్‌కే. నయామ్‌ఉల్లా ఆకస్మికంగా తనిఖీ చేశారు. వడ్లపూడిలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వడ్లపూడి సర్పంచు ధనెంకుల కృష్ణశ్రీ, కొమ్మలపూడి సర్పంచు రాపూరు శేషయ్య, టీడీపీ నాయకులు మన్నెమాల శేషారెడ్డి, ధనెంకుల రఘురామనాయుడు, ఆర్‌ఐలు కల్యాణ్, సుబాషిణీ, విఆర్‌వోలు గుణశేఖర్, శ్రీనువాసులు నాయుడు పాల్గొన్నారు.

పొదలకూరు: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈవోపీఆర్డీ నారాయణరెడ్డి సూచించారు. మండలంలోని పార్లపల్లిలో బుధవారం జరిగిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో బాగంగా ప్రతి కుటుంబానికి నెలకు 10వేలు సమకూర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అనంతరం ఆరోగ్యంపై వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామస్థులతో చర్చించారు. లబ్దిదారులకు నూతన రేషన్‌కార్డులు, చంద్రన్న సంక్రాంతి కానుకలు అందజేశారు. పొదుపు మహిళలకు వడ్డీలూని రుణాలను అందించారు. అనంతరం ముగ్గులపోటీలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు బొడ్డు లక్ష్మమ్మ, తెలుగుగంగ సెక్షన్ ఆఫీసర్ వై మస్తాన్‌రావు, ఉపాధిహామీ ఏపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు కాగా మండలంలోని ఇనుకుర్తిలో తహసీల్దార్ అన్నదాత నిర్మలానంద బాబాఉ, బిరదవోలులో ఎంపీడీవో కే నాగేంద్ర బాబు, ప్రభగిరిపట్నంలో డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కిషోర్ ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెంకటాచలం : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సోమ్లా నాయక్ అన్నారు. కందలపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు గ్రామ సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. బుధవారం ఎంపీడీవో మధుసూదన్ రావు ఆధ్వర్యంలో ఎగువమిట్టలో జరిగిన గ్రామ సభ, పంచాయతీ విస్తరణాధికారి ఆధ్వర్యంలో కాకరవారిపాళెం గ్రామంలో జరిగిన గ్రామ సభలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా కసుమూరు పీహెచ్‌సీ వైద్య బృందం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

అన్నితరాలకు ఆదర్శం సావిత్రిబాయి పూలే

వెంకటాచలం,జనవరి 3: సావిత్రిబాయి పూలే అన్నితరాలకు ఆదర్శంగా ఉంటారని సర్వేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జ్ఞానరత్నం పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే 185 వ జయంతిని పాఠశాలలో నిర్వహించారు. సావిత్రిబాయి పూలే మహిళా సమాజాన్ని ఉద్ధరించిన మహనీయురాలని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు శైలజ, సరళ,విజయలక్ష్మి,అర్చన,వసుంధర తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు: బాలికా విద్యకు కృషి చేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే చిరస్మరణీయురాలని విద్యా పర్యవేక్షణాధికారి హమీద్ పేర్కొన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహం చేసుకున్నా పట్టుదలతో ఉన్నత విద్య అభ్యసించిన ధీరవనితగా కొనియాడారు.



వెంకటాచలం: మాట్లాడుతున్న హెచ్‌ఎం జ్ఞానరత్నం

బాలికా విద్య కోసం పోరాటం చేసి విద్యాభివృద్ధికి పాటుపడిన ఆమెను స్మరించుకోవడంతో పాటు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని పిలుపునిచ్చారు. మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చెంచురామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వెంకటాచలం హైవేపై సైకిల్ ర్యాలీ

వెంకటాచలం,జనవరి 3: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని నెల్లూరు నగర డీఎస్పీ రెడ్డి నాయక్ అన్నారు. జాతీయ రక్షకదళం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ ర్యాలీ బుధవారం వెంకటాచలం చేరగా స్వాగతం పలికిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ర్యాలీకి వెంకటాచలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, వెంకటాచలం ఎస్‌ఐ నాగరాజు, ఎస్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, ఎస్‌ఐలు సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోసమే జన్మభూమి

తోటపల్లిగూడూరు, జనవరి 3 : రాబోయే ఎన్నికల్లో ప్రజలను జిమ్మిక్కులు చేసేందు కోసం జన్మభూమి - మా ఊరు కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం రాత్రి మండలంలోని తోటపల్లి గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండానే ప్రజలను ప్రలోభపరిచే విధంగా జన్మభూమి, ప్రత్యేక అర్జీల దినం వంటి కార్యక్రమాలతో మభ్య పెడుతున్నారన్నారు. ఈ సందర్భంగా తోటపల్లి గ్రామంలో రాత్రి బస చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య, జడ్పీటీసీ మన్నెం చిరంజీవి, వైసీపీ నాయకులు ఇసనాక రమేష్‌రెడ్డి, చెరుకూరు శీనయ్య, తలమంచి సురేంద్ర, గండవరపు శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రిగ్ విజేతలకు అభినందనలు

పొదలకూరు, జనవరి 3: 2017-18కు సంబంధించి వెంకటాచలం మండలం కనుపూరులో జరిగిన 96వ గ్రిగ్ మెమోరిల్ టోర్నమెంట్‌లో విజేతలైన పొదలకూరు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులను ఆ పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. పొదలకూరు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు కబడ్డీ, టెన్నికాయట్‌లో విజేతలు నిలిచినట్లు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ సులోచన తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని జాయిస్‌జూలియా, ఉపాధ్యాయులు ఏ.వీ సుధాకర్, అనీల్, రఘురాం తదితరులు ఉన్నారు. అలాగే మండలంలోని మహమ్మదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు విభాగాల్లో విజేతలుగా నిలిచినట్లు హెచ్‌ఎం ఎం ఆదిశేషారెడ్డి తెలిపారు.



విజేతలైన మహ్మదాపురం విద్యార్థులతో ఉపాధ్యాయులు

వెంకటగిరి

వెంకటగిరి - రాపూరు - బాలాయపల్లి - డక్కిలి - సైదాపురం - కలువాయి



సావిత్రిబాయి పూలేకు నివాళి

రాపూరు, జనవరి 3: రాపూరులోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇక్కడ పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు ప్రదీప్ కుమార్, రేణుక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎమ్మార్పీఎస్ నిరసన

వెంకటగిరి, జనవరి 3: మంద కృష్ణ మాదిగ అరెస్టుకు నిరసనగా ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాల సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి పల్లిపాటి రవి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం నిరాహారదీక్ష చేస్తున్న మంద కృష్ణమాదిగను అరెస్టు చేయడం దారుణమన్నారు. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లిపాటి వెంకటేష్, కల్యాణ్, మణి, సుధాకర్, ఈశ్వర్, పరశురామ్, వరప్రసాద్, శ్రీనివాసులు, అనీల్, వినయ్, గౌతమ్, రాజేష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

51 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

రాపూరు: జనవరి 3: కరుణామయి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 51మంది యువకులు రక్తదానం చేశారు. వైద్యశిబిరానికి సుమారు వెయ్యి మంది రోగులు పరీక్షలు చేయించుకున్నారు. గురువారం దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. యూఎస్ వైద్యులు మాణిక్యం, అనిల్, నారాయణ వైద్యబృందం ప్రవీణ్, చందన, అనూహ్య, గంగాధర్, ప్రసన్న, కృష్ణకుమార్, జోషిత్, మానస, స్థానిక వైద్యులు రాజేష్, మురళీ, మేనక తదితరులు సేవలందించారు. ట్రస్టీలు రేవతమ్మ, విజయ సౌమ్య, విజయ భరత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రిగ్‌లో రాపూరు విద్యార్థుల సత్తా!



విజేతలతో ఉపాధ్యాయులు

రాపూరు, జనవరి 3: వెంకటగిరిలో జరిగిన గ్రిగ్స్ పోటీల్లో రాపూరు సేవాభారత్ ట్రస్టు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, స్థానిక గుడ్ షెపర్డు ఇంగ్లీషుమీడియం పాఠశాల విద్యార్థులు సత్తాచాటి పలు విభాగాల్లో పతకాలు సాధించినట్లు తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాల్లో విజేత విద్యార్థులను అభినందించారు. హెచ్ఎం రేణుక, కరస్పాండెంట్ రాజారత్నం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల



డక్కిలి: మాట్లాడుతున్న రామచంద్రయ్య నాయుడు



బాలాయపల్లి: వినతి పత్రం ఇస్తున్న అలిమిలి గ్రామస్థులు

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

వెంకటగిరి(టౌన్): జనవరి 3: టీడీపీ ప్రభుత్వం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని జీకేపల్లి, కె. ఉప్పరపల్లిలో బుధవారం జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓర్వలేని కొంత మంది బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం ప్రజా సమస్యలు తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ దట్టం గురునాథం, సంజీవరెడ్డి, తోట రామచంద్రయ్య, సాయి మోహన్‌నాయుడు, హౌసింగ్‌పీడీ రామచంద్రారెడ్డి, ఎంపీపీ మునెమ్మ పాల్గొన్నారు.

వెంకటగిరి, జనవరి 3: పేదరికం నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ దొంతు శారద తెలిపారు. బుధవారం పట్టణ పరిధిలోని 4,5,6 వార్డుల్లో నిర్వహించిన జన్మభూమి సభల్లో ఆయా వార్డు కౌన్సిలర్లు గుర్రం మణి, మల్లారం లక్ష్మి, శ్రీరామదాసు లక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ప్రజలకు ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమపథకాలు ప్రవేశ పెడుతోందన్నారు. ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నట్లు వివరించారు. రేషన్ కార్డులు, చంద్రన్న బీమా పత్రాలు పంపిణీ చేశారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బీరం రాజేశ్వరరావు, కౌన్సిలర్లు మంచి బాబు, కావేరిపాకం రమేష్, చెంగారావు, నాయకులు శ్రీరామదాసు గంగాధర్, మంకు ఆనంద్, నారాయణ, నారి శేఖర్ తదితరులు ఉన్నారు.

డక్కిలి, జనవరి 3: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకి రాగానే చంద్రబాబు రైతులకు రుణమాఫీ ప్రకటించారని జడ్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు అన్నారు. బుధవారం పలుగోడులో సర్పంచు ఆదిరెడ్డి అమరావతి అధ్యక్షతన జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. లింగసముద్రంలో సర్పంచు వేముల నాగభూషణం నాయుడు, దేవులపల్లిలో సర్పంచు మాదమాల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జన్మభూమి గ్రామ సభలు ప్రశాంతంగా జరిగాయి. టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, ఆదిరెడ్డి మల్లికార్జునరెడ్డి, అధికార ప్రతినిధి ఆరికట్ల శ్రీరాములు, హరినాథ్, నెలబల్లి రమణారెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ మునీర్ బాషా, డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ, ఏవో సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు నాగరాజ, రవి తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి, జనవరి 3: తెలుగు గంగ కాలువను తొలగించకుంటే చెరువు కట్టకు ప్రమాదం ఏర్పడుతుందని అలిమిలి గ్రామస్తులు జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావును కోరారు. అలిమిలిలో ఎంపీడీవో, మన్నూరులో తహసీల్దార్ శ్రీనివాసరావు, పల్లిపాడులో డీటీ అబ్దుల్ ఖాన్ ఆధ్వర్యంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రజలు అవగాహనతో ఆయా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నా రు. అలిమిలిలో ఎంపీడీవో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం సామూహిక సీమంతాలు నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, జయప్రద, రత్నయ్య, కళ్యాణ్ రెడ్డి, బాబురెడ్డి, కోటేశ్వరరావు, విజయ్ నాయుడు, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

సైదాపురం, జనవరి 3: మండల పరిధిలోని పోతేగుంట, కోమటిగుంటరాజుపాళెం, కలిచేడు, పొక్కందల గ్రామాల్లో బుధవారం జన్మభూమి-మాఊరు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిగుంట రాజుపాళెం చెరువుకు తెలుగు గంగ నీరందించాలని జిల్లా టీడీపీ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు కొండూరు సుబ్రమణ్యంరాజు రైతులతో కలిసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. గ్రామ సభల్లో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మండల టీడీపీ అధ్యక్షుడు గుంటమడుగు కృష్ణంరాజు తెలిపారు. ఎంపీడీవో స్వరూపారాణి, తహసీల్దార్ మునిలక్ష్మి, మండల అధికారులు, సిబ్బంది, పెంచలకోన ట్రస్టుబోర్డు సభ్యుడు వర్షబండి హరనాథ్‌రెడ్డి, మండల జన్మభూమి కమిటీ నాయకుడు నల్లమార వెంకటేశ్వర్లురెడ్డి, మండల టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు మోటపోతు హరనాథరెడ్డి పాల్గొన్నారు.

రాపూరు, జనవరి 3: చెల్లటూరు రోడ్డు ఏర్పాటుకు రూ. కోటి మంజూరైందని టీడీపీ జిల్లా కార్యదర్శి నువ్వుల శివరామకృష్ణ ప్రకటించాడు. మండలంలోని చెల్లటూరు, చెర్లోపల్లి గ్రామాల్లో బుధవారం జన్మభూమి-మాఊరు గ్రామ సభలో ఆయన మాట్లాడారు. పేదలకు చంద్రన్న సంక్రాంతి కానుక, కొత్త రేషన్‌కార్డులు, భీమా బాండ్స్, పేద ప్రజలకు అందజేశారు. గర్భిణిలకు శ్రీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన చేశారు. పచ్చిగళ్ల రత్నం, నోటు మస్తాన్‌రెడ్డి, దువ్వూరు శ్రీధర్‌రెడ్డి, ప్రత్యేకాధికారి గోపీచంద్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దారు అనూరాధ, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



రాపూరు: సంక్రాంతి కానుక అందజేస్తున్న శివరామకృష్ణ



సైదాపురం: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, నాయకులు

దమ్ముంటే టికెట్టు తెచ్చుకో..

ఎమ్మెల్యే కురుగొండ్లకు బొమ్మిరెడ్డి సవాల్

వెంకటగిరి(టౌన్): జనవరి 3: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం టికెట్టు తెచ్చుకుంటే వైసీపీ తరపున వెంకటగిరిలో తాను పోటీ చేస్తానని జడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి సవాల్ విసిరారు. బుధవారం స్థానిక తెలుగుగంగ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అవినీతిని చూపిస్తే రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఓబులాపురం కృష్ణపట్నం పోర్టుకు రైల్వే పనులు జరుగుతుంటే కాంట్రాక్టు బెదిరించడం అన్ని న్యూస్ ఛానల్లో, జిల్లాల్లో కోడై కూసిందని దానిని గుర్తు చేశారు. ఇలా చూసుకుంటూ పోతే వంద సార్లు రాజీనామా చేయాల్సి ఉంటుందని గుర్తుంచుకోవాలని వివరించారు. 7శాతం దండకాలు మొదలు పెట్టిన మనత నీకు మాత్రమే దక్కుతుందని ఆరోపించారు. జడ్పీవైస్ చైర్మన్ పొట్టేళ్ళ శిరీష మాట్లాడుతూ గత ఎన్నికల్లో 83 వేలు టీడీపీకి వస్తే 79వేలు వైసీపీ వచ్చాయన్నారు. జడ్పీ నిధులు సమానంగా ఇవ్వాలని అడిగారు. అయితే రాష్ట్ర నిధులు కూడా సమానంగా పంచాలని తెలియదా అని విమర్శించారు. 2019లో ఎన్నికల్లో వైసీపీ అధిక మెజార్టీతో గెలుస్తుందన్నారు. పట్టణ కన్వీనర్ గుమ్మళ్ళపు డిల్లీబాబు, నక్కా వెంకటేశ్వర్లు, గిరి రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, నెమ్మళ్ళపు సురేష్ రెడ్డి, అనిల్ రెడ్డి, శకుంతల, భాస్కర్ రెడ్డి, రాజా రెడ్డి, కౌన్సిలర్ కళ్యాణి, రాజామణి, యస్దానీ బాషా, మురళి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి

విద్యార్థుల శ్రమదానం

రాపూరు,జనవరి 3: రాపూరు సీవీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో భాగంగా బుధవారం కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ప్రిన్సిపల్ సుచరిత, ప్రోగ్రాం అధికారి సుధాకర్ పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సాయికృష్ణ యాచేంద్ర

వెంకటగిరి, జనవరి 3: పట్టణంలోని ఆర్వీఎం ఉన్నత పాఠశాల, బంగారుపేట ఆర్వీఎం ఉన్నత పాఠశాలల్లో 120 మంది 10వ తరగతి విద్యార్థులకు బుధవారం జీఎన్ఆర్ సర్వీస్ ట్రస్ట్ నిర్వాహకులు అందించిన యూటీఎఫ్ మోడల్ పేపర్లను పాఠశాలల కరస్పాండెంట్ సాయికృష్ణ యాచేంద్ర చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహించడం అభినందించ దగ్గ విషయమన్నారు. దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుని 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.ట్రస్టు సభ్యులు డాక్టర్ రవీంద్రబాబు, సుబ్రమణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాఘవయ్య, మీనయ్య, యూటీఎఫ్ ప్రతినిధులు ఉదయకుమార్, కుమారస్వామి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 7, 4



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిట్‌ఫండ్‌లు, డిపాజిట్లపై ప్రతిఫలం అందుకుంటారు. ప్రముఖులతో వేడుకల్లో పాల్గొంటారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. ఆర్థిక విషయాల్లో సంకల్పం నెరవేరుతుంది.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): మార్పు కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. బదిలీల విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించి లక్ష్యం సాధిస్తారు. బంధుమిత్రుల కలయికతో ఇంట్లో సందడిగా ఉంటుంది. ఇంటికి అవసరమైన వస్తువుల రవాణాకు అనుకూలం.



మిథునరాశి: (మే21-జూన్21): చెక్కులు, విలువైన డాక్యుమెంట్లు అందుకుంటారు. స్టేషనరీ, రవాణా, బోధన, ఏజెన్సీ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. సోదరీ సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ప్రియతముల కోసం విలువైన వస్తువుల కొనుగోలు చేస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. భాగస్వామ్యాలు లాభిస్తాయి. స్నేహ పరిచయాల ఆధారంగా ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. కొత్త ప్రాజెక్టుల ప్రారంభానికి అనుకూల సమయం. విందు, వినోదాలతో ఉల్లాసంగా గడుపుతారు. ఉద్యోగ సంస్థలు, పరిశ్రమలు, వైద్య రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): దూరంలో ఉన్న ప్రియతములు ఇల్లు చేరతారు. ప్రయాణాలు, చర్చలు, వేడుకలు ఉల్లాసం కలిగిస్తాయి. సినీ, రాజకీయ, న్యాయ రంగాల వారికి ఆర్థికంగా అనుకూలిస్తుంది. ప్రియతములకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. బంధు, మిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. ప్రదర్శనలు, సభలకు అనుకూలం. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల వైఖరి గురించి ఆలోచిస్తారు.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఉద్యోగ, వ్యాపారాలకు సంబంధించిన శుభవార్త అందుకుంటారు. సోదరీ సోదరుల విషయాల్లో శుభ పరిణామాలు సంభవం. పెద్దలతో సమావేశాలు ఉల్లాసం కలిగిస్తాయి. వృత్తి, ఉద్యోగాలకు సంబంధించిన కీలక సమాచారం లభిస్తుంది.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ప్రయణాలకు అవసరమైన నిధులు సమకూర్చుకుంటారు. సంకల్పం ఫలిస్తుంది. వేడుకల్లో పాల్గొంటారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. పెట్టుబడులకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): బీమా వ్యవహారాలకు అనుకూలం. ఆర్థిక వ్యవహారాలపై స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. ఆత్మావలోకనం చేసుకునేందుకు తగిన సమయం. పూర్వమిత్రులను కలుసుకుంటారు. మ్యూచ్యువల్ ఫండ్స్, బ్యాంకు లావాదేవీలు లాభిస్తాయి.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): సినీ, రాజకీయ రంగాల వారికి కొత్త పరిచయాలు లాభిస్తాయి. భాగస్వామి గురించి ఆలోచిస్తారు. లక్ష్య సాధనకు పరిచయాలు తోడ్పడతాయి. సమావేశాలు, బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. దూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులతో అనుబంధం ఏర్పడుతుంది.



మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వైద్యం, హోటల్, రిటైల్ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. ఆహార నియమాలు పాటిస్తారు. బంధుమిత్రులతో విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆస్పత్రులు సందర్శిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

కొత్త రైతుబజార్లకు స్థలమేది!?

- స్పందించని రెవెన్యూ, మున్సిపల్ శాఖలు
- స్థల సేకరణలోనే నిలిచిన ప్రక్రియ
- కలెక్టర్ ఆదేశించినా కదలని ఫైలు

నెల్లూరు (వ్యవసాయం) జనవరి 3 : జిల్లాలో కొత్త రైతు బజార్ల ఏర్పాటులో పలు శాఖల మధ్య సమన్వయ లోపించిం ది. బజారుల నిర్మాణాలకు నిధులు ఇచ్చేందుకు మార్కెటింగ్ శాఖ సిద్ధంగా ఉన్నా స్థలాలను కేటాయించేం దుకు అటు రెవెన్యూ, ఇటు మున్సిపల్ శాఖలకు ముందుకు రావడం లేదు. కలెక్టర్ ముత్యాలరాజుఆదేశాల ను సైతం ఆయా శాఖలు తుంగలో తొక్కడం గమనార్హం. నెల్లూరు నగరంలో కూరగాయాల క్రయ, విక్రయాలు ప్రధాన కేంద్రం ఏసీ మార్కెట్. నిత్యం 100 - 120 టన్నుల కూరగాయలు అమ్ముడవుతుంటాయి. చిత్తూరు, ప్రకాశం, గుంటూరు, కర్నూల్ జిల్లాల నుంచి పలు రకాల కూరగాయలు నిత్యం మార్కెట్‌కు దిగుమతి అవుతుంటాయి. జిల్లాలోని మెట్ట ప్రాంతాలలో సాగయ్యే కూరగాయలూ ఇక్కడికే వస్తుంటాయి. ఇక్కడ నుంచి జిల్లాలోని పలు ప్రాంతాలకు కూరగాయలు సరఫరా అవుతాయి. మార్కెట్‌లో ధరల నియంత్రణ, తూకాలు సరిగా ఉండని, కూరగాయలు నాణ్యంగా ఉండవని వినియోగదారుల ఆవేదన. ఈ నేపథ్యంలో ఏసీ మార్కెట్‌కు దూరాన ఉన్న ప్రాంతాల వారికి రైతు సేవలను దగ్గర చేసేందుకు మార్కెటింగ్ శాఖ దృష్టి సారించింది. నెల్లూరు కేంద్రంగా కూరగాయలు అమ్ముకునే రైతులకు గిట్టుబాట ధర కల్పించడంతో పాటు వినియోగదారులకు సరసమైన ధరలకు కూరగాయలను అందచేసేందుకు రైతుబజార్లను ఏర్పాటు చేయాలని ఐదు ప్రాంతాలను ఎంపిక చేశారు. మినీబైపాస్‌లో రెండు, ట్రంకురోడ్డు, పొదలకూరురోడ్డు ప్రాంతాలలో మూడు రైతు బజార్ల ఏర్పాటుకు ఆ శాఖ అధికారులు కలెక్టర్ దృష్టికి అంచనాలను తీసుకెళ్లారు.

● కలెక్టర్ ఉత్తర్వులనూ పట్టించుకోలేదు

నెల్లూరు నగరంలో రైతు బజార్లకు స్థలాలు చూపాలని కలెక్టర్ ముత్యాలరాజు ఇటు మున్సిపల్, అటు రెవెన్యూ శాఖలకు ఉత్తర్వులు జారీ నెలలు గడుస్తున్నా ఆ రెండు శాఖలు ఇప్పటి వరకూ స్పందించలేదు. రెవెన్యూ శాఖ పూర్తిగా చేతులెత్తేసింది. మున్సిపల్ శాఖ కౌన్సిల్ తీర్మానం చేయాలని అంటోంది. అటు గూడూరులోనూ ఇదే దుస్థితి నెలకొంది. కావలిలో అదనంగా మరో రైతుబజారు మంజూరైనా ఏర్పాటుకు స్థల సేకరణ సమస్యగా మారింది.

● రైతు బజారుకు పోలీసు అడ్డంకి

నెల్లూరు పొదలకూరు రోడ్డు ఎస్పీ బంగ్లా వద్ద మార్కెటింగ్ శాఖ గతంలోనే ఒక రైతు బజారు నిర్మించింది. దాని ప్రారంభానికి అప్పటి ఎస్పీ విశాల్‌గున్నీ అభ్యంతరం చెప్పారు. అప్పటి నుంచి ఈ రైతుబజారు ప్రారంభానికి నోచుకోలేదు. తమ బంగ్లాలో శాంతిభద్రతల విఘాతం కలుగుతుందని నోటీసివ్వడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు అప్పట్లో వెనకడుగు వేశారు. దానిని తిరిగి ప్రారంభలోకి తీసుకురావాలని తాజాగా కసరత్తు చేస్తున్నారు.

కలెక్టర్‌కు నివేదించాం

ప్రస్తుత పరిస్థితులన్నీ కలెక్టర్ ముత్యాలరాజు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన చొరవ తీసుకుంటున్నారు. అన్ని శాఖలనూ సమన్వయం చేసుకుని తలెత్తిన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తున్నారు. త్వరలో నూతన బజార్ల ఏర్పాటు ఓ కొలిక్కి వస్తుంది. ఎస్పీ బంగ్లా ఎదుట స్థల సేకరణతో పాటు రైతు బజారు ఏర్పాటైనా పోలీసు అధికారులు అడ్డంకిగా మారారు.

- ఉపేంద్రకుమార్, మార్కెటింగ్ శాఖ ఏడీ

11న రాయితీ రుణాల

గ్రౌండింగ్ మేళా

నెల్లూరు (వేదాయపాళెం) జనవరి 3 : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్ల ద్వారా అందించే రాయితీ రుణాలకు సంబందించి ఈనెల 11వ తేదీన గ్రౌండింగ్ మేళా ని ర్వహించనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2016-17, 2017-18 ఆర్థిక సంవత్సరాలకు సంబందించి ఇప్పటికీ రుణాలు గ్రౌండిం గ్ కాని లబ్ధిదారులు గురువారం నుంచి ఆయా బ్యాంకుల వద్ద డాక్యుమెంటేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సంచార జాతుల రుణాలకు ఎంపికలు

సంచార జాతుల కార్పొరేషన్ ద్వారా అందించే రాయితీ రుణాలకు సంబంధించి ఈనెల 11వ తేదీన జిల్లా వ్యాప్తంగా ఎంపికలు నిర్వహించనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు మొత్తం 630 యూనిట్లు లక్ష్యంగా ఉందని, ఇందుకు ఇప్పటి వరకు 2041 ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి 90 శాతం రాయితీతో కూడిన రూ. 30వేల ఆర్థిక సాయం అందిస్తారన్నారు. ఈ ఎంపికలు జీవో 111 ప్రకారం సెలక్షన్ కమిటీల ద్వారానే జరుగుతాయని, లబ్ధిదారులు ఎంపికకు హాజరు కావాలని ఆయన కోరారు.

మా ధర మాదే!

- జిల్లాలో యథేచ్ఛగా ఎమ్మార్పీ ఉల్లంఘనలు
- అమలుకాని మంత్రి ప్రత్తిపాటి ఆదేశాలు
- థియేటర్లు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలో దందా
- వినియోగదారుడు ప్రశ్నిస్తే ఛీత్కరింపులు

నెల్లూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఒక లీటరు నీళ్ల బాటిల్ ఎమ్మార్పీ రూ.20. ఈ ధరకే బయట అన్ని ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. కానీ థియేటర్లలో మాత్రం ఈ ధర కనిపించడం లేదు. కొన్ని థియేటర్లలో రూ.40 వరకు వసూలు చేస్తున్నారు. అలానే రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో పగటి పూట రూ.25కు, రాత్రి వేళ రూ.30కు అమ్ముతున్న పరిస్థితులు ఉన్నాయి. ఒక్క తాగే నీళ్లలోనే ఈ రకంగా దోపిడీ జరుగుతుంటే ఇక మిగిలిన తినుబండారాల విషయంలో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. బయట రూ.18కు అమ్మే కూల్‌డ్రింక్‌ను సినిమా హాళ్లలో రూ.35కు అమ్ముతున్నారు. ఇది అది అన్న తేడా లేకుండా అన్ని వస్తువులపై ఎమ్మార్పీ ఉల్లంఘన జరుగుతోంది. ప్యాకేజ్డ్ వస్తువులపై ఎమ్మార్పీ ఉల్లంఘన ఒక ఎత్తయితే అసలు ఎమ్మార్పీ లేని తినుబండారాలపై దోపిడీ మరో రకంగా ఉంది. పుచ్చకాయ రసం, నాన్ ప్యాకేజ్డ్ కూల్‌డ్రింక్స్, పఫ్‌లు, పాప్‌కార్న్‌లు, స్వీట్‌కార్న్‌లు ఇలా అన్ని ఆయా యాజమాన్యాలు స్వయంగా తయారు చేసి ఇష్టం వచ్చిన ధరకు అమ్ముతున్నాయి. బయట రూ.15 అమ్మే పఫ్‌లను థియేటర్లలో రూ.40కు అమ్ముతున్నారు. ఇక రూ.20 విలువ కూడా చేయని పుచ్చకాయ రసాన్ని రూ.60కు విక్రయిస్తున్నారు. ఇక ఆ ప్యాక్‌లు, ఈ ప్యాక్‌లు అంటూ వినియోగదారులను నిలువునా దగా చేస్తున్నారు.

● ప్రశ్నించే హక్కు లేదు

స్వతంత్ర దేశంలో దేన్నైనా ప్రశ్నించే హక్కును రాజ్యాంగం ప్రజలకు కల్పించింది. అయితే మాల్స్, థియేటర్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు. ఇక్కడ చెప్పిందే ధర.. అవసరమైతే తీసుకో లేకుంటే పో... అంటూ అక్కడి నిర్వాహకులు సమాధానమిస్తున్నారు. వినియోగదారుల హక్కులకు భంగం కలిగేలా ఇక్కడ ప్రవర్తన ఉంటోంది. సాధారణంగా ప్రతి థియేటర్‌లో ఏ వస్తువు ఎమ్మార్పీ ఎంత అన్నది స్పష్టంగా తెలియజేస్తూ బోర్డు ఏర్పాటు చేయాలి. కానీ ఎక్కడా ఈ నిబంధన అమలు కావడం లేదు.

● జేసీ హెచ్చరించినా...

థియేటర్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లతోపాటు రద్దీ ప్రదేశాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘనలు అధికంగా జరుగుతున్నాయని కొన్నాళ్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో జాయింట్ కలెక్టర్ ఏఎండీ ఇంతియాజ్ ఇటీవల పలు థియేటర్లలో తనిఖీలు నిర్వహించారు. స్వయంగా ధరలను, అక్కడి వ్యవహారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన యజమానులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ప్రతీ వస్తువును ఎమ్మార్పీకి అమ్మాల్సిందేనని స్పష్టం చేశారు. ధరలు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రేక్షకులు బయట నుంచి తీసుకొచ్చే తినుబండారాలను అనుమతించాలని సూచించారు. అలానే ఉచిత తాగునీటిని అందరికీ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అయితే ఒక్క నీటిని అందుబాటులో ఉంచడం తప్పితే మిగిలిన ఏ ఆదేశాలను పట్టించుకోవడం లేదు. అధికారుల దాడులు అధికారులవే... మా దారులు మావే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు తాజాగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అధిక ధరలపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఇటీవల విజయవాడలోని వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1 నుంచి ఎమ్మార్పీ ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్యుయల్ ప్రైస్ విధానాన్ని రద్దు చేస్తున్నామని, ఇకపై ఒక వస్తువుకు అన్ని చోట్ల ఒకే ధర ఉంటుందని తెలిపారు. ఇలా ఎవరైనా అతిక్రమిస్తే వినియోగదారులు ప్రశ్నించాలని, తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అయితే ఈ ఆదేశాలు కూడా జిల్లాలో అమలుకావడం లేదు.

8న గిరిజన యువత శిక్షణకు ఎంపికలు

నెల్లూరు (వేదాయపాళెం) జనవరి 3 : ఐటీడీఏ, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థలు సంయుక్తగా జిల్లాలో నిరుద్యోగ గిరిజన యువతకు ఈనెల 8వ తేదీన ఎలక్ట్రీషియన్, ఫ్రంట్ ఆఫీస్, రిటైల్ ట్రైనీ అసోసియేట్‌లో ఉచిత శిక్షణ ఇస్తారని పీవో కమలకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.అభ్యర్థుల వయస్సు 18-30 మధ్య ఉండాలని, 10పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్..

బాయిలర్ రైతు ధర	89
లేయర్	54
స్కిన్ చికెన్	146
స్కిన్‌లెస్ చికెన్	172
లేయర్ మాంసం	92

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్..

బాయిలర్ లైవ్	96
లేయర్ లైవ్	60
స్కిన్ చికెన్	156
స్కిన్‌లెస్	182
లేయర్	102

జలాశయాల్లో నీటిమట్టాలు

సోమశిల

పూర్తి సామర్థ్యం:	78 టీఎంసీలు
ప్రస్తుత నీటినిల్వ:	37.840 టీఎంసీలు
ఇన్‌ఫ్లో :	411 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో :	3,200 క్యూసెక్కులు
ఆవిరి :	124 క్యూసెక్కులు

సంగం ఆనకట్ట

నీటిమట్టం	: 10.6 అడుగులు
కనిగిరి కాలువ	:1575 క్యూసెక్కులు
ఎడమ కాలువ	: 850 క్యూసెక్కులు
కనుపూరు కాలువ:	500 క్యూసెక్కులు
బీపీఆర్ కాలువ	: 780 క్యూసెక్కులు
నెల్లూరుచెరువుకాలువ :	30 క్యూసెక్కులు

బంగారం, వెండి ధరలు


22 క్యారెట్స్ బంగారం

గ్రాము ధర -	2,816
సవర (8 గ్రాములు) -	22,528
వెండి కిలో ధర -	41,800
వెండి గ్రాము ధర -	41.80

నిమ్మ ధరలు (బస్తా) గూడూరు

పచ్చివి: రూ.800 నుంచి రూ.1400 వరకు

పండ్లు: రూ.600 నుంచి రూ. 800 వరకు



రంగులు వేయండి

నోరు తిరుగుతోందా?

How can a clam cram in a clean cream can?

సామెత

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు

ఒకటికి మూడు


చిత్రంలో కనిపిస్తున్న దాన్ని తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఏమంటారంటే..!



పండగ సమయాల్లో వీధులు, పార్కులను కళ్లు మిరుమిట్లుగొలిపే లైట్లతో అలంకరించుకోవడం మనకు తెలుసు. కానీ ఫ్రెంచ్ రివెరాలో మాత్రం నిమ్మకాయలతో, నారింజ పండ్లతో పార్కులన్నీ అలంకరించి పండుగ చేసుకుంటారు. ఏటా అక్కడ జరిగే లెమన్ ఫెస్టివల్ కోసం ఇలా చేస్తుంటారు. ఈ ఫెస్టివల్‌ను చూడటానికి కొన్ని లక్షల మంది పర్యాటకులు అక్కడికి వెళ్తుంటారు.

కనువిందు చేసే లెమన్ ఫెస్టివల్





ఫ్రాన్స్‌లో జరిగే ముఖ్యమైన పండుగల్లో ఈ లెమన్ ఫెస్టివల్ ఒకటి. ఫార్ములా గ్రాండ్ 1 తరువాత ఫ్రెంచ్ రివెరాలో జరిగే రెండో అతి పెద్ద ఈవెంట్ ఈ లెమన్ ఫెస్టివల్. ప్రతి ఏటా ఫిబ్రవరిలో జరిగే ఈ వేడుకకు సుమారు 2 లక్షల 50 వేల మంది సందర్శకులు హాజరవుతారు. ఈ పండుగ ఈ మధ్య పుట్టిందేమీ కాదు. 1928 నుంచి ఈ ఫెస్టివల్‌ను జరుపుకుంటున్నారు. ఫిబ్రవరి 11 నుంచి మార్చి 1 వరకు జరిగే ఈ వేడుక కోసం కొన్ని వేల మంది కార్మికులు శ్రమించి పార్కులు, ఇతర ముఖ్యమైన స్థలాలన్నింటినీ అందంగా తీర్చిదిద్దుతారు. ఇందుకోసం 120 టన్నుల నిమ్మ పండ్లను ఉపయోగిస్తారట. నిమ్మ పండ్లు మాత్రమే కాకుండా ఆరెంజ్, గ్రేప్‌ఫ్రూట్ వంటి సిట్రస్ జాతికి చెందిన పండ్లను కూడా వాడతారు. అయితే ఎక్కువగా నిమ్మపండ్లే కనిపిస్తాయి. ఇలా అలంకరించిన పార్కులను చూడటానికి సందర్శకులను అనుమతిస్తారు. అత్యంత సుందరమైన తీర ప్రాంతం కలిగిన ఈ పట్టణాన్ని లెమన్ ఫెస్టివల్ జరిగే సమయంలో సందర్శించడానికి పర్యాటకులు ఆసక్తి చూపుతారు.

గోల్డెన్ ఫ్రూట్ పరేడ్

నారింజపండ్లు, నిమ్మపండ్లు రోడ్డుపై నీటివరదలా జారుకుంటూ వస్తే ఎలా ఉంటుంది? ఈ దృశ్యం చూడాలంటే గోల్డెన్ ఫ్రూట్ పరేడ్ చూడాల్సిందే. లెమన్ ఫెస్టివల్ జరిగే రోజుల్లో ప్రతి ఆదివారం మధ్యాహ్నం ఈ పరేడ్ నిర్వహిస్తారు. జానపద బృందాలు చేసే నృత్యాలు, అభిమానుల కోలాహలంతో ఈ పరేడ్ కన్నుల పండువగా ఉంటుంది. చివరి ఆదివారం రోజున పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తారు. గురువారం రోజుల్లో పరేడ్ రాత్రివేళ ఉంటుంది. ఈ ఫెస్టివల్‌ను మెంటన్ లెమన్ ఫెస్టివల్ అని కూడా అంటారు. ఎందుకంటే మెంటన్‌లోనే నిమ్మపండ్లు ఎక్కువ పండుతుంటాయి. మెంటన్ ఒక చిన్న పట్టణం. నైస్ పట్టణానికి 30 కి.మీల దూరంలో ఉంటుంది. ఇది యూరప్‌లో అత్యధికంగా నిమ్మపండ్లను పండిస్తున్న ప్రదేశంగా గుర్తింపు పొందింది.



పద్యం

నిక్కమైన మంచినీలమొక్కటి చాలు
తళుకు బెళుకు రాళ్లు తట్టెడేల
చాటుపద్యమిలను చాలదా ఒక్కటి?
విశ్వదాభిరామ వినురవేమ

భావం : జాతిరత్నం విలువ ఎన్నటికీ పూత అద్దిన రాళ్లకు రాదు. పనికిరాని వేల కవితల కన్నా మంచి నీతిని చాటే పద్యం ఒక్కటి చాలు.

జనరల్ నాలెడ్జ్

చంద్రునిపై కాలు పెట్టిన మొదటి వ్యక్తి ఎవరు?

సూక్తి

లేని గొప్పతనం ప్రదర్శిస్తే నీలో ఉన్న నిజమైన గొప్పతనం మరుగున పడిపోతుంది.

- గౌతమ బుద్ధుడు



చుక్కలు కలపండి



జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. ENHUR ▶..............
2. NDGAIH ▶..............
3. AKTIL ▶..............
4. HAGKLOE ▶..............
5. AADZ ▶..............

జవాబులు

జంబ్లింగ్ వర్డ్స్ :
1. NEHRU
2. GANDHI
3. TILAK
4. GOKHALE
5. AZAD

జనరల్ నాలెడ్జ్ :
నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్


ఒకటికి మూడు :
[illegible]

నేర్చుకుందాం! Anger = కోపం



పొడుపు కథ

ఎందరు ఎక్కినా విరగని మంచం



బొమ్మ గీయండి

మంచి మాట

అత్తరు దుకాణానికి వెళితే అక్కడ మనమేమీ కొనకపోయినా కొంత పరిమళాన్ని గ్రహిస్తాం.
ఉత్తముల సాహచర్యమూ అంతే!..

దండాలు..దండాలు.. అమ్మోరు తల్లీ

» కనులవిందుగా అమ్మవార్ల గ్రామోత్సవం
» అడుగడుగునా భక్తుల హారతులు » వైభవంగా అల్లూరు తిరునాళ్ల

అల్లూరు, జనవరి 3 : అక్కాచెల్లెళ్లయిన శక్తిదేవతలు ఒక్కసారిగా భక్తులకు దర్శనమివ్వడంతో భక్తులు పులకించిపోయారు. భక్తులు నిలబడ్డ చోటు నుండి కదలలేని విధంగా అమ్మవార్ల దర్శనభాగ్యంతో మనసుల్లో ఉప్పొంగిన భక్తిని నింపుకున్నారు. గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ అమ్మవార్ల గ్రామోత్సవం అల్లూరులో ప్రత్యేకతను సంతరించుకుంది. మంగళవారం ప్రారంభమైన తిరునాళ్ల బుధవారం సాయంత్రం గ్రామోత్సవంతో పూర్తయింది. ఏడాదికోసారి గ్రామంలో అమ్మవార్లు తిరుగాడడం ప్రతీ ఇంట పండుగ వాతావరణం కనిపించింది. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో అల్లూరు (ఊరు) తిరునాళ్లు అంగరంగ వైభవంగా జరిగింది.. వివిధ రకాల తెలుగు సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవార్ల గ్రామోత్సవం ఎంతో వైభవంగా కొనసాగింది. దాదాపు 30 ఏళ్ల తరువాత అల్లూరు గ్రామస్థులు



గ్రామోత్సవానికి తరలుతున్న పోలేరమ్మ

నిర్వహిస్తున్న ఈ తిరునాళ్లతో అందరి ఇంట ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. పులివాహనంపై గంగమ్మ, సింహవాహనంపై కలుగోళమ్మ, అశ్వవాహనంపై పోలేరమ్మలు గ్రామంలోని పురవీధుల్లో విహరించారు. తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కోలాటాలు, తప్పెట్లు, డ్రమ్ములు, వీరతాళ్లు, పొట్టి మనుషులు, సత్యహరిశ్చంద్ర నాటకం, మ్యూజికల్ నైట్ తదితర కార్యక్రమాలు అలరించాయి. ప్రముఖ సినీ సంగీత దర్శకుడు కోటి, ప్రముఖ గాయకులు హేమచందర్, శ్రావణభార్గవి, పాడుతా తీయగా విన్నర్ నాదప్రియ, జబర్దస్త్ హాస్యనటుడు శాంతికుమార్‌లు నిర్వహించిన కార్యక్రమాలు కుర్రకారును ఉర్రూతలూగించాయి.



తప్పెట్ల జోష్‌లో యువకులు

27 నుంచి సమ్మెకు దిగుతాం

● విద్యుత్ ఒప్పంద కార్మికుల ఐక్యవేదిక నేతలు

నెల్లూరు (సిటీ), జనవరి 3 : విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికుల సమస్యలు ఈ నెల 27లోపు పరిష్కరించాలని, లేకుంటే ఆ రోజు నుంచి సమ్మెకు దిగుతామని విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక ఛైర్మన్ పీ కృష్ణ హెచ్చరించారు. ఐక్యవేదిక పిలుపు మేరకు నగరం, రూరల్ డివిజన్ల అధికారులకు బుధవారం సమ్మె నోటీసును అందజేశారు. ఆయన మాట్లాడుతూ పదేళ్ల నుంచి కార్మికులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. పక్క రాష్ట్రాల్లో ఒప్పంద విధానాన్ని రద్దు చేసి ఆయా శాఖలు నేరుగా వేతనాలు చెల్లిస్తున్నాయన్నారు. ఏపీలో మాత్రం ప్రభుత్వాలు, సంస్థలు ఒప్పంద కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం, కార్మికుల క్రమబద్ధీకరణ, రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా, తదితర సమస్యలు ఈనెల 27లోపు పరిష్కరించాలని, లేని పక్షంలో 27 నుంచి సమ్మె చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్కే జాకీర్‌హుస్సేన్, సీహెచ్ పతంజలి, జీ హారతి, పీ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



డీఈకి సమ్మె నోటీసు ఇస్తున్న ఐక్యవేదిక నేతలు

తలుపులు తెరుచుకోని సబ్‌సెంటర్

ఉదయగిరి, జనవరి 3: మండల పరిధిలోని దేకూరుపల్లి సబ్ సెంటర్ రెండేళ్లుగా తలుపులు తెరుచుకోవడంలేదు. ఏఎన్ఎం లేక పోవడంతో ఇన్‌చార్జిగా హెల్త్ అసిస్టెంటు వ్యవహరిస్తున్నారు. ప్రతి వారం జరిగే వ్యాక్సినేషన్‌లో తలుపులు తెరిచి మిగిలిన రోజుల్లో మూసివేస్తుండడంతో ఈ ప్రాంతం ప్రజలకు వైద్యసేవలు అందం డంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.



సంక్షిప్తం

నేడు ఆర్లపడియలో గ్రామసభ

ఉదయగిరి, జనవరి 3: మండల పరిధిలోని ఆర్లపడియలో గురువారం జన్మభూమి-మావూరు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పణిపవన్ కుమార్ బుధవారం తెలిపారు. గ్రామసభకు అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

పక్కాగృహాల దరఖాస్తుల పరిశీలన

ఉదయగిరి, జనవరి 3: పట్టణంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్మించుకొన్న పక్కాగృహాలను బుధవారం అధికారులు పరిశీలించారు. 2014 జూన్ నుంచి 2016 మార్చిలోపు నిర్మించుకొని ప్రభుత్వం నుంచి మంజూరు ఉత్తర్వులు లేని లబ్ధిదారులు పట్టణంలో 14 మంది దరఖాస్తు చేసుకొన్నారు. ఈ దరఖాస్తులను ఈవో ఎల్.శ్రీనివాసులు, వీఆర్వో లక్ష్మీనారాయణ, వీఆర్‌ఏ సాహెద్‌లు పరిశీలించి వివరాలు సేకరించారు.

ఫిజియోథెరపీ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉదయగిరి, జనవరి 3: స్థానిక విద్యావనరుల కేంద్రంలో ప్రతివారం నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరాన్ని దివ్యాంగ చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపిస్టు చాముండేశ్వరి సూచించారు. బుధవారం స్థానిక కేంద్రంలో చిన్నారులకు ఫిజియోథెరపీ వైద్యసేవలు అందించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఐఈడీ రిసోర్సుపర్సన్లు రమేష్, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ సమావేశం

ఉదయగిరి, జనవరి 3: స్థానిక చైతన్య పాఠశాలలో బుధవారం వాకర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వాకర్స్ అసోసియేషన్ గవర్నర్ నేతాజీ సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడుతూ నడక వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు.అనంతరం వాకర్స్ గ్రౌండ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జాఫర్‌అహమ్మద్, ప్రధాన కార్యదర్శి ఎండీ సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడండి

దుత్తలూరు, జనవరి 3: హిందూ ధర్మాన్ని కాపాడాలని జిల్లా హిందూ ధర్మ ప్రచారక్ వెంగళరెడ్డి కోరారు. బుధవారం దుత్తలూరులో శ్రీకృష్ణదేవాలయంలో హిందూ ధర్మ ప్రచారకులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మప్రచారక్ ఆధ్వర్యంలో యువకులకు భజన, కోలాటం లాంటి కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కావలి డివిజన్ ధర్మప్రచారకులు మాధవరెడ్డి, కన్వీనర్ మేకపాటి మాల్యాద్రి, ప్రసాద్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : బొల్లినేని





ఉదయగిరి రూరల్ : కొండాయపాళెంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బొల్లినేని, వరికుంటపాడు : సభలో మాట్లాడుతున్న బొల్లినేని, తూర్పు చెన్నంపల్లెలో టీవీలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానల్ చూస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ఉదయగిరి రూరల్, జనవరి 3: ప్రజా సంక్షేమం కోసమే ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కొండయపాళెం, జీ.చెరువుపల్లి పంచాయతీల్లో సర్పంచులు గానుగపెంట ఓబులరెడ్డి, కప్పా శ్రీనివాసుల అధ్యక్షతన జరిగిన జన్మభూమి-మావూరు గ్రామసభలు జరిగాయి. ఈ సభల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత ముఖ్యమంత్రి సందేశం చదివినిపించి జన్మభూమి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.1500 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. జిల్లాలోని ఆదర్శంగా నియోజకవర్గాంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమన్నారు. అనంతరం లబ్ధిదారులకు చంద్రన్న కానుకలు, రేషన్‌కార్డులు, రుణమాఫీ పత్రాలు పంపిణీ చేశారు.గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పండ్లు, పసుపుకుంకుమ అందచేసి నగదు అందచేశారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలపై అర్జీలు అందచేశారు. ఈ సందర్భంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు, జీవాలకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ డీవెంకటస్వామి, ప్రత్యేకాధికారి నారాయణ, తహసీల్దారు వెంకటసునీల్, ఎంపీడీవో పణిపవన్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ ఏ.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలుగా పస్తులే !

తమకు మూడు నెలలుగా చౌక దుకాణం నుంచి బియ్యం అందక పస్తులుంటున్నామయ్యా అంటూ బుధవారం గ్రామసభలో ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు ఎదుట జీ.చెరువుపల్లి గ్రామస్థులు మొరపెట్టుకొన్నారు. దీంతో అక్కడే ఉన్న డీలర్‌తో గ్రామస్థులు వాగ్వివాదానికి దిగారు. స్పందించిన ఎమ్మెల్యే తహసీల్దారు వెంకటసునీల్‌తో చర్చించి వెంటనే జేసీకి ఫోన్ చేసి వీలైనంత త్వరలో సమస్యను పరిష్కరించి బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికే...

వింజమూరు, జనవరి 3: ప్రజా సమస్యల పరిష్కారానికే జన్మభూమి-మావూరు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఆర్.పద్మ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కాటేపల్లి, జనార్ధనపురం గ్రామాల్లో గ్రామసభ నిర్వహించారు. ఏవో సుబ్రహ్మణ్యం ముఖ్యమంత్రి సందేశాన్ని చదవగా, ఎంఈవో మాలకొండరావు జన్మభూమి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులంతా మీ చెంతకు వచ్చామన్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మస్తానయ్య, సర్పంచులు వెంకటలక్ష్మమ్మ, ఐ.కొండస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఏబీఎన్‌ను వీక్షించిన బొల్లినేని

వరికుంటపాడు, జనవరి 3: జన్మభూమి-మావూరు కార్యక్రమంలో భాగంగా తూర్పు చెన్నంపల్లి గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు మధ్యాహ్న సమయంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో ప్రసారమవుతున్న ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షించారు. పులివెందులలో చంద్రబాబునాయుడు కార్యక్రమానుద్దేశించి ప్రసంగిస్తున్నంత సేపు ఏబీఎన్ ప్రసారాలను తదేకంగా వీక్షించారు. ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మండల కన్వీనర్ యర్రా చినబ్రహ్మయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ మధుసూదన్‌రావు, కాకి ప్రసాద్, పావులూరి రవీంద్రబాబు, లోకసాని రవి కుమార్ తదితరులు కూడా టీవీకి అతుక్కుపోయారు.

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబే

రాష్ట్రంలో లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికి ఎలాంటి వెనుకడుగు వేయకుండా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న విజన్ ఉన్న నాయకుడే చంద్రబాబునాయుడేనని ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు అన్నారు. బుధవారం తూర్పుచెన్నపల్లి, జడదేవి గ్రామాల్లో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఉదయగిరి నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతున్నానన్నారు. రూ.1500 కోట్లతో అభివృద్ధి సాధించి మనత సకే దక్కుతుందన్నారు. కనియంపాడు రహదారికి రూ.7.50 కోట్లు మంజూరు చేయడంతోపాటు రూ.370 కోట్లతో నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ఫ్లోరైడ్ నివారణకు జిల్లాలో 110 ఆర్వో ప్లాంట్‌లు మంజూరైతే 75 ఉదయగిరికి మంజూరు చేయించానన్నారు. రూ.80 కోట్లతోఇంతవరకు సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో నూతన రేషన్‌కార్డులు, చంద్రన్న సరుకులు, రుణ ఉపశమన పత్రాలు పంపిణీ చేయడంతోపాటు గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి, మండల కన్వీనర్ యర్రా బ్రహ్మయ్య, మాజీఏఎంసీ చైర్మన్ చండ్ర మధుసూదన్‌రావు, మాజీ కన్వీనర్ చండ్ర వెంకయ్య, వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కాకి ప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షులు పావులూరి రవీంద్రబాబు, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, సర్పంచులు సౌభాగ్యమ్మ, సరస్వతి, మండల ఉపాధ్యక్షుడు ఏనుగంటి గంగయ్య, పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ మాలకొండ్రాయుడు, ఏఎంసీ డైరెక్టర్ ఎం.లక్ష్మీనారాయణ, ఎల్.రవికుమార్, గుర్రం గోపి, నాదిండ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రిగ్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఉదయగిరి రూరల్, జనవరి 3: మండల పరిధిలోని గండిపాళెం గురుకుల పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన గ్రిగ్ పోటీల్లో ప్రతిభ చూపడంతో బుధవారం పాఠశాలలో అభినందనసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డీసీ వెంగయ్య మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విద్యార్థులు సీనియర్ విభాగంలో 200, 400, 800, 1500 మీటర్ల పరుగుపందెంలో శివయ్య, అనిల్, నరసింహ, ఎం.మహేష్, నరసింహ, జావిలిన్‌త్రో వై.నీలకంఠ, కే.నరసింహ ద్వితీయ, తృతీయ, డిస్క్ ప్రథమ కౌశిక్, షార్ట్‌పుట్ ద్వితీయ కౌశిక్, హైజంప్ ప్రథమ కౌశిక్, ఖోఖో, ఫుట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్‌లో విజేతలుగా నిలిచారు. రెజ్లింగ్‌లో వీ శివయ్య ద్వితీయస్థానం, జూనియర్స్ విభాగంలో 200, 400 మీటర్ల జే.అరవింద్ ద్వితీయ, తృతీయస్థానం సాధించారు. ఖోఖో, టెన్నికాయిట్, వాలీబాల్‌లో విన్నర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, పీఈటీ నాగరాజు, ఉపాధ్యాయులు రమేష్ ,ఎస్.కిరణ్, చిరంజీవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిభాయిపూలే జయంతి వేడుకలు

దుత్తలూరు, జనవరి 3: స్థానిక ప్రాథమిక పాఠశాలలో బుధవారం సావిత్రిభాయిపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు మాట్లాడుతూ దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిభాయిపూలే అని, సమాజసేవ కోసం ఆమె చేసిన కృషి అభినందనీయమన్నారు. ఆమె ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చీదర్ల మల్లికార్జున, మండల పార్టీ కన్వీనర్ గురవారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చాకలకొండలో సావిత్రిబాయి జయంతి



సన్మానం అందుకున్న ఉపాధ్యాయినులు

వింజమూరు, జనవరి 3: ప్రముఖ సంఘసేవకురాలు, తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా పేరొందిన సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక బాలుర, చాకలకొండ ఆర్‌కే ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయినీలను ఘనంగా సన్మానించారు. ముందుగా సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఉదయగిరి రూరల్, జనవరి 3: సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా మండలపరిధిలోని గండిపాళెం గ్రామంలో పోస్టల్ డిపార్టుమెంట్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ దేశంలో తొలి ఉపాధ్యాయిని సావిత్రిబాయిపూలే అన్నారు. ఆమె పలు సమాజసేవా కార్యక్రమాలు చేశారన్నారు. ప్రస్తుత విద్యార్థులు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ పోటీల్లో గండిపాళెం, పెద్దిరెడ్డిపల్లి, విరువూరు ఉన్నత పాఠశాలల విద్యార్థులు విజయం సాధించడంతో వారికి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నగేష్, ఎస్‌పీఎం శివప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్

ఎస్‌కేఆర్ కళాశాలలో స్వచ్ఛభారత్

గూడూరు(రూరల్), జనవరి 3: స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను తొలగించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఈ తరహా కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విద్యార్థులకు శిక్షణ



మాట్లాడుతున్న కళాశాల మేనేజింగ్ సెక్రటరీ వినయ్‌కుమార్

గూడూరు, జనవరి 3: స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం బీటెక్ ఫైనలియర్ విద్యార్థులకు బెంగుళూరుకు చెందిన సెవెంత్ సెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించినట్లు కళాశాల మేనేజింగ్ సెక్రటరీ వినయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు, డైరెక్టర్ డాక్టర్ వీవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ తరగతులతో ప్రాంగణ ఎంపికల్లో ఎలా విజయం సాధించాలో అవగాహన కలుగుతుందన్నారు. త్వరలో 75 కంపెనీల ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించనుండడంతో ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగ అరెస్ట్ అన్యాయం



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గూడూరు(రూరల్), జనవరి 3: నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను అరెస్టు అన్యాయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మంద కృష్ణయ్య అన్నారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు న్యాయబద్ధంగా పోరాడుతున్న మంద కృష్ణమాదిగను ప అరెస్టు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనైనా ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, నాగరాజు, హరికృష్ణ, నారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రిగ్‌లో రాపూరు విద్యార్థుల సత్తా!

రాపూరు, జనవరి 3: వెంకటగిరిలో జరిగిన గ్రిగ్స్ పోటీల్లో రాపూరు సేవాభారత్ ట్రస్టు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు, స్థానిక గుడ్ షెపర్డ్ ఇంగ్లీషుమీడియం పాఠశాల విద్యార్థులు సత్తాచాటి పలు విభాగాల్లో పతకాలు సాధించినట్లు తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాల్లో విజేత విద్యార్థులను అభినందించారు.

జన్మభూమి-మాఊరుతో ఇంటివద్దకే సంక్షేమం



గూడూరులో జన్మభూమి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్



సామూహిక సీమంతాలు కార్యక్రమంలో చైర్‌పర్సన్ పొనకాదేవసేన



చిల్లకూరులో రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎంపీపీ రమాదేవి

గూడూరు, జనవరి 3: జన్మభూమి- మా ఊరు సంక్షేమ పథకాలను ప్రజల దరిచేర్చే బృహత్తర కార్యక్రమమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా స్థానిక పాటిమంజిల్‌లో 5,6,7 వార్డులకు సంబంధించి గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించే చక్కని అవకాశం జన్మభూమితో కలిగిందన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా సీఎం చంద్రబాబు నాయుడు పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, పింఛన్లు అందజేస్తున్నామన్నారు. అనంతరం నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులు అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సీడీపీవో ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు వాటంబేడు శివకుమార్, మస్తానమ్మ, ఎంబేటి చంద్రయ్య, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గూడూరు రూరల్‌లో....

మండల పరిధిలోని తిప్పవరప్పాడు, విందూరు, పగడాలపల్లి గ్రామాల్లో అర్హులైన వారికి రేషన్‌కార్డులు తదితర సంక్షేమ పథకాలను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు కరీముల్లా, శైలకుమారి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరులో....

మండల పరిధిలోని మోమిడి, ఏరూరు, బల్లవోలు, పల్లమాల గ్రామాల్లో జన్మభూమి - మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏరూరు గ్రామంలో అర్హులందరికీ రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు కాలేదని స్థానికులు అధికారులను నిలదీశారు. దీంతో త్వరలో అందరికి రేషన్ కార్డులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు అనంతరం ఎంపీపీ వీరుబోయిన రమాదేవి రేషన్‌కార్డులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు



కోట: అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే,అధికారులు

రమణయ్య, ఎంపీడీవో విజయేంద్రకుమార్, ఏవో రమణ, ఎంఈవో మధుసూదన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు జానకిరామిరెడ్డి, పారిచెర్ల శ్రీరామచంద్రయ్య, పట్టాభిరామిరెడ్డి, చేవూరు నాగరాజు, చేవూరు మాధవి, మేనకూరు వెంకట ఆదిశేషమ్మ, వెంకటకృష్ణయ్య, జిలానీ, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నంలో..

కొత్తపట్నం(కోట),జనవరి 03 : మండల పరిధిలోని కొత్తపట్నంలో ఎమ్మెల్యే చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు పాటు పడుతున్న చంద్రబాబునాయుడును ప్రజలు దీవించాలన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆర్డీవో అరుణ్‌బాబు,తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపీడీవో బ్రహ్మయ్య, సీడీపీవో హేనా సోజన్ తదితరులు వున్నారు.

వాకాడు, జనవరి 3: సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం జన్మభూమి - మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం అన్నారు. మండల పరిధిలోని బాలిరెడ్డిపాళెంలో జరిగిన జన్మభూమిలో ఆయన పాల్గొని ఆయన మాట్లాడారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అధికారులు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చంద్రన్న సంక్రాంతి కానుకలు, రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న క్రమంలో పూర్తిస్థాయిలో అందకపోవడంతో గ్రామస్థులు తహసీల్దారును నిలదీశారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి సొసైటీ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి సొంత నిధులతో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు లావణ్య, ఎంఈవో బాబు, ఏవో విజయభారతి, హౌసింగ్ ఏఈ అహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎంపీడీవో ప్రమీలారాణి ఆధ్వర్యంలో ములగనూరు పంచాయతీలో జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు.

గ్రామస్థాయి నుంచి వైసీపీ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ సమన్వయకర్త మేరిగ మురళి

కోట, జనవరి 3 : గ్రామస్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలన్నదే లక్ష్యమని వైసీపీ నియోజక వర్గ సమన్వయకర్త మేరిగ మురళి అన్నారు.కోటలోని ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి నివాసంలో బుధవారం మండల వైసీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలంతా వైసీపీ వైపే వున్నారన్నారు. పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు కొందరికి నాయకత్వం అప్పగించదలచుకున్నామన్నారు. ఇందులో భాగంగానే 30 మంది నాయకులు ,కార్యకర్తలకు మండల మెయిన్ కమిటీలో స్థానం కల్పించామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పదవుల్లో కీలక బాధ్యతలు అప్పగించామన్నారు. మరో 250 మందిని అనుబంధ సంఘాల్లో సభ్యులుగా చేర్చామన్నారు. మహిళలకు మండల స్థాయి పదవుల్లో కీలక బాధ్యతలు అప్పగించామన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, వైసీపీ తిరుపతి పార్లమెంటరీ నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి చిల్లకూరు దశరథ రామిరెడ్డి, కన్వీనర్ పలగాటి సంపత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గాది భాస్కర్, మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మొబీన్ బాషా, మూర్తి ఆనందయ్య, చిల్లకూరు సాయి ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నవోదయ పుస్తకాల పంపిణీ

విద్యానగర్(కోట),జనవరి 3 : విద్యానగర్ బాలబారతి ఉన్నతపాఠశాలలోని విద్యార్థులకు బుధవారం కామన్‌మెన్ ప్రొటెక్షన్ ఫెడరేషన్ వలంటీర్ల ఆధ్వర్యంలో నవోదయ పుస్తకాలను పంపిణీ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కడివేడు చందు, వలంటీర్లు ఏడుకొండలు, చంద్ర, హరీష్, కోడివాక సుమన్, దిలీప్ పాల్గొన్నారు. కళాశాల కరస్పాండెంట్ కర్రా శ్రీనివాస మూర్తి సభ్యులను అభినందించారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సభ్యులు

సైకిల్ ర్యాలీకి విద్యార్థుల స్వాగతం



ఏపీఎస్‌పీఎఫ్ సిబ్బందికి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

గూడూరు, జనవరి 3: ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఏపీఎస్‌పీఎఫ్) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం గూడూరు జాతీయ రహదారికి చేరుకోవడంతో స్థానిక ఆదిశంకర కళాశాల కూడలి వద్ద ఆదిశంకర విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సైకిల్ యాత్రలో పాల్గొన్న డీఎస్పీ బీవీఎం రెడ్డినాయక్ మాట్లాడుతూ విద్యార్థులు సైకిళ్ల వినియోగించడం వలన పర్యావరణ పరిరక్షణతోపాటు ఇంధన ఖర్చు కూడా మిగులుతుందన్నారు. సైకిల్ తొక్కడం వలన వ్యాయామం కలిగి ఆరోగ్యంగా ఉంటామన్నారు. వీటిపై అవగాహన కల్పించేందుకు సైకిల్‌యాత్రను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ధనుంజయ, ఏవో జె.రామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరు జోన్

చిల్లకూరు - వాకాడు - కోట

కౌమార బాలికల సంక్షేమంపై ప్రభుత్వం శ్రద్ధ

గూడూరు(రూరల్), జనవరి 3: కౌమార బాలికల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని చైర్‌పర్సన్ పొనకా దేవసేన అన్నారు. బుధవారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో కిషోరి వికాస వాహనం చేరుకోవడంతో ఆమె స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సమగ్ర బాలల సంరక్షణ పథకం జిల్లా అధికారి డాక్టర్ సునీల్ మాట్లాడుతూ బాలల సంరక్షణ, కౌమార బాలికల హక్కులు, సంరక్షణ, వారి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఐసీపీఎస్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు.

ఆదర్శ మహిళ సావిత్రిబాయి పూలే

గూడూరు(రూరల్), జనవరి 3: ఆదర్శ మహిళ సావిత్రిబాయి పూలే అని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య అన్నారు. బుధవారం సావిత్రిబాయి పూలే 187వ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావ్‌పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే దంపతులు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం అంబేద్కర్ ఫెలోషిప్ నేషనల్ అవార్డు గ్రహీతలు వల్లీప్రసాద్, సంపత్‌కుమార్‌లను సన్మానించారు. కార్యక్రమంలో చెన్నుపల్లి ప్రభాకర్, గురునాథం, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు. స్థానిక సీఎస్ఎం పాఠశాలలో మహిళా సాధికారిక సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయిని శశికళను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం పరంజ్యోతి, సారంగం సులక్ష్మీ, సారంగం శ్రీనివాసులు, అరవ పార్వతయ్య, నాశిన భాస్కర్‌గౌడ్, డాక్టర్ చంద్రహాస్, తాజుద్దీన్, ఎల్వీ సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

కోట,జనవరి 3 : భారత దేశానికే వన్నెతెచ్చిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని పలువురు కొనియాడారు. మండల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాల్లో బుధవారం భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 187వ జయంతి నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో వెంకట సునీల్ ఆధ్వర్యంలో వేలాంగిణమ్మ(కొక్కుపాడు), మైథిలీ కుమారి(చంద్రశేఖరపురం), సురేఖ(ఎన్‌బీటీ కాలనీ), లక్ష్మి(హిందీ పండిట్ - ఉత్తమనెల్లూరు) లను ఉత్తమ మహిళా ఉపాధ్యాయినులుగా ఎంపిక చేసి శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్‌రావు, కోఆర్డినేటర్ డాక్టర్ రాజా, అమ్మాజీ, సుహ్రులత, రమాదేవి, సుజన, విద్యార్థులతో కలిసి సావిత్రబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కోటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బీఎస్పీ నియోజక వర్గ ఇన్‌చార్జి మీజూరు మాధవ్, ఏఎస్ఏ జిల్లా కార్యదర్శి అశోక్ కాంబ్లేల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఏఎస్ఏ కమిటీని ఎన్నుకున్నారు. ఏఎస్ఏ అధ్యక్షుడిగా స్వరూప్, ఉపాధ్యక్షుడిగా శ్రీనాథ్, కోశాధికారిగా వినయ్, జిల్లా కార్యదర్శిగా అశోక్ కాంబ్లే, జిల్లా నాయకులు అర్జున్, బాలకృష్ణ పాల్గొన్నారు.



పూలే దంపతుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



కోట: ఉత్తమ ఉపాధ్యాయురాలిని అభినందిస్తున్న ఎంఈవో తదితరులు

సంక్షిప్తం

దాడి అమానుషం



మాట్లాడుతున్న దేవానంద్

గూడూరు, జనవరి 3: ఎస్ఏఎల్‌సీ చర్చి సభ్యుడు మట్టం దేవప్రసాద్‌పై దాడి అమానుషమని ఎస్ఏఎల్‌సీ సభ్యుడు కలపాటి దేవానంద్ అన్నారు. బుధవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చర్చిలో పాలనాపరమైన అంశాల్లో అవకతవకలపై విచారణ చేయాలని కోరినందుకు దాడి చేయడం దారుణమన్నారు. ఓటర్ల జాబితా వివరాలు బహిర్గతం చేయాలన్నారు. చర్చి నిర్వహణ పారదర్శకంగా ఉండాలని కోరుతున్నామన్నారు. న్యాయం కోరితే దాడి చేయడం సమంజసం కాదన్నారు. ఈ అంశాలపై తక్షణ విచారణ చేపట్టాలని కోరారు. సమావేశంలో ఏజె సాల్మన్, మట్టం దేవప్రసాద్, అవిలాల అనిల్‌కుమార్, తేరే నెహెమియా, పీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అందరివాడు సాయికోటారెడ్డి



సాయికోటారెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు

చెందోడు(కోట), జనవరి 3 : ఎంతో మందికి సహాయ సహకారాలు అందించిన మహనీయుడు స్వర్గీయ వేణుంబాక సాయి కోటారెడ్డి అని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పలువురు టీడీపీ నాయకులు అన్నారు. మండల పరిధిలోని చెందోడులో బుధవారం మాజీ సర్పంచు వేణుంబాక సాయికోటారెడ్డి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి కోటారెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యేతో పాటు కన్వీనర్ సర్వోత్తమరెడ్డి, టీడీపీ నాయకులు దేవారెడ్డి మనోజ్‌రెడ్డి, పుచ్చల పల్లి సుధాకర్‌రెడ్డి, మాధవ్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ బోదనపు బాలసుబ్రహ్మణ్యం, సర్పంచు బండి విజయమ్మ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరుమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కండలేరు జలాలు ప్రతి చెరువుకు చేరాలి

గూడూరు, జనవరి 3: కండలేరు జలాలను నియోజకవర్గంలోని ప్రతి చెరువుకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఇరిగేషన్, తెలుగుగంగ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండలేరు జలాలు విడుదలై నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు అన్ని చెరువులకు సక్రమంగా నీరు చేరడం లేదన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా నీరందించేందుకు అవసరమైతే పోలీసు బందో బస్తు ఏర్పాటు చేసి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్క ఎకరా కూడా ఎండకుండా ప్రత్యేక ప్రణాళిక నీటిని సరఫరా చేయాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సాయికృష్ణ యాచేంద్ర

వెంకటగిరి, జనవరి 3: పట్టణంలోని ఆర్వీఎం ఉన్నత పాఠశాల, బంగారుపేట ఆర్వీఎం ఉన్నత పాఠశాలల్లో 120 మంది 10వ తరగతి విద్యార్థులకు బుధవారం జీఎన్ఆర్ సర్వీస్ ట్రస్ట్ నిర్వాహకులు అందించిన యూటీఎఫ్ మోడల్ పేపర్లను పాఠశాలల కరస్పాండెంట్ సాయికృష్ణ యాచేంద్ర చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ పేద విద్యార్థులను ప్రోత్సహించడం అభినందించ దగ్గ విషయమన్నారు. దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుని 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.ట్రస్టు సభ్యులు డాక్టర్ రవీంద్రబాబు, సుబ్రమణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాఘవయ్య, మీనయ్య, యూటీఎఫ్ ప్రతినిధులు ఉదయకుమార్, కుమారస్వామి, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి పరీక్షలపై దృష్టి సారించాలి

కోట,జనవరి 3 : మార్చిలో జరగనున్న 10వ తరగతి పరీక్షలపై దృష్టి కేంద్రీకరించి శ్రద్ధ తీసుకోవాలని బీసీ గురుకులాల అకడమిక్ గైడెన్స్ అధికారి కిరణ్ శ్రీ కోరారు. కోటలోని బీసీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులతో 10వ తరగతి పరీక్షల నిర్వహణపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బీసీ గురుకులాల పరిధిలో ఆరు జిల్లాల్లో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నామన్నారు. ఈ ఏడాది అన్ని గురుకుల పాఠశాలలు రెట్టింపు ఫలితాలను సాధించాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. నెల్లూరు జిల్లాలోని బీసీ గురుకుల పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ మహ్మద్ బాషా, నోవాబాబు, రాజారావు, ఉపాధ్యాయుడు కిరణ్ శ్రీని శాలువాలు మెమెంటోలతో సన్మానించారు.



ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న ఏజీవో కిరణ్‌శ్రీ

విద్యార్థుల శ్రమదానం

రాపూరు,జనవరి 3: రాపూరు సీవీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో భాగంగా బుధవారం కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ప్రిన్సిపల్ సుచరిత, ప్రోగ్రాం అధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

51 మంది యువకుల రక్తదానం

రాపూరు: జనవరి 3: కరుణామయి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 51మంది యువకులు రక్తదానం చేశారు. వైద్యశిబిరానికి సుమారు వెయ్యి మంది రోగులు పరీక్షలు చేయించుకున్నారు. గురువారం దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. యూఎస్ వైద్యులు మాణిక్యం, అనిల్, నారాయణ వైద్యబృందం ప్రవీణ్, చందన, అనూహ్య, గంగాధర్, ప్రసన్న, కృష్ణకుమార్, జోషిత్, మానస, స్థానిక వైద్యులు రాజేష్, మురళీ, మేనక తదితరులు సేవలందించారు. ట్రస్టీలు రేవతమ్మ, విజయ సౌమ్య, విజయ భరత్ పాల్గొన్నారు.



బాలింతలకు పండ్ల పంపిణీ

కావలిటౌన్, జనవరి3: ప్రజామిత్ర మండలి ఆధ్వర్యంలో బాలింతలకు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కనుమూరు భాస్కర్‌రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటిండెంట్ కె సుబ్బారావు, ఆర్ఎంవో శ్రీనివాసరావులు పాల్గొని పంపిణీ చేశారు.

సమాచారం

కూరగాయల ధరలు

కూరగాయ	కిలో ధర(రూ.లలో)
టమోటా	9.00
వంకాయలు	23.00
బెండకాయలు	20.00
బీరకాయలు	38.00
సొరకాయలు (ఒరటి)	13.00
బీన్స్	28.00
కాకరకాయలు	25.00
దోసకాయలు	20.00
మునగకాయలు	---
దొండకాయలు	16.00
పచ్చిమిర్చి	20.00
ఉర్లగడ్డలు	17.00
చామగడ్డలు	35.00
క్యారెట్	50.00
బీట్రూట్	27.00
ముల్లంగి	17.00
క్యాబేజీ	32.00
గోరుచిక్కుడు	22.00
అల్లం	40.00
చిక్కుడు	40.00

ముఖ్యమైన ఫోన్ నెంబర్లు

ఆర్డీవో	- 9849904054
తహసీల్దార్	-9849904063
ఆర్టీవో	-9848528360
డీఎస్పీ	-9440796333
ఒకటో పట్టణ సీఐ	-9440796312
రెండో పట్టణ సీఐ	-9440796336
రూరల్ సీఐ	-9440796334
ఎక్సైజ్‌సీఐ	-9440902521
మున్సిపల్ కమిషనర్	-9849907342
మున్సిపల్ డీఈ	-9849908033
అగ్నిమాపక అధికారి	-08626243101
పట్టణప్రణాళిక అధికారి	-9849908662
ఎంపీడీవో	-9849911737
ఎంఈవో	-9440634143
వాణిజ్య పన్నుల శాఖ	-8008111354
విద్యుత్ శాఖ డీఈ	-9440811989.
ఏడీఈ	-9440812008
వెంగళరావునగర్ సబ్‌స్టేషన్	-9490615328
పుల్లారెడ్డినగర్ సబ్‌స్టేషన్	-9490615329
మద్దూరుపాడు సబ్‌స్టేషన్	-9490615330
ముసునూరు సబ్‌స్టేషన్	-8331011824

సినిమా గైడ్

కావలి

లత ఏ/సీ :	మిడిల్ క్లాస్ అబ్బాయి
స్రవంతి:	2 కంట్రీస్
ఎస్పీ వెంకటేశ్వర:	హలో

సమస్యల పరిష్కారానికే జన్మభూమి

›› జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో వక్తలు ›› బాలింతలకు సీమంతం, చంద్రన్న కానుకల పంపిణీ

కావలిరూరల్, జనవరి3: ప్రజా సమస్యల పరిష్కారానికే జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కావలి నియోజకవర్గ ప్రత్యేక అధికారి డీఎఫ్‌వో రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. కావలి రూరల్ మండలం ఆముదాలదిన్నె, అన్నగారిపాలెం గ్రామాల్లో సర్పంచ్ రాములు, భక్తాని నరసింహం అధ్యక్షతన బుధవారం 5వ విడత జన్మభూమి- మా ఊరు కార్యక్రమం జరిగింది. అన్నగారిపాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులుగా డ్వామా పీడీ శ్రీనివాసరావు, ఏపీడీ వెంకటరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జన్మభూమి- మా ఊరు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ధన్యాసి పద్మజ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఆముదాల దిన్నెలో బెల్టు దుకాణాలు ఎక్కువగా ఉన్నాయని వాటిని తొలగించాలని మహిళలు తహసీల్దార్ కృష్ణారావు వద్ద కన్నీరు పెట్టుకున్నారు. దీంతో స్పందించిన ఆయన ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు, ఒకటోపట్టణ సీఐ రోశయ్యలకు గ్రామంలో బెల్టు దుకాణాలు తొలగించాలని ఆదేశించారు. దీంతో పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది గ్రామానికి చేరుకుని బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న వారిని హెచ్చరించారు. అనంతరం తుమ్మలపెంట, అన్నగారిపాలెంలో చంద్రన్న సంక్రాంతి కానుకలు, వడ్డీలేని రుణ పత్రాలు అందజేశారు. తుమ్మలపెంట, సర్వాయపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు వెంకటేశ్వర్లు, సురేష్‌బాబు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కృష్ణారావు, ఎంపీడీవో జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నుడా డైరెక్టర్ పాలడుగు రంగారావు, సీనియర్ నాయకులు నాయుడు రామ్‌ప్రసాద్,



ఆముదాలదిన్నెలో చంద్రన్న కానుక అందజేస్తున్న తహసీల్దార్, ఎంపీపీ



బాలింతలకు సీమంతం చేసి ఆశీర్వదిస్తున్న డీఎఫ్‌వో రామోహ్మన్‌రావు, చైర్‌పర్సన్ అలేఖ్య, తదితరులు



కొండాపురంలో రైతులకు రుణమాఫీపత్రాలు అందజేస్తున్న అధికారులు

ఎంపీపీ పర్రి మహేశ్వరి, ప్రళయకావేరి భాస్కర్, ఎంపీ టీసీలు వాయిల శీనుబాబు, మొగిలి కోటమ్మ, ప్రసన్న, ఖలీల్, ఉప్పాల శీను, పులి శివ, తిరుపతి స్వామి, ఏఎస్‌వో మందాడి నరేష్, అధికారులు పాల్గొన్నారు.

కావలిటౌన్: పట్టణంలోని 5, 6, 7, 9వ వార్డులలో జన్మభూమి- మా ఊరు కార్యక్రమం జరిగింది. పాతూరు మున్సిపల్ హైస్కూల్ ఎదురుగా 5, 7వ వార్డు జన్మభూమి- మా ఊరు కార్యక్రమానికి కమిషనర్ ఏ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా కావలి, ఆత్మకూరు నియోజకవర్గాల జన్మభూమి స్పెషల్ అధికారి పీ రామ్మోహన్‌రావు, పాల్గొ న్నారు. అనంతరం చం ద్రన్న కానుకలు, రేషన్‌కా ర్డులు పంపిణీ చేసి, గర్భిణులకు సీమంతం చేశారు. 7వ వార్డు కౌన్సిల ర్ రజని, 5వ వార్డు కౌన్సిలర్ జెనిగర్ల రమణ మ్మ అధ్యక్షతవహించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ అలేఖ్య, తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ జెనిగర్ల రమణమ్మ, వైసీపీ నాయకులు మహేంద్ర తమ వార్డులో కాలువ కోసం తవ్వి వదిలేశారని జొన్నాయగుంట రోడ్డు మంజూరై ఏళ్లు గడుస్తున్న నిర్మాణం చేపట్టలేదని స్థానికులు అధికారులను ప్రశ్నించి కార్యక్రమం నుంచి మధ్యలో నిష్క్రమించారు. 9వ వార్డులో కౌన్సిలర్ బిట్రగుంట శివకుమార్ ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వరకృపాదానం, జన్మభూమి సభ్యులు అమరా వేదగిరి, జ్యోతి బాబురావు, టీడీపీ నేతలు కేతిరెడ్డి రామకోటారెడ్డి, ఆత్మకూరి బ్రహ్మయ్య, చిలకపాటి శ్రీనివాసులు. డాక్టరు చంద్రశేఖర్, దావులూరి దేవకుమార్ పాల్గొన్నారు.

నేడు చోడవరానికి ఎమ్మెల్యే బొల్లినేని రాక

జలదంకి, జనవరి3: జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా గురువారం చోడవరంలో జరుగనున్న కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పాల్గొంటారని టీడీపీ మండల కన్వీనర్ పూనూరు భాస్కర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో విజయవంతం చేయాలని కోరారు.

కొండాపురం: జన్మభూమి-మాఊరు కార్యక్రమం బుధవారం మండలంలోని తూర్పుఎర్రబల్లి, గొట్టిగుండాల గ్రామాల్లో జరిగింది. ఈకార్యక్రమంలో నూతనంగా మంజూరయిన రేషన్‌కార్డులను, రుణమాఫీపత్రాలను జడ్పీటీసీ దామా మహేశ్వరరావు రైతులకు అందజేశారు. నేడు గొట్టిగుండాల, గొట్టిగుండాలపాలెం గ్రామాలలో జన్మభూమి-మాఊరు కార్యక్రమం జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి కే.వీ.రమణారావు, తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో జీ.పిచ్చిబాబు, సెంట్రల్‌బ్యాంకు డైరెక్టర్ వై.క్రిష్ణయ్య, ఎంపీపీ కే.నాగేశ్వరమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పీ.చంద్రబాబునాయుడు, తూర్పుఎర్రబల్లి సర్పంచ్ పంటా లక్ష్మీదేవి, ఎంపీటీసీ రసూల్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

దగదర్తి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నడు లేని విధంగా సంక్షేమ పథకాల అమలు జరుగుతుందని ఏపీ ఇరిగేషన్ బోర్డు డెవలప్‌మెంట్ డైరెక్టరు మాలేపాటి రవీంద్రనాయుడు అన్నారు. మండలంలోని చెన్నూరు, తురిమెర్ల గ్రామాల్లో జరిగిన జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పరిపాలనలో ఏ ఒక్క అవినీతికి అక్రమాలకుతావు లేకుండా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతు న్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జయప్రకాష్, ఎంపీడీవో పరంధామయ్య, సర్పంచ్ అల్లం వెంకమ్మ, ఉపసర్పంచ్ రమణమ్మ, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, అనీల్, సుమన్, ప్రసాద్‌నాయక్ పాల్గొన్నారు.

● స్పెషల్ ఆఫీసర్ డుమ్మా

జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ బీ శ్రీనివాసులు దగదర్తి మండలానికి ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఈయన బుధవారం మండలంలోని చెన్నూరు, తురిమెర్ల గ్రామాల్లో జరిగిన జన్మభూమి- మా ఊరు కార్యక్రమానికి హాజరు కాలేదు. ఈ కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసరే డుమ్మా కొట్టడం సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



దగదర్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

28న పదో తరగతి విద్యార్థులకు మెగా టాలెంట్ టెస్ట్

కొండాపురం, జనవరి3: ఈనెల 28 వతేదీన నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు మెగాటాలెంట్ టెస్ట్ కొండాపురం జెడ్పీ ఉన్నతపాఠశాలలో జరుగుతుందని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గుర్రం మాల్యాద్రి అన్నారు. బుధవారం ఆయన విలేఖర్ల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవాసభారతీయులైన వైద్యులు నర్రా రవికిషోర్, స్వాతి దంపతుల సహకారంతో ఏపీటీఎఫ్-1938 మండలశాఖ ఆధ్వర్యంలో ఈ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు జనవరి 10లోగా తమ పేర్లను నమోదుచేసుకోవాలన్నారు. పేర్ల నమోదు కోసం 9989675688 సెల్ నెంబరులో సంప్రదించాలన్నారు. 100 మార్కులకు పూర్తిగా ఆబ్జెక్టివ్ పద్ధతిలో పరీక్ష ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఆశాఖ జిల్లా కౌన్సిలర్ మల్లికార్జునరెడ్డి, మండలాధ్యక్షులు పుల్లయ్య, ప్రధానకార్యదర్శి మహేంద్ర పాల్గొన్నారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు



ఇంటి ఆవరణలో దూసుకెళ్లిన కారు

కావలి(క్రైం),జనవరి3: అదుపు తప్పిన కారు ఇంట్లోకి దూసుకెళ్లిన సంఘటన స్థానిక దక్షిణ జనతాపేటలో బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు అదేప్రాంతానికి చెందిన జొన్న సుకుమార్ జనతాపేట మొదటి లైనులోకి వెళ్లే క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డుకు తూర్పువైపున ఉన్న మొదటి ఇంటిలోనికి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో ఇంటి ప్రహరీ, గేటు ధ్వంసం అయ్యాయి. ఇంటిఆవరణలో ఉంచిన ద్విచక్రవాహనం దెబ్బతింది. కారు ముందుభాగం ధ్వంసం అయింది. ఈ సంఘటనలో ఎవరికి గాయాలు కాలేదు.

పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతి

కావలిరూరల్, జనవరి3: కావలి రూరల్ మండలం మన్నంగిదిన్నె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రత్నం మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే జీవిత విశేషాలు, ఆమె ఆడపిల్లల చదువు కోసం చేసిన కృషిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన డాక్టర్ ఎస్ లక్ష్మీ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలే మిన్న అని విద్యార్థులు ఏ రంగంలో రాణించాలన్నా ప్రభుత్వ పాఠశాలలే పునాది అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని టీ సునీత, ఏఎన్ఎం కే ఉష, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రాస్తారోకో

కావలిటౌన్, జనవరి3: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఉపవాసదీక్షను భగ్నం, అరెస్టుకు నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, మాల్యాద్రి, సుశీల, కిరణ్‌కుమార్, క్రాంతి కుమార్, ఏసు, జయరాజ్ పాల్గొన్నారు.



సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

కావలి, జనవరి3: సంఘసంస్కర్త, త్యాగమయి మహిళా వైతాళికురాలు సావిత్రిబాయి పూలే అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బుధవారం కావలి పట్టణ జయ ఉష పాఠశాలలో, ఆర్వీడీఎస్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ రామ్స్ సెంటర్ ఆధ్వర్యంలో జయ ఉష పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, తాతిరెడ్డి, సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే సామాజిక న్యాయం కోసం పోరాడిన మానవతామూర్తి అని, కుల నిర్మూలనకు పాటుపడ్డారని, స్త్రీ విద్యకోసం పాటుపపడిన మానవతా మూర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జి.వెంకట్రావు,ఖాదర్‌భాష పాల్గొన్నారు.

● కావలి పట్టణ ఆర్వీడీఎస్ కార్యాలయంలో దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి అధ్యక్షతన సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల, సేవాసంస్థల నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్వీడీఎస్ రాష్ట్ర కన్వీనర్ వెంకటేశ్వర్లు, సాక్షి ఉమన్ రైట్స్ రాష్ట్ర కన్వీనర్ దాసరి బాలక్రిష్ణ, మాజీ జడ్పీటీసి కందుల శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ గంధం ప్రసన్నాంజనేయులు, మహిళాసంఘం నాయకురాలు అనూరాధ, లావణ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.


కలిగిరి: సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ, తదితరులు

కలిగిరి: స్థానిక కస్తూర్బా విద్యాలయంలో బుధవారం జరిగిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఎంపీపీ మద్దసాని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చీమల తాతయ్య, శ్రీరాం కలిగిరయ్య, నేలపాటి నరహరి, కిలారి కొండపనాయుడు, స్వర్ణ కొండయ్య, బత్తల భాస్కర్, కుమ్మరి ఈశ్వరమ్మ, బుజ్జయ్య, కస్తూర్బావిద్యాలయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉత్తర కాలువకు నీటి విడుదలపై

నీలినీడలు

- అధికారుల నిర్లక్ష్యానికి బలవుతున్న రైతాంగం
- నెరవేరని ఎమ్మెల్యే బొల్లినేని హామీ
- వృథా కానున్న టీడీపీ నేతల యత్నాలు
- అయోమయంలో రైతులు


ఎండిపోయిన తూర్పుపాలెం చెరువు

కొండాపురం, జనవరి3: సోమశిల ఉత్తర కాలువ నుంచి మండలంలోని ఉప్పుటేరుకు నీరు విడుదల ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించడంలేదు. ఉత్తరకాలువకు గొట్టిపాటి కొండపనాయుడు కాలువగా నామకరణం చేసి తవ్వకం మొదలుపెట్టి 30 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. సోమశిల రిజర్వాయరు నుంచి సుమారు 106 కిమీ పొడవున్నకాలువ 76వ కిమీ వరకు రెండు సంవత్సరాల నుంచి సాగుకునీరు అందుతుంది. మిగిలిన 30 కిమీ కాలువ ఆద్యంతం తవ్వకంసరిగా జరగకపోవడంతో ఈప్రాంత రైతులకు నీరు అందడం లేదు. కాంట్రాక్టరు, అధికారుల నిర్లక్ష్యంతో కోట్లాది రూపాయల ప్రజాధనంతోపాటు వేలాది ఎకరాలు బీడుభూములుగా మిగిలి ఉన్నాయి. కాలువకు నీటి విడుదలపై రైతుల్లో అయోమయం నెలకొంది. ఎమ్మెల్యే బొల్లినేని హామీ ఏమేరకు నెరవేరుతుందో అర్థంకావడం లేదు. ఇదీ ఐదేళ్లనుంచి మండలంలోని పంట భూముల పరిస్థితి.

రబీలో 3 వేల ఎకరాల వరకు సాగు

మండలంలో సుమారు 3 వేల ఎకరాల వరి పంటను రబీ సీజన్‌లో సాగుచేసినట్లు అధికారులు చెబుతున్నారు. చెరువులపై ఆధారపడి గుడవళ్లూరు, రేణమాల, తూర్పుపాలెం, పార్లపల్లి, సత్యవోలు, కొమ్మి, గానుగపెంట, ఆదిమూర్తిపురం గ్రామాల్లో సుమారు 900 ఎకరాల వరకు సాగుచేసి ఉన్నారు. శెట్టిపాలెం, ఉప్పలూరు, చింతలదీవి, గొట్టిగుండాల, గొట్టిగుండాలపాలెం, తూర్పుఎర్రబల్లి, ఇస్కదామెర్ల, గరిమెనపెంట గ్రామాల్లో బోర్లకింద వరిపంటను సాగుచేసి ఉన్నారు. చెరువులలో నీరు ఎండిపోవడంతో చెరువు ఆధారంగా సాగుచేసిన వరి పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది.


నీరులేక బీటలు వారుతున్న తూర్పుపాలెంలో వరిపంట

తూర్పుపాలెం చెరువు కింద సుమారు 350 ఎకరాలలో సాగుచేసిన వరిపంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు. గత అక్టోబరులో కురిసిన వర్షాలకు చెరువునిండటంతో ఎంతో ఆశతో రైతులువరి సాగుచేశారు. మరలావర్షాలు పడకపోవడంతో చెరువు ఎండిపోయి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. కొంతమంది రైతులకుబోర్లు ఉన్నప్పటికీ ఐదారేళ్లగా వర్షాలులేక భూగర్భజలమట్టం తగ్గి అవి అరకొరగా నీరువస్తుండడంతో ఒక్క ఎకరా తడిచేందుకు రెండు మూడు రోజులు పడుతుంది. విద్యుత్ 7 గంటలే కావడంతో జనరేటర్లకు ఆయిల్‌పోసి మోటార్లను ఆడిస్తుండటంతో రైతులకు ఆర్థికంగా భారమవుతుంది. 2015-16 సంవత్సరంలో మండలంలోని పలు గ్రామాలలో సాగుచేసిన వరిపంటను సేవ్‌ది క్రాప్ కింద పలువురు నాయకులు రూ 2.50 లక్షలు వెచ్చించినా ఇప్పటివరకు ఒక్కపైసా ప్రభుత్వం విడుదలచేయ లేదు. ఇదే పరిస్థితి కొనసాగినట్లయితే తాము సాగుచేసిన వరిపంటకు ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడులు నష్టపోవాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. ఈపంటను కాపాడుకోవాలంటే సోమశిల ఉత్తరకాలునీరు ఉప్పుటేరుకు వదలి గుడవళ్లూరు, తూర్పుపాలెం, కొమ్మి, సత్యవోలు చెరువులను నింపుకోవడంతప్ప వేరే మార్గంలేదని రైతులు అంటున్నారు.

పంటను కాపాడేందుకు ముందుకువచ్చిన టీడీపీ నాయకులు

ఇటీవల మండల టీడీపీ నాయకులు సోమశిల ఉత్తరకాలువనుండి మండలంలోని ఉప్పుటేరుకు నీటిని విడుదలచేయించి సాగుచేసిన పంటలను కాపాడాలని ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావును కోరడం జరిగింది. స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడగా కాలువమొత్తం తవ్వకం పూర్తయి కలిగిరి మండలం జిర్రావారిపాలెం గ్రామంవద్ద 12 మీటర్ల తవ్వకం ఆగివుందని దానిని పూర్తిచేస్తే నీరు విడుదలచేస్తామని అధికారులు చెప్పారు. ఆగివున్న కాలువతవ్వకాన్ని అడ్డుకోవద్దని పొలంలోకి వెళ్లేందుకు రాకపోకలకు ఇబ్బందిలేకుండా చేస్తానని గ్రామస్థులకు చెప్పడం జరిగింది. అధికారుల సూచనలమేరకు మండల టీడీపీ కన్వీనర్ బొట్లగుంట హరిబాబు తనసొంత నిధులతో ఆప్రదేశంలో సిమెంటుపైపులు వేయించి కాలువ తవ్వకాన్ని పూర్తిచేయించారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ అక్కడనుండి దిగువన ఆద్యంతం బెడ్‌లెవల్ సరిగాలేకపోవడంతో పాటు ఉప్పలూరు గ్రామంవద్ద కాలువ బ్లాస్టింగ్ పూర్తికాకపోవడంతో నీరు విడుదలకు సాధ్యంకాలేదు.

వారంలోగా నీరందిస్తాం

కాంక్రీటు నిర్మాణాలవద్ద కాలువకు ఉన్న అడ్డంకులు తొలగించే ప్రక్రియ వేగవంతం చేశాం. అలాగే పూడికతీత పనులు మొదలుపెట్టాం. మరో నాలుగైదు రోజుల్లో కాలువద్వారా ఉప్పుటేరుకు నీటిని వదలేందుకు ప్రయత్నాలు ముమ్మరంచేశాము.

- దేశీనాయక్, సోమశిల ఉత్తరకాలువ ఈఈ

వైద్యశాలను తనిఖీ చేసిన క్వాలిటీ అసూరెన్స్ కమిటీ

కావలిరూరల్, జనవరి 3: కావలి రూరల్ మండలంలోని తుమ్మలపెంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం ప్రకాశం జిల్లాకు చెందిన క్వాలిటీ అసూరెన్స్ కంపెనీ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పాల్గొన్న డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ వైద్యశాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నాయన్నారు. రోగులకు వైద్యం అందించే విధానం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం క్వాలిటీ కమిటీ సభ్యులు సాయిచరణ్, కృష్ణప్రసాద్, క్రాంతి, భరత్‌భూషణ్‌లు వైద్యశాలలోని డెలివరీ రూమ్‌లతో పాటు ఆపరేషన్‌గది, టీకాలు నిల్వ ఉండే గది, తాగునీటి సౌకర్యాలతో పాటు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.


తుమ్మలపెంట ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కమిటీ సభ్యులు

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల మంజూరు


తుమ్మలపెంట ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కమిటీ సభ్యులు

కలిగిరి, జనవరి3: నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా రోడ్డునిర్మాణాలు జరిగి ఉంటేనే ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీరు కే నయూముల్లా తెలిపారు. కలిగిరి-సంగం మార్గంలో కలిగిరి నుంచి పాతనాపురం వరకు జరిగిన రోడ్డు పనులను బుధవారం క్వాలిటీకంట్రోల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పలుచోట్ల రోడ్డునిర్మాణం నుండి శాంపిల్స్ సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ఎంవీ వివేకానందరెడ్డి, ఈఈ జీ చంద్రశేఖరరెడ్డి, డీఈ సుబ్బయ్య, ఏఈ నాగరాజు, జేఈలు అనీల్‌కుమార్, సుబ్బారెడ్డి, రాజేష్ తదితరులు ఉన్నారు.

రామాయపట్నం మెగా పోర్టు నిర్మించాల్సిందే!

కావలిటౌన్, జనవరి3: రామాయపట్నంలో మెగా పోర్టు నిర్మించాల్సిందేనని బుధవారం జరిగిన పోర్టు సాధన సమితి రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు డిమాండ్ చేశారు. స్థానిక బీకే హాల్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం సీపీఐ పట్టణ కార్యదర్శి డేగా సత్యనారాయణ పర్యవేక్షణలో ఏపీ టెక్స్‌టైల్ ఫెడరేషన్ నాయకులు తన్నీరు మాల్యాద్రి అధ్యక్షత వహించాడు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతలు మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు నిర్మాణానికి అనుకూలమైన ప్రదేశమని షిప్‌యార్డుతో పాటు డాక్‌యార్డు కూడా నిర్మించాలన్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను కలుపుకుని పోర్టు సాధన కోసం ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దామా అంకయ్య, సీపీఎం కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, సీపీఐఎంఎల్ న్యూడెమక్రసీ నాయకులు భాస్కర్, సీఐటీయూ నాయకులు మల్లికార్జున, ఓపీడీఆర్ మాల్యాద్రి, టీడీపీ నాయకులు శ్యామ్‌సన్, వైసీపీ నాయకులు కుందుర్తి శ్రీనివాసులు, కనుమూరు భాస్కర్‌రెడ్డి,దొడ్ల మనోహర్‌రెడ్డి, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, వై మధు, బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కుమారుడి వైద్యసేవలకు సహాయం చేయండి



కుమారుడితో సుధాకర్

కలిగిరి, జనవరి3: తమ కుమారుడి వైద్యసేవలకు ప్రభుత్వం ద్వారా సహాయం అందించాలంటూ లక్ష్మీపురం పంచాయతీ కందులవారిపాలెంకు చెందిన మార్తుల సుధాకర్-అనూష దంపతులు గ్రామసభలో అధికారులకు వినతిపత్రం అందించారు. తమ ఒక్కగానొక్క కుమారుడైన హాసిన్ నందన్‌కుమార్ పుట్టుకతోనే కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడన్నారు. కేవలం ఒక్క కిడ్నీ మాత్రమే పనిచేస్తుందని, ప్రస్తుతం సమస్య తీవ్రత ఎక్కువై బాలుడు మూత్రవిసర్జనకు వైద్యాధికారులు శరీరం నుండి పైపు ద్వారా బయటకు బ్యాగు అమర్చారని చెప్పారు. ఇప్పటికే రూ.10లక్షలవరకు వైద్యానికి ఖర్చు చేశామన్నారు. ఇక తమవద్ద వైద్యంచేయించడానికి ఆర్థిక స్థోమత లేదన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ మద్దసాని వెంకటేశ్వరరావు ముఖ్యమంత్రి సహాయనిధినుంచి ఆర్థిక సహాయం అందించడానికి ప్రయత్నిస్తామన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే బొల్లినేని సహకారంతో బాలుడ్ని ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లి వైద్యఖర్చులకు అవసరమైన సహాయసహకారాలు అందిస్తామన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

సీతారామపురం, జనవరి 3: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బుధవారం కావలి డీఎస్పీ రఘు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందచేశారు. అలాగే మండలంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని ఆలయాలు, ప్రార్థనా మందిరాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకొనేలా నిర్వాహకులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివరాకేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ఏఎస్‌పేట, జనవరి 3: తెలుగుదేశం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించడానికి జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని రాజవోలు, దూబగుంట గ్రామాల్లో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

అందరికీ ఆరోగ్యం అదే టీడీపీ లక్ష్యం

కలిగిరి, జనవరి3: రాష్ట్రప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎంపీపీ మద్దసాని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని రావులకొల్లు, లక్ష్మీపురం పంచాయతీలలో బుధవారం జరిగిన జన్మభూమి-మాఊరు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎన్టీఆర్‌వైద్యసేవ కార్యక్రమం ద్వారా పేదప్రజల ఉచితంగా వైద్యసేవలు అందుతున్నాయన్నారు. వైద్యసేవ పరిధిలోకి రాని జబ్బులకు కూడా సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఆర్థికసహాయం అందిస్తున్నారన్నారు. రావులకొల్లు గ్రామస్థులు కావలి-ఉదయగిరి ప్రధాన రహదారి నుంచి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరడంతో అనుమతులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. కందులవారిపాలెం దళితవాడకు బాట సౌకర్యం కల్పించి సమస్యను పరిష్కరిస్తామని కాలనీవాసులకు ఎంపీపీ తెలిపారు.

రెవెన్యూ సమస్యలపై ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ తమ గ్రామంలో జన్మభూమి-మాఊరు గ్రామసభను జరపబోనీయమంటూ గ్రామస్థులు కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి యత్నించారు. గ్రామస్థుల ద్వారా స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేకు ఈ విషయం తెలిసేసరికి కార్యక్రమానికి అడ్డంకులు జరపరాదని, రెవెన్యూ పరిధిలోని సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తామని తెలపడంతో కార్యక్రమం జరిగేందుకు గ్రామస్థులు సహకరించారు. దీంతో అడ్డంకులు లేకుండా సుజావుగా గ్రామసభ జరిగింది.

గ్రామంలో ఇప్పటి వరకు 100మీటర్లు మాత్రమే సిమెంటురోడ్డు నిర్మాణాలు జరిగాయని సుమారు రెండుకిలోమీటర్ల మేర అంతర్గత రహదారులన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయని సీసీరోడ్లు మంజూరు చేయాలని గ్రామస్థులు అధికారులను కోరారు.



కలిగిరి: జాబ్‌కార్డులు అందిస్తున్న ఎంపీపీ



అల్లూరులో..

అల్లూరు : గ్రామాల్లోని సమస్యలను తీర్చేందుకే జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పైడేరు ఎస్కేప్-2 ఛానల్ అధ్యక్షుడు బీద గిరిధర్ పేర్కొన్నారు. మండలంలోని నార్తుఆములూరు పంచాయతీలో బుధవారం జన్మభూమి-మాఊరు గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈవోపీఆర్డీ బ్రహ్మయ్య మాట్లాడుతూ గ్రామంలో మరుగుదొడ్లు నిర్మించుకోవలసిన వారు ఉన్నారని వారు వెంటనే వాటి నిర్మాణాలు పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కుళ్లాయప్పరెడ్డి, సర్పంచ్ పాడేటి సుబ్బయ్య డేవిడ్, ఇన్‌చార్జి తహసీల్దారు అబ్దుల్ హమీద్, ఈవోపీఆర్డీ బ్రహ్మయ్య, రేబాల శంకర్‌రెడ్డి, స్థానిక నాయకులు దాసరి ప్రభాకర్, జన్మభూమి కమిటీ సభ్యులు గుంజి రుద్రయ్య, పెయ్యల భాస్కర్ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై ఒత్తిడి : నార్తుఆములూరులో నిర్వహించి జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో స్థానికులు తమ సమస్యలను తీర్చమని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. పొదుపు మహిళలు తమ సమస్యలను తెలుపుకున్నారు. పింఛన్లు, రేషన్ కార్డుల లబ్ధిదారులు, ఇంటి నివేశన స్థలాలను మంజూరు చేయాలంటూ అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాడేటి సుబ్బయ్య డేవిడ్ మాట్లాడుతూ దాదాపు 40 మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ఒక్కరికి కూడా మంజూరు కాకపోవడం దారుణమన్నారు. 35 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే 14 మాత్రమే మంజూరు చేశారని మిగిలిన వారి సంగతి ఏంటని ఆయన ప్రశ్నించారు. స్థానికులు మాట్లాడుతూ 12 అంకణముల స్థలాల్లో ఇంటి నిర్మాణం సరిగా ఉండదని 18అంకణముల స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనికి ఇన్‌చార్జి తహసీల్దార్ స్పందిస్తూ ఇంటి నివేశన స్థలాల విషయమై త్వరలో సర్వే చేయించి ప్రభుత్వ భూమి ఉంటే తప్పకుండా అనుకూలంగానే కేటాయిస్తామన్నారు.

గోపన్నపాలెంలో జన్మభూమి

జలదంకి, జనవరి3: మండలంలోని గోపన్నపాలెం, ఎల్ఆర్ అగ్రహారంలో బుధవారం జన్మభూమి- మా ఊరు గ్రామ సభలు జరిగాయి. గోపన్నపాలెంలో సర్పంచ్ రామయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీడీవో రవీంద్ర, నోడల్ అధికారి, మిగతా అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. పింఛనులు, రేషన్‌కార్డులు, ఎన్టీఆర్ గృహాలకు ప్రజలు అర్జీలు ఇచ్చారు. ఎల్ఆర్ అగ్రహారంలో జరిగే జన్మభూమి సభకు అధికారుల బృందాన్ని రానియ్యకుండా ఆ గ్రామ రైతులు అడ్డుకున్నారు. మూడేళ్ల నుంచి చెరువు కింద వరి పంటలేదని ఈ ఏడాది సాగునీరు ఇస్తామంటే నారు పోసుకుని వరి నాటుకున్నామని కాని సోమశిల జలాలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ రామ్‌ప్రసాద్ వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేయగా మాకు న్యాయం చేస్తామని గట్టి హామీ ఇస్తే తప్ప సభ జరగనీయ్యమని తెగేసి చెప్పారు. దీంతో అక్కడే ఉన్న సోమశిల జేఈ ప్రవీణ్, ఇరిగేషన్ ఏఈ హరికృష్ణను తహసీల్దార్ పిలిచి సోమశిల జలాలు చెరువుకు పంపిణీ చేయడంలో జాప్యంపై వివరణ కోరారు. దీనిని ఈ ఇంజనీర్లు ఏదో చెప్పే ప్రయత్నం చేయగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువును అధికారులు పరిశీలించి సమస్యను కావలి ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. సోమశిల జలాలు ఇస్తామని ఆర్డీవో హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి సభను కొనసాగించారు. సర్పంచ్ లెక్కల సుజాత అధ్యక్షతన జన్మభూమి- మా ఊరు సభ జరగగా ప్రజలు పలు రకాల సమస్యలపై అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక జన్మభూమి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి

దుత్తలూరు, జనవరి 3: ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికే జన్మభూమి కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని నందిపాడులో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. అర్హులైన నిరుపేదలకు పింఛన్లు, పక్కా గృహాలకు దరఖాస్తులు అందచేయాలని ఆయన కోరారు. పేదవారందరికి రేషన్‌కార్డులు అందచేస్తామన్నారు. ఈ సందర్భంగా చందన్న సంక్రాంతి కానుకలు, నూతన రేషన్‌కార్డులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి రోజ్‌మాండ్, ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, మం డల పార్టీ కన్వీనర్ ఉండేలా గురవారెడ్డి, సొసైటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, సర్పంచ్ మండ శ్రీనివాసులు, ఎంపీడీవో నరసింహారావు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డైరీల పంపిణీ

వరికుంటపాడు, జనవరి 3: స్థానిక విద్యావనరుల కేంద్రంలో బుధవారం యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హజరత్, కరీముల్లాలు తమ శాఖ డైరీని ఎంఈవో షావుద్దీన్‌కు అందచేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. అలాగే పలు గ్రామాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులు, శాఖా నాయకులు, కార్యకర్తలకు డైరీలు, క్యాలెండర్లు, ప్యాకెట్ డైరీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంతారావు, డీ. వెంకటేశ్వర్లు, ఎం.సుబ్బారావు పాల్గన్నారు.



ఎంఈవోకు డైరీ అందచేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రజల సంక్షేమం కోసమే గ్రామసభలు

సీతారామపురం, జనవరి 3: ప్రజా సంక్షేమం కోసమే ప్రభుత్వం జన్మభూమి-మావూరు కార్యక్రమాల ద్వారా గ్రామసభలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని మండల ప్రత్యేకాధికారి ఇస్మాయిల్‌బాషా పేర్కొన్నారు. ఆయన బుధవారం మండలంలోని చిన్నాగంపల్లిలో నిర్వహించిన జన్మభూమిలో పాల్గొని మాట్లాడారు. ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించి ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను గ్రామస్థాయిలో ప్రతిఒక్కరికి చేరేలా జన్మభూమి దోహదపడుతుందన్నారు. అలాగే సర్పంచు మాలకొండయ్య మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం శాఖల వారీగా ప్రగతిని, ,అందిస్తున్న సేవలను సభలో వివరించారు. అలాగే చంద్రన్న కానుకలు, రేషన్‌కార్డులు, ఉపాధి జాబ్‌కార్డులు ప్రజలకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రభాకరరాజు, తహసీల్దారు కోటేశ్వరరావు, ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఎంఈవో మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా పత్రాల పంపిణీ

సీతారామపురం, జనవరి 3: స్థానిక ఎస్సీ కాలనీలో ఇటీవల మృతిచెందిన పిడతల సుధాకర్ కుటుంబ సభ్యులకు బుధవారం చంద్రన్న బీమా నగదు రూ.1.95 లక్షలకు సంబంధించిన పత్రాలను ఏపీఎం వైనారూత్ అందచేశారు. మృతుడికి రూ.2 లక్షల బీమా వర్తించిందని, అంత్యక్రియల రోజు రూ.5 వేలు అందించామని, మిగిలిన నగదు కుటుంబ సభ్యుల ఖాతాలో జమైందన్నారు. ఈ కార్యక్రమంలో బీమా మిత్ర అంకమ్మ, సంఘమిత్ర అధ్యక్షురాలు శారద, పొదుపు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబసభ్యులకు బీమా నగదు పత్రాలు అందిస్తున్న ఏపీఎం వైనారూత్

వళ్లీ ప్రసాద్‌కు సన్మానం

సూళ్లూరుపేట, జనవరి 3 : సూళ్లూరుపేటలో బుధవారం వెనుకబడిన తరగతుల సంక్షేమసంఘం సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించింది. సావిత్రిబాయి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఇటీవల ఢిల్లీలో జాతీయస్థాయి జ్యోతిరావుపూలే అవార్డును అందుకున్న వళ్లీ ప్రసాద్‌ను సన్మానించారు. చిట్టేటి పేరుమాల్, కొక్కు బాల య్య, ఏకాంబరం, బట్టా సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సంక్షిప్తం



అవార్డు అందుకున్న ఉపాధ్యాయిని తన్నీరు శశి

గురుకుల ఉపాధ్యాయినికి సావిత్రిబాయి పూలే అవార్డు

సూళ్లూరుపేట, జనవరి 3 : సూళ్లూరుపేట సాంఘీక సంక్షేమశాఖ గురుకుల పాఠశాల, కళాశాలలో గణిత ఉపాధ్యాయిని తన్నీరుశశి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎన్నికై సావిత్రిబాయి పూలే అవార్డును అందుకున్నారు. బుధవారం విశాఖపట్నంలో ప్రాథమిక విద్యాశాఖామంత్రి గంటా శ్రీనివాసరావు ఈ అవార్డుతో తన్నీరు శశిని సత్కరించారు. తమపాఠశాల ఉపాధ్యాయిని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికై సావిత్రిబాయి పూలే అవార్డు అందుకోవడం పాఠశాలకే గర్వకారణమని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

మందకృష్ణమాదిగను విడుదల చేయాలి

నాయుడుపేట, జనవరి 3 : ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందాకృష్ణ మాదిగ శాంతియుతంగా ఉపవాస దీక్ష చేస్తున్న ఆయనను అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు గోవిందువాసు మాదిగ అన్నారు. నాయుడుపేట అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం రాత్రి ఎంఆర్‌పిఎస్ నాయకులతో కలసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా దీక్ష చేస్తున్న మందాకృష్ణను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులుమాదిగ, కుక్కమల్లి రవిమాదిగ, చంద్రబాబుమాదిగ తదితరులు ఉన్నారు.

సినిమా గైడ్

నాయుడుపేట

శ్రీవెంకటేశ్వర	:	ఎంసీఎ
మురారి	:	ఆక్సిజన్
సీఎస్ తేజ	:	హలో

సూళ్లూరుపేట

శ్రీలక్ష్మి	:	ఎంసీఎ
ఎన్‌వీఆర్	:	హలో

ప్రజా సంక్షేమం కోసమే జన్మభూమి

నాయుడుపేట రూరల్, జనవరి 3 : ప్రజా సంక్షేమం కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మభూమి కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి అన్నారు. నాయుడుపేట పట్టణంలోని రాజగోపాలపురంలో బుధవారం జరిగిన 5వ విడత జన్మభూమి కార్యక్రమంలో మాజీమంత్రి పరసారత్నంతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన పేదవారికి ప్రభుత్వ సంక్షేమపథకాలు అందించే వేదిక జన్మభూమిమాఊరు కార్యక్రమమని ఆయన అన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, సక్రమంగా పేదలకు అందించడంతోపాటు అర్హులకు పథకాలు వర్తింపచేసేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రపంచంలో ఏ రాష్ట్రంలో చేపట్టని ఇలాంటి కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నవ్యాంధ్ర ప్రదేశ్‌లో నిర్వహించడం ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. అనంతరం గర్భిణులకు సీమంత కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. అర్హులైనవారికి రేషన్‌కార్డులు, చంద్రన్నబీమా కార్డులను అందజేశారు. మండలంలోని కూచివాడ గ్రామంలో ఎంపీడీవో శివయ్య ప్రతిజ్ఞతో జన్మభూమి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీవో శీనానాయక్, నాయుడుపేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ మైలారి శోభారాణి, ఏఎంసీ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు కామిరెడ్డి రాజారెడ్డి, సీడీసీ మాజీ ఛైర్మన్ గూడూరు రఘునాధరెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, జడ్పీటీసీ శ్రీరాం ప్రసాద్, వైస్ ఛైర్మన్ అత్తికాయల సుబ్రహ్మణ్యం, మైలారి రాజశేఖర్, ముడూరు శేఖర్, శేషం మునిగోపీ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు : అర్హతే ధ్యేయంగా పేదలకు న్యాయం చేస్తామని తహసీల్దార్ కె.నాగరాజలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరు తమ సమస్యలను మీ గ్రామానికి విచ్చేసిన అధికారులకు తెలియజేసి పరిష్కరించుకో వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచనలమేరకుఅందరూ స్వచ్ఛ భారత్‌ను పాటించాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకొని ప్రభుత్వ ఆలోచనలకు మద్దతుగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా గత జన్మభూమిలో ఇచ్చిన అర్జీల మేరకు మంజూరైన రేషన్‌కార్డులు, పింఛలు అందించారు. ఇలాగే కానూరులో కూడా మండల ప్రత్యేకాధికారి నాగజ్యోతి ఆధ్వర్యంలో జన్మభూమిమాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంక్రాంతి సందర్భంగా చంద్రన్న కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కెసి నాగప్రసాద్, ఎవో శశిధర్, ఎంఈవో సుబ్రహ్మణ్యం, వెలుగు ఏపీఎం పద్మమ్మ, పీఆర్‌ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇలు వెంకటకృష్ణారావు, మనోజ్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు కొండూరు మనోహర్‌రాజు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి గంగాబత్తిన రామకృష్ణ, ఎఎంసీ వైస్ ఛైర్మన్ పునబాక పోలయ్య, మండల టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షులు దామతొట్టి సుబ్రహ్మణ్యం, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.





జన్మభూమిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు, గర్భిణులకు సీమంతాల కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాకాటి, పరసారత్నం

దొరవారిసత్రం: జిల్లాలో రైతాంగం పంట ఇన్సురెన్స్ విషయంలో ప్రతి సంవత్సరం మోసపోతున్నారని నెల్లూరు ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం దొరవారిసత్రం మండలంలో కొత్తపల్లి, సింగనాలత్తూరు గ్రామ పంచాయతీల్లో జరిగిన జన్మభూమి-మాఊరు గ్రామ సభలకు ఆయన మాజీ మంత్రి పరసారత్నం, మాజీ ఎంపి నెలవల సుబ్రమణ్యంలతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట ఇన్సురెన్స్ బ్యాంకుల ద్వార రైతు కడుతున్నప్పటికి, రైతు నష్టపోయినప్పుడు ఆ ఇన్సురెన్స్ తిరిగి చెల్లించడం లేదని తెలిపారు. నెల్లూరు జిల్లా రైతులు ఈ విషయంలో ప్రతిసారీ ఇన్సురెన్స్ కంపెనీల చేతుల్లో మోసపోతు న్నారని, ఈ విషయంలో స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని తాను స్వయాన వ్యవసాయశాఖ మంత్రికి కూడ తెలియజేసినట్లు తెలిపారు. రైతాంగాని ఆదుకొనేలా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు. రైతుల కోసం ఈ రాష్ట్ర ప్రభుత్వం తెలుగు గంగ నీటిని మారుమూల గ్రామాలకు సైతం తరలించి పంటలను కాపాడుకొనేలా చర్యలు చేపట్టినట్లు మాజి మంత్రి పరసా తెలిపారు. సీఎం చంద్రబాబు కష్టాన్ని నమ్ముకొని రాత్రింభవళ్ళు ఈ రాష్ట్ర భవిష్యత్తు కోసం పనిచేస్తుంన్నారని, ఈ విషయంలో ఆయనకు ప్రజలు అండగా నిలవాలని మాజి ఎంపి నెలవల సుబ్రమణ్యం తన ప్రసంగంలో తెలిపారు. మండలంలో తల్లంపాడు, నెల్లూరు పల్లి గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో మండల జడ్పీటీసీ సభ్యురాలు ముప్పాళ్ల విజేత, మండల టీడీపీ అధ్యక్షులు వేనాటి సతీష్‌రెడ్డిలతో కలసి పాల్గొన్నారు. సిఎం చంద్రబాబు రాష్ట్రంలో పేదల కోసం అమలు చేస్తున్న పథకాలు గురించి వారు ఈ సందర్భంగా వివరించారు. చంద్రన్నకానుకలు, కొత్తరేషన్ కార్డులు, రుణమాఫీ కార్డులను పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ ఛైర్మేన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి, నాయుడుపేట ఆర్డీవో శీనన్నాయక్, మండల ప్రత్యేక అధికారి రాజ్‌కుమార్, వేస్ట్‌మేనేజ్‌మెంట్ జిల్లా ప్రత్యేక అధికారి సరళ, ఎంపిడివో చంద్రశేఖర్, తహసిల్దార్ వెంకటేశ్వరరావు, నాయుడుపేట సిఐ మల్లిఖార్జున్‌రావు, ఎస్‌ఐ కోటిరెడ్డి, ఇతర శాఖల అధికారులతో పాటు మండల దేవాడి సుధాకర్‌రెడ్డి, మునస్వామినాయుడు, వెంకటాచలంరెడ్డి, రాధక్రిష్ణమనాయుడు, రవీంద్రనాయుడు, వేమసాని శ్రీనివాసులునాయుడు, సురేంద్రరెడ్డి, షబ్బీర్, వెంకటేశ్వర్లుయాదవ్ పాల్గొన్నారు.

పేటకు చేరుకున్న సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీలో ఉన్నతాధికారులు, విద్యార్థులు

నాయుడుపేట, జనవరి 3 : ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం గౌరవ డైరెక్టర్ మాదిరెడ్డి ప్రతాప్ ఆదేశాల మేరకు గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా శ్రీకాకుళం నుండి అనంత పురం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా డిసెంబరు 27న శ్రీకాకుళంలో ప్రారంభమై నాయుడుపేటకు బుధవారం చేరుకుంది. ఈ ర్యాలీ జనవరి 7న అనంత పురంలో ముగిసేవరకు 1168 కిలోమీటర్లు ర్యాలీ జరుగుతుందన్నారు. ర్యాలీని డీఐజీ యేసురత్నం పర్యవేక్షిస్తున్న ట్లు వారు తెలిపా రు. ఎస్‌పిఎఫ్, డీఎస్పీ రెడ్డినాయక్ ఆధ్వర్యం లో నెల్లూరు యూనిట్ నుండి 60 మంది సిబ్బంది పాల్గొన్నట్లు వారు తెలిపారు. ర్యాలీలో జిల్లా ఉన్నతాధికా రులు, పాఠశాల, కళాశాల విద్యార్థులు, స్థానిక యువకులు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా ఇసుక పట్టివేత

తడ, జనవరి 3 : మండలంలోని పలు ప్రాంతాలలో ఇసుకరవాణా చేసే పలు ట్రాక్టర్లను ఇసుకడంప్‌లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ దాసరి వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలమేరకు మంగళవారం అర్థరాత్రి సమయంలో నెల్లూరు నుంచి తమిళనాడులోకి అక్రమంగా 5 ట్రాక్టర్లల్లో ఇసుక తరలివెళ్తుందంటూ సమాచారం అందిందని దానిపై నిఘా పెట్టామని అయితే ఈ ట్రాక్టర్లు నెల్లూరు నుంచి బోడిలింగాలపాడు వరకు జాతీయ రహదారిపై వచ్చి అక్కడ నుంచి అనపగుంట, పూడి మీదుగా చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారిపైకి వచ్చి చెన్నై వైపు వెళ్తుండటం గుర్తించి చెక్‌పోస్టు దాటిన తరువాత ఆ 5 ట్రాక్టర్లను పట్టుకున్నామని తెలిపారు. ఆ ట్రాక్టర్లకు సంబంధించి పూడి, కారూరు గ్రామాలకు చెందిన ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఆయన తెలిపారు. చెక్‌పోస్టుకు సమీపం కారూరుమిట్ట వద్ద ఓ ఇసుక డంప్ ఉండటాన్ని ఆసమయంలోనే గుర్తించి దానిని రెవెన్యూ అధికారులకు అప్పగించామని తెలిపారు. అలా స్వాధీనం చేసుకున్న డంప్‌లో 8 ట్రాక్టర్ల ఇసుక ఉండటంతో ఆ ఇసుకను రామాపురం ఎన్టీఆర్ గృహ నిర్మాణాల వినియోగం కోసం తహసీల్దార్ ఏడుకొండలు ఆదేశంతో రెవెన్యూ అధికారులు తరలించారు. అక్కడికి కొద్దిదూరంలో ఆంధ్ర, తమిళనాడు సరిహద్దు ప్రాంతం ఆరంబాకం వద్ద సుమారు 15 ట్రాక్టర్ల ఇసుకడంప్‌ను బుధవారం తెల్లవారుజామున వీటి అన్నింటిపై కేసులు నమోదు చేస్తున్నామని ఎస్‌ఐ దాసరి వెంకటేశ్వరరావు చెప్పుకొచ్చారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

▸▸ కాంటాక్ ఉద్యోగుల నిరసన



డీఈ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు

నాయుడుపేటరూరల్, జనవరి 3 : ఎపీ ట్రాన్స్‌కో, జెన్‌కోలలో పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను విద్యుత్ సంస్థలోకి విలీనం చేయాలని విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. నాయుడుపేట విద్యుత్‌శాఖ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట బుధవారం ప్లేకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుభవాన్ని, వయస్సును పరిగణలోకి తీసుకొని దశలవారీగా క్రమబద్దీకరించాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు కార్మికులు మరణిస్తే 20 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తూ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. విద్యుత్ రంగంలో ఔట్ సోర్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టె నిర్ణయాలను వెంటనే ప్రభుత్వం ఆపివేయాలన్నారు. ఈనెల 4వ తేదీన నెల్లూరులో జరిగే విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఆత్మీయ సదస్సులో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

సూళ్లూరుపేట



డిపో మేనేజర్ బాధ్యతలు స్వీకరణ

సూళ్లూరుపేట, జనవరి 3 : సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌గా టీ కులైస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎం బదిలీపై వెళ్లారు. నూతన డిపో మేనేజర్‌కు ఎన్‌ఎంయు నేతలు ఎం. శేఖర్, యువి గోపాల్, డీ పోలయ్య, కే మునుస్వామి, పుష్పగుచ్ఛంతో స్వాగతించారు. డిపో అభివృద్ధికి తమ యూనియన్ సహకారం ఎల్లవేళలా అందిస్తామని చెప్పారు.

ఆడపడుచులకు అన్నలా సీఎం చంద్రబాబు

» జన్మభూమి సభలో ఎమ్మెల్సీ వాకాటి

సూళ్లూరుపేట, జనవరి 3 : గర్భిణులకు నాయకులు బొట్టుపెట్టారు... గాజులు, పూలు.. తాంబూళాలు ఇచ్చి ఆశీర్వాదించారు... ముఖ్యమంత్రి చంద్రబాబు మీకు అన్నలా ఇలా సీమంతాలు చేయిస్తున్నాడని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి చెప్పారు. మీకు పుట్టిల్లులా ఆదరిస్తున్న చంద్రబాబు నాయుడును మీరంతా అండగా ఉండాలని చెప్పారు. సూళ్లూరుపేటలోని 5, 6 వార్డులకు రాజీవ్‌నగర్‌లో జరిగిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో వాకాటి పాల్గొని దగ్గరుండి సీమంత కార్యక్రమాలను నిర్వహించారు. ఆయనతోపాటు జడ్పీఫ్లోర్ లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి, మాజీమంత్రి పరసారత్నం, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, ఏఎంసీ చైర్మన్ టి. సుధాకర్‌రెడ్డి, చెంగాళమ్మ ఆలయ చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి, మాజీ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, ఆర్డీవో శీనానాయక్, తదితర అధికారులు పాల్గొన్నారు. చైర్ పర్సన్ నూలేటి విజయలక్ష్మి ఆధ్వర్యంలో రేషన్‌కార్డులు, చంద్రన్నబీమా బాండ్లు, చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు. కమిషనర్ రాజగోపాల్‌రావు ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమం జరిగింది. కౌన్సిలర్ శ్రావణ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు. కేసీఎన్ గుంట, మంగానెల్లూరు, ఆబాక, కడపత్ర గ్రామాల్లో జన్మభూమిమాఊరు కార్యక్రమాలను నిర్వహించారు. కేసీఎన్‌గుంట మంగానెల్లూరులలో జడ్పీ ఫ్లోర్ లీడర్ వేనాటి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో శివప్రసాద్, టాస్క్‌ఫోర్స్ అధికారి రమణారెడ్డి తదితరులు మండలంలో జన్మభూమి సభలను నిర్వహించారు.

తడ : చేనిగుంట, రామాపురం, వేనాడు పంచాయతీల్లో జరిగింది. వేనాడు పంచాయతీలో ఎంపీడీవో రమణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామస్థులు పలు సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్టీసీ బస్సులను వేనాడుకు ఎక్కువ ట్రిప్పులు తిరిగేలా చర్యలు తీసుకోవాలని కోరగా ఆర్టీసీ అధికారులు అంగీకరించారు. సర్పంచ్ శ్రీదేవి, టీడీపీ లీగల్‌సెల్ ఉపాధ్యక్షులు సుదర్శన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. రామాపురం పంచాయతీలో డిప్యూటీ తహసీల్దార్ జయజయరావు అధ్యక్షతన జరిగింది. సర్పంచ్ సుశీల, మండల అధ్యక్షురాలు సెల్వీ రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ముగ్గులు పోటీలు జరిగాయి. చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేశారు.

చిట్టమూరు : మండలంలో బుధవారం జరిగిన జన్మభూమి ఆటపాటలతో కళకళాడింది. పిట్టివానిపల్లి, అరవపాళెం, పల్లంపర్తి గ్రామాల్లో జరిగిన జన్మభూమి, మాఊరు కార్యక్రమాన్ని ఆయా సర్పంచ్‌లు అధ్యక్షతన సిఎం సందేశంతో ప్రారంభం జరిగింది. జన్మభూమి, మాఊరు కార్యక్రమం అనంతరం చిన్నారులకు, మహిళలకు ఆటపాటలు, ముగ్గులు, కుర్చీలాట వంటి కార్యక్రమలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో సురేష్‌బాబు, తహసిల్దార్ చంద్రశేఖర్, ఇవోపీఆర్‌డీ వీరబ్రహ్మం, పలు శాఖల అదికారులు పాల్గొని ఆయా శాఖల వారీగా వచ్చిన అర్జీలను స్వీకరించారు.



వైద్యాధికారిణి ప్రశ్నిస్తున్న వేనాటి రామచంద్రారెడ్డి



తడ : చేనిగుంటలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్సీ వాకాటి, ఇతర నాయకులు, అధికారులు

ఉన్న ఇసుకంతా అమ్మేశాం

» చేనిగుంట గ్రామసభలో నేతలకు చురకలంటించిన ఎమ్మెల్సీ వాకాటి

తడ, జనవరి 3 : ఇప్పటికే ఉన్న ఇసుకంతా అమ్మేశాం.. మిగిలిన ఇసుకైనా దాచుకోవాలికదా... పోలీస్‌శాఖ దాడులు చేస్తుండటంతో తప్పులేదు.. అలాగని అసలైన లబ్ధిదారులకు ఇసుక అందేలా ఆశాఖ సైతం చర్యలు తీసుకోవాలి. అంతేకాని ఇసుకను అక్రమంగా తమిళనాడుకు తరలిస్తేమాత్రం ప్రభుత్వం ఊరుకోదని తెలుగుదేశం నేతలకు ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి చురకలంటించారు. చేనిగుంట సభలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు టీడీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. తమ స్వగ్రామానికి నీళ్ల కటకటలు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ఇప్పటికే రెండు చెక్ డ్యామ్‌లు నిర్మించామని అక్కడ నుంచి ఆనీటిని పైపుల ద్వారైనా చెరువులకు తీసుకొచ్చేందుకు ఇరిగేషన్‌శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. తూర్పువైపు ఉన్న 250 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇతరరాష్ట్రాల్లో నివాసాలు ఉండే కొంతమందికి పట్టాలు ఇచ్చి ఉన్నారని వాటి అన్నింటిని రద్దుచేసి స్థానిక పేదలకు అందజేయాలని కోరారు. ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, వేనాటి పరంధామరెడ్డి ఇక్కడే ఉండగా గ్రామానికి సమస్యలు ఏమీ ఉండవని మాజీ మంత్రి పరసారత్నం చమత్కరించారు. నోడల్ అధికారిశ్రీకాంత్ నాథ్‌రెడ్డి, నాయుడుపేట ఆర్డీవో శీనానాయక్, మాజీమంత్రి పరసారత్నం, చెంగాళమ్మ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, ప్రస్తుత చైర్మన్ ముప్పాళ్ల వెంకటేశ్వర్లురెడ్డి, నాయుడుపేట, సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్‌లు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాయుడుపేట, జడ్పీటీసీలు, శ్రీరాం ప్రసాద్, బొమ్మన శ్రీధర్, తహసీల్దార్ ఏడుకొండలు, ఎంపీడీవో రమణయ్య, టీడీపీ నేతలు గూడూరు రఘునాధరెడ్డి, బొమ్మన పళణి, మునిరెడ్డి, సర్పంచులు రాజారెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తం



అవార్డు సాధించిన జూనియర్ చాంబర్ అధ్యక్షుడిని అభినందిస్తున్న సభ్యులు

జూనియర్ చాంబర్‌కు అవార్డులు

సూళ్లూరుపేట, జనవరి 3 : సూళ్లూరుపేట జూనియర్ చాంబర్ రెండు ఇంర్నేషనల్ అవార్డులను అందుకుంది. మంగులూరులో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ జరిగింది. అందులో పేట జూనియర్ చాంబర్‌కు అవార్డులను ప్రకటించారు. స్థానిక జూనియర్ చాంబర్ అధ్యక్షులు దుగ్గి సుదర్శన్‌గుప్తా అవార్డులను అందుకున్నారు. సూళ్లూరుపేటలో బుధవారం జూనియర్ చాంబర్ సభ్యులు సమావేశమై తమ హర్షం వ్యక్తం చేశారు.

గిరిజనులకు ఎంపీటీసీ భూలక్ష్మి చేయూత

నాయుడుపేట, జనవరి 3 : కూలీ పనులు చేసుకొని పూటగడుపుకొని నిరుపేద గిరిజనులకు తనవంతుగా టీడీపీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి జువ్వలపాళెం ఎంపీటీసీ పనబాక భూలక్ష్మి తనవంతుగా చేయూత అంది స్తున్నారు. జువ్వలపాళెం పంచాయతీ పరిధిలోని శ్రీనివాసపురం, బట్టివిడత, మందబైలు, జువ్వలపాళెం కట్టమీద ఉన్న గిరిజనవాసులకు రేషన్ బియ్యంకు సంబంధించి 4వేల కిలోలకు ఆమె నగదును అందించి గిరిజనులకు అందజేశారు.



వైసీపీ మండల కన్వీనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

మాకు పింఛన్లు మంజూరు చేయండి

నాయుడుపేటరూరల్, జనవరి 3 : నాయుడుపేట మండలం జువ్వలపాళెం పంచాయతీలోని బట్టివిడతకాలనీ మహిళలు బుధవారం వైసీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి ద్వారా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు వినతిపత్రం అందజేశారు. కాలనీలో పింఛన్లు మంజూరు కాకుండా చాలామంది ఉన్నారని ఎన్ని పర్యాయాలు జన్మభూమి కార్యక్రమం నిర్వహించినా ఫలితం లేకుండా పోతుందని వారు తెలియజేశారు. జరుగుతున్న 5వ విడత జన్మభూమి మాఊరు కార్యక్రమాన్ని కాలనీలో అడ్డుకొంటున్నట్లు వారు వినతిపత్రంలో తెలియజేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి పింఛన్ల మంజూరు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వారు తెలియజేశారు.

సావిత్రిబాయిఫూలే జయంతి వేడుకలు



రొట్టెలు పంపిణీ చేస్తున్న బీసీ సంఘ నాయకులు

నాయుడుపేట, జనవరి 3 : నాయుడుపేట పట్టణం చేయూత అనాథశ్రమంలో సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకొని బుధవారం పిల్లలకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగాబీసీ సంఘ నాయకులు జువ్వలపాటి మస్తాన్ మాట్లాడుతూ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను అనాథశ్రమంలో పిల్లల నడుమ నిర్వహించడం సంతోషమని ఆయన తెలిపారు. బీసీసంఘ నాయకులు రామయ్య, ప్రతాప్, బాలాజీ, శేఖర్, సుబ్బారావు, చేయూత అనాథశ్రమ నిర్వాహకులు తోప్పాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటరూరల్ : నాయుడుపేట మండల పరిధిలోని పూడేరు ఉన్నత పాఠశాలలో బుధవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆడేరు సుధాకర్, సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేశారు. సుధాకర్ మాట్లాడుతూ భారతదేశంలో 18వ దశకంలో బాలికవిద్య లేని రోజుల్లో జ్యోతిరావుపూలే చొరవతో చదువుకొని మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినిగా సావిత్రిబాయి పూలే మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హిందీ పండిట్ జి. మంజులను సన్మానించి మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు చాక్లెట్లు పంచిపెట్టిన తెలుగుపండిట్ జి. వెంకటేశ్వర్లును సుధాకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.గోపాల్‌కృష్ణ, కె. మునిసుబ్బులు, కె. సుబ్రహ్మణ్యం, పి.సుబ్బారావు, సి. శశిధర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తడ : సావిత్రిభాయి పూలే జయంతిని మండలంలో ఘనంగా నిర్వహించారు. పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయినులను మండలాధ్యక్షురాలు సెల్వీ రమేష్ స్థానిక మండలరిసోర్స్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పూర్ణచంద్రరావు, తడకండ్రిగ సర్పంచ్ గుణసుందరి రామమూర్తి, పలువురు పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట : సావిత్రిబాయి పూలే దేశంలో తొలి ఉపాధ్యాయినిగా పనిచేసి మహిళా ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారని స్థానిక ఎంఈవో కటారి ఉదయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఎంఈవో కార్యాలయంలో సావిత్రిబాయి పూలే 187వ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్సీ బాలికల హాస్టల్‌లో సమతాసైనిక్‌దళ్ సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఇ. అంకయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినిలు కామాక్షమ్మ, మస్తానమ్మ, వార్డెన్ సరస్వతి, వై. సుబ్రహ్మణ్యం, రాజ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీలు

గ్రిగ్ పోటీల్లో శ్రీహరికోట విద్యార్థుల హవా

సూళ్లూరుపేట, జనవరి 3 : నాయుడుపేటలో జరిగిన గ్రిగ్ పోటీలలో శ్రీహరికోట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ హవా చాటారు. ఈ స్కూల్ విద్యార్థులు 18 బహుమతులను సాధించి తమ పాఠశాల సత్తాను చాటారు. బాలుర 100 మీటర్ల, 200 మీటర్ల, పరుగు పందెంలో పి.వంశీ ప్రథమస్థానం, బాలికల 100 మీటర్ల పరుగును పి. పవిత్ర 3వ స్థానం, 400 మీటర్ల పరుగులో పి. పవిత్ర ప్రథమస్థానం సాధించారు. బాలికల షార్ట్‌పుట్‌లో, జావలింగ్ త్రోలో వైష్ణవి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించింది. బాలుర షార్ట్‌పుట్‌లో యువరాజ్ ద్వితీయస్థానం, బాలుర జావలింగ్‌త్రోలో టి. విజయకృష్ణ తృతీయస్థానంలో నిలిచారు. డిస్కస్ త్రోలో పి. విజయకృష్ణ ప్రథమస్థానంలో నిలిచాడు. 100 మీటర్ల ఆచరీ పోటీలలో సీహెచ్ రమ్య తృతీయ బహుమతిని సాధించింది. వీటితోపాటు బాలుర త్రోబాల్‌లో బాలికల త్రోబాల్‌లో ఈ పాఠశాల విద్యార్థులు రన్నర్‌గా నిలిచారు. బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలలో విన్నర్‌గా నిలిచారు. బాలుర హ్యాండ్‌బాల్, బాలికల ఖోఖో, సీనియర్ బాలుర సాఫ్ట్‌బాల్, జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలలో రన్నర్ స్థానాలను కైవశం చేసుకున్నారు. ఇలా తమ పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున బహుమతులు సాధించుకువచ్చినందుకు బుధవారం పాఠశాలలో వారికి అభినందన సభ నిర్వహించారు. హెచ్‌ఎం ప్రశాంతి పెద్ద ఎత్తున విద్యార్థులు బహుమతులు సాధించేలా శిక్షణ ఇచ్చినందుకు పీఈటీ భాస్కర్‌ను అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.